ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 14.02.2025 | సంపుటి : 11 సంచిక : 214 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV




## హైదరాబాద్ గడ్డపై మైక్రోసాఫ్ట్

# కొత్త క్యాంపస్

### నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్

- ఒకేసారి 2500 మంది ఉద్యోగులు విధులను నిర్వర్తించడానికి అవకాశం
- రూ.15 వేలకోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించిన సంస్థ
- నగరాన్ని ప్రపంచ టెక్నాలజీ పవర్ హౌస్ గా తీర్చిదిద్దుతాం
- మైక్రోసాఫ్ట్ విస్తరణతో యువతకు మరిన్ని అవకాశాలు
- సాంకేతికరంగంలో వారు సత్తాచాటాలి
- అడ్వాంటేజ్ తెలంగాణ కార్యక్రమం కింద రాష్ట్రంలోని 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ కోర్సును పరిచయం చేసేందుకు కార్యచరణ
- తద్వారా 50వేల మందికి విద్యార్థులకు పరిపూర్ణమైన శిక్షణ లభించే అవకాశం : సీఎం రేవంత్

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) : ప్రపంచ ఐటి దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యంతో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పరిధిలో 11 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యధిక ప్రమాణాలతో నిర్మించిన మైక్రోసాఫ్ట్ నూతన కార్యాలయాన్ని గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ అధునాతన మైక్రోసాఫ్ట్ కార్యాలయంలో 2 వేల 500 మంది ఉద్యోగులు ఒకేసారి విధులను నిర్వర్తించడానికి అవకాశం కలుగుతుంది. మైక్రోసాఫ్ట్ సంస్థ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందంలో మిగతా 2లో..

### అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కోర్ అర్బన్ ఏరియా అభివృద్ధి

నగరవాసులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలి

అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

వార్త 2లో

### హైదరాబాద్‌లో గూగుల్ ఏఐ కేంద్రం

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కంపెనీ ప్రతినిధుల ఎంవోయూ
- వ్యవసాయం, విద్య, రవాణారంగం, ప్రభుత్వ డిజిటల్ కార్యకలాపాలకు సహకరించనున్న కేంద్రం

హైదరాబాద్(జనంసాక్షి): నగరంలో ఏఐ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు గూగుల్ ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. టీహబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో గూగుల్ ప్రతినిధులు ఎంఓయూ కుదుర్చుకున్నారు. కృత్రిమ మేధ అంకుర పరిశ్రమలకు గూగుల్ తోడ్పాటునందించనుంది. వ్యవసాయం, విద్య, రవాణారంగం, ప్రభుత్వ డిజిటల్ కార్యకలాపాలకు గూగుల్ ఏఐ మిగతా 2లో..



## అమెరికాతో ప్రపంచ సమగ్ర వ్యూహాత్మక

# భాగస్వామ్యాన్ని నిర్మిస్తాం

### ట్రంప్‌తో భేటికి ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాను

అమెరికాలో ప్రధాని మోదీకి ఘనస్వాగతం పలికిన భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా

ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ట్రంప్‌తో చర్చలు • ఎలన్‌మస్క్‌తోనూ భేటి అయ్యే అవకాశం



వాషింగ్టన్(జనంసాక్షి): అమెరికాలో రెండు రోజుల పర్యటన కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వాషింగ్టన్‌కు చేరుకున్నారు. అమెరికాలోని భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా, ఇతర అధికారులు ప్రధాని మోదీని విమానాశ్రయంలో స్వాగతించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన కోసం గురువారం అమెరికాకు చేరుకున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానం మేరకు ఆయన అమెరికా పర్యటన చేపట్టారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'డొనాల్డ్ ట్రంప్‌ను కలవడానికి, భారతదేశం-యుఎస్ఎ సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నిర్మించడానికి ఎదురుచూస్తున్నాను. మన దేశాలు, మన ప్రజల ప్రయోజనం కోసం మెరుగైన భవిష్యత్తు కోసం కలిసి పనిచేస్తూనే ఉంటాయి' అని ఆయన పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురువారం తెల్లవారు జామున మిగతా 2లో..

# మణిపుర్‌లో రాష్ట్రపతి పాలన

### నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర హోంశాఖ



న్యూఢిల్లీ(జనంసాక్షి):జాతుల మధ్య ఘర్షణలతో అట్టుడుకుతున్న మణిపుర్‌లో కేంద్రం 'రాష్ట్రపతి పాలన' విధించింది. ఇందుకు సంబంధించి కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ ఇటీవల తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ పరిణామం జరిగిన కొద్ది రోజుల వ్యవధిలోనే అక్కడ రాష్ట్రపతి పాలన విధించడం గమనార్హం."మణిపుర్ గవర్నర్ సమర్పించిన నివేదికతోపాటు మిగతా 2లో..

### 19న బిఆర్ఎస్ విస్తృతస్థాయి

# సమావేశం

కెసిఆర్ అధ్యక్షతన ఏర్పాటు

ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించే అవకాశం



హైదరాబాద్(జనంసాక్షి):ఈ నెల 19న భారత రాష్ట్ర సమితి విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరుగనున్నది. తెలంగాణ భవన్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశాశం జరుగనుంది. త్వరలోనే పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుక జరుగనున్నది. ఈ క్రమంలో నే విస్తృత స్థాయి కార్యవర్గాన్ని సమావేశ పరచాలని కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు భేటీ నిర్వాహణకు సంబంధించి పార్టీ కార్యవర్గ నిర్వహణ అధ్యక్షుడు కేటీఆర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ భేటీలో బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ సభ్యత్వ మిగతా 2లో..

## అన్నదాతలపై వేధింపులు సరికాదు

రైతులపై బ్యాంకు సిబ్బంది వ్యవహరించిన తీరుపై కేటీఆర్ మండిపాటు 2లో

### ఫాంహౌస్‌లో కోడి పందేల నిర్వహణ కేసులో ..

# భారాస ఎమ్మెల్సీకి నోటీసులు

- ఫామ్‌హౌస్‌లో నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- ఆ ఫామ్‌హౌజ్ నా ఆధీనంలో లేదు
- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి వివరణ

హైదరాబాద్(జనంసాక్షి):నగర శివారులోని మొయినాబాద్ మండలం తొల్కట్ట ఫామ్‌హౌస్‌లో కోడి పందేల నిర్వహణ కేసులో భారాస ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. మాదాపూర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి నోటీసులు అందజేశారు. కోడి పందేల నిర్వహణపై వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. ఫామ్‌హౌస్‌ను భూపతిరాజు అనే వ్యక్తికి లీజుకు ఇచ్చామని ఎమ్మెల్సీ చెబుతున్న నేపథ్యంలో దీనికి సంబంధించిన సమగ్ర సమాచారం ఇవ్వాలని పోలీసులు మిగతా 2లో..

### సినిమా థియేటర్లలో మైనర్ల ప్రవేశం..

## సింగిల్ బెంచ్ తీర్పుపై

# హైకోర్టులో సవాల్



**మల్టీప్లెక్స్ యాజమాన్యాల సంఘం పిటిషన్**

హైదరాబాద్(జనంసాక్షి): సినిమా థియేటర్లలోకి పిల్లల ప్రవేశంపై తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ మల్టీప్లెక్స్ యాజమాన్యాల సంఘం పిటిషన్ దాఖలు చేసింది.పదహారేళ్లలోపు పిల్లల్ని రాత్రి 11గంటల నుంచి ఉదయం 11 గంటల్లోపు థియేటర్లలోకి అనుమతించవద్దని ఇటీవల హైకోర్టు ఆదేశించింది. దీనిపై అన్ని వర్గాలతో చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. మిగతా 2లో..

### విభజన తర్వాత తెలంగాణను

# అప్పులకుప్ప చేశారు

- మద్దతుగా కేంద్రం ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం కనిపించడంలేదు
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై రాజ్యసభలో కేంద్రమంత్రి నిర్మల కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ(జనంసాక్షి):తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై రాజ్యసభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. విభజన నాటికి తెలంగాణ మిగులు బడ్జెట్‌లో ఉందని, ఆ తర్వాతే అప్పుల్లో కూరుకుపోయిందని అన్నారు. తమ ప్రభుత్వం ఏ రాష్ట్రం పట్ల వివక్ష చూపట్లేదని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు."తెలంగాణ అప్పుల్లో కూరుకుపోయిన విషయం వాస్తవం. కేంద్రం ఎన్ని చర్యలు చేపట్టినా ఆ రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోతోంది. అప్పుల విషయంలో ఏ పార్టీని నిందించట్లేదు. బీబీ నగర్ ఎయిమ్స్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. 2014 నుంచి తెలంగాణలో 2,605 కి.మీ మేర హైవేల నిర్మాణం జరిగింది. భారత్ మాల కింద నాలుగు గ్రీన్‌ఫీల్డ్ కారిడార్లు నిర్మించాం. ఈ ఏడాది తెలంగాణలో రైల్వేకు రూ. 5,337 కోట్లు కేటాయించాం. ఐదు వందే భారత్ రైళ్లు మంజూరు చేశాం. 40 రైల్వే స్టేషన్లు ఆధునికీకరిస్తున్నాం. పీఎంఏవై కింద పట్టణాల్లో 2లక్షల ఇళ్లు నిర్మించాం. స్వచ్ఛభారత్ కింద 31 లక్షల మరుగుదొడ్లు మిగతా 2లో..

## వక్ఫ్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

నిరసనల మధ్యే ప్రవేశ పెట్టిన ప్రభుత్వం

గందరగోళం మధ్య సభ వాయిదా 2లో



### పార్లమెంట్‌లో 'ఐటి' రగడ

నిరసనల మధ్యే నూతన ఆదాయపన్ను చట్టం బిల్లును లోక్‌సభలో ప్రవేశ పెట్టిన నిర్మలా సీతారామన్

విపక్షాల నిరసన.. వాకౌట్

లోక్‌సభ మార్చి 10కి వాయిదా

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రస్తుతం అమలులో ఉన్న దశాబ్దాల నాటి ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కేంద్రం కొత్త చట్టాన్ని తీసుకురానుంది. దీనిలో భాగంగా ఆదాయపు పన్ను (ఐటీ) నూతన బిల్లు పార్లమెంటు ముందుకు వచ్చింది. విపక్షాల నిరసనల మధ్యే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో ప్రకటించిన మేరకు బిల్లును తీసుకుని మిగతా 2లో..

## బందీలను విడుదలచేయకుంటే

# మళ్లీ యుద్ధమే

### హమాస్‌కు ఇజ్రాయెల్ హెచ్చరిక



టెల్‌అవీవ్(జనంసాక్షి): హమాస్ తన చెరలో ఉన్న బందీలను శనివారం నాటికి విడుదల చేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్ సైతం డెడ్‌లైన్ విధించిన సంగతి తెలిసిందే.ఈక్రమంలో ఇజ్రాయెల్ మరో కీలక ప్రకటన చేసింది. ఈ వారాంతంలో తమ బందీలను విడుదల చేయకపోతే.. యుద్ధం తిరిగి ప్రారంభమవుతుందని హెచ్చరించింది. ఈ విషయాలను ఆ దేశ రక్షణ మంత్రి కాట్జ్ వెల్లడించారు. 'కొత్త యుద్ధం మొదలవుతుంది. బందీలందరినీ విడిచిపెట్టేవరకు అది ఆగదు. గాజా స్వాధీనంపై ట్రంప్ ప్రణాళికను అమలు చేస్తాం' అని కాట్జ్ పేర్కొన్నారు. ఖతర్, ఈజిప్టు మధ్యవర్తిత్వంతో గత నెల ఇజ్రాయెల్- హమాస్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది. ఇందులో భాగంగా.. హమాస్ తమ చెరలోని బందీలను విడుదల చేస్తుంది. ప్రతిగా తమ జైళ్లలో ఉన్న పాలస్తీనా పౌరులను ఇజ్రాయెల్ విడిచిపెడుతుంది. ఇప్పటివరకు పలు దఫాలుగా 21 మంది బందీలను మిలిటెంట్ సంస్థ విడుదల చేయగా.. 730 మంది పాలస్తీనా ఖైదీలను టెల్‌అవీవ్ విడిచిపెట్టింది. ఈక్రమంలో తదుపరి విడుదల ప్రక్రియ శనివారం నిర్ణయించగా హమాస్ అనూహ్యమైన ప్రకటన చేసింది. కాల్పుల విరమణను ఇజ్రా యెల్ ఉల్లంఘిస్తుందని మిగతా 2లో..


## భేటీలు తీర్పులను ప్రభావితం చెయ్యవు

వ్యవస్థల ఆధారంగానే పనితీరు ఉంటుంది

తీర్పుల్లో రాజకీయ జోక్యాలపై మాజీ సిజెఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ఖండన 2లో

## ఇరాన్‌పై దాడికి ఇజ్రాయెల్ సన్నాహాలు

అమెరికా ఇంటెలిజెన్స్ నివేదిక వెల్లడి



2లో

# సరిహద్దుల్లో కవ్వింపు చర్యలు

### నియంత్రణ రేఖ వెంబడి పాక్ కాల్పులు .. ధీటుగా స్పందించిన భారత్



జమ్మూ(జనంసాక్షి): పొరుగుదేశం పాకిస్థాన్ మరోసారి కవ్వింపులకు పాల్పడింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి సరిహద్దుల్లోని నియంత్రణ రేఖ వెంబడి కాల్పులకు దిగింది.దీంతో అప్రమత్తమైన భారత బలగాలు శత్రువులకు గట్టిగా బుద్ధి చెప్పాయి. ఈ ఘటనలో దాయాది సైన్యం వైపు భారీగా ప్రాణనష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలోని కృష్ణ ఘాటి సెక్టార్‌లో బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. నియంత్రణ రేఖ వెంబడి తార్కుండి ప్రాంతంలో ఉన్న ఫార్వర్డ్ పోస్ట్‌పై పాక్ సైన్యం జరిపిన కాల్పులను భారత బలగాలు తిప్పికొట్టాయి. ఈ కాల్పుల్లో శత్రువుల వైపు 'భారీ ప్రాణనష్టం' జరిగిందని భద్రతా అధికారులు వెల్లడించారు. అయితే, మృతుల సంఖ్య వివరాలను మాత్రం స్పష్టంగా చెప్పలేదు. అయితే, ఈ సమాచారాన్ని భారత సైన్యం ఇంకా ధ్రువీకరించలేదు. కాల్పుల విరమణ ఉల్లంఘనకు సంబంధించి ఈ ఏడాదిలో ఇదే తొలి ఘటన. అయితే, గత కొన్ని రోజులుగా వివిధ మార్గాల్లో పాక్ కవ్వింపులకు పాల్పడుతూనే ఉంది. ఫిబ్రవరి 4, 5 తేదీల మధ్య అర్ధరాత్రి కొంతమంది చొరబాటుదారులు భారత భూభాగంలోకి ప్రవేశించేందుకు మిగతా 2లో..

## సరిహద్దుల్లో స్థిరంగానే పరిస్థితులు

పూంఛ్ ఘటనపై సైన్యం వివరణ వార్త 2లో

## ఫాస్టాగ్ యూజర్లకు కొత్త నిబంధనలు

**17 నుంచి 70 నిమిషాల రూల్ అమల్లోకి!**

న్యూఢిల్లీ(జనంసాక్షి): టోల్ రహదారులపై టోల్ వసూలు కోసం ఉద్దేశించిన ఫాస్టాగ్ లావాదేవీలకు సంబంధించి నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ముఖ్యంగా బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న ఫాస్టాగ్ వినియోగదారులకు కొత్తగా '70 నిమిషాల' వ్యవధిని నిర్దేశించింది. నిర్దేశిత సమయంలో బ్లాక్‌లిస్ట్‌లోంచి వైదొలగడంలో విఫలమైతే డబుల్ ఫీజు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కొత్త నిబంధనలు ఫిబ్రవరి 17 నుంచి అమల్లోకి రానున్నాయి. మిగతా 2లో..

## అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కోర్ అర్బన్ ఏరియా అభివృద్ధి

**హైదరాబాద్(జనంసాక్షి):**ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న కోర్ అర్బన్ ఏరియాను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు, నగర వాసులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళి కాబద్ధంగా ముందుకు వెళ్లాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఇందుకు సంబంధించి ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టు గా చేపట్టిన డ్రోన్ సర్వే ను కోర్ అర్బన్ ఏరియా మొత్తం నిర్వహించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు నగరంలో గృహాలు, మంచినీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, మురుగునీటి వ్యవస్థకు సంబంధించి పూర్తి వివరాలను సేకరించాలని సూచించిన సీఎం తద్వారా నగరంలో నివాస ప్రాంతాలకు మౌలికసదుపాయాల విషయంలో అవసరాలకు తగిన విధంగా ఎలాంటి అంతరాయం లేకుండా ఏర్పాటు చేసే వీలుంటుందని అభిప్రాయపడ్డారు నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైతే గూగుల్ సాంకేతిక సహకారాన్ని తీసుకుని ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు చెరువుల పునరుద్ధరణ, నాలాల విస్తరణకు ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రధానమైన 7 కూడళ్లలో ఫ్లై ఓవర్ నిర్మాణాలు చేపట్టేందుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. త్వరలోనే వీటికి టెండర్ల ను పిలువాలని ఆదేశించారు భూసేకరణ, ఇతర పనులను పూర్తి చేసి వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని. అధికారులకు సీఎం సూచించారు

## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన

ఇతర నివేదికల సమాచారాన్ని పరిశీలించిన అనంతరం.. అక్కడ రాజ్యాంగబద్ధ పాలన కొనసాగించే పరిస్థితి లేదనే అంచనాకు వచ్చాం. ఈ నేపథ్యంలోనే రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 అధికారాలు ఉపయోగించి మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ నిర్ణయం తీసుకున్నాం' అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆదేశాల్లో పేర్కొన్నట్లు కేంద్ర హోం మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఇదిలాఉంటే, శాసనసభ సమావేశాలకు ముందే ముఖ్యమంత్రి పదవికి బీరెన్ సింగ్ రాజీనామా చేశారు. ఆ వెంటనే సమావేశాలను రద్దు చేస్తూ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా ఆదేశాలిచ్చారు. అనంతరం తదుపరి ముఖ్యమంత్రిపై రాష్ట్ర భాజపా నేతలు పార్టీ అధిష్ఠానంతో సంప్రదింపులు జరిపారు. సీఎం అభ్యర్థిపై రాష్ట్ర పార్టీలో ఏకాభిప్రాయం రాని నేపథ్యంలో రాష్ట్రపతి పాలన వైపే కేంద్రం మొగ్గుచూపింది.

## కోడి పందేల నిర్వహణ కేసులో భారాస ఎమ్మెల్సీకి పోలీసుల నోటీసులు

ఆయనకు నోటీసులు ఇచ్చారు. ఈ కేసులో శ్రీనివాస్‌రెడ్డిని సైతం పోలీసులు నిందితుడిగా చేర్చారు.మంగళవారం పొద్దుపోయాక పోలీసులు నిర్వహించిన దాడుల్లో మొత్తం 61 మంది చిక్కిన విషయం తెలిసిందే. వారి వద్ద రూ.30 లక్షల నగదు, జూదక్రీడలో ఉపయోగించే రూ.కోటి విలువైన బెట్టింగ్ కాయిన్లు దొరికాయి. పోలీసులు 50 కార్లు, 80 పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఎక్కువ మంది వ్యాపారులే. అందరికీ నోటీసులిచ్చి వదిలేశారు. పోలీసులు వస్తున్న విషయం తెలుసుకుని కొందరు పరారయ్యారు. దాంతో పరారైన వ్యక్తులెవరనే దానిపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు.

**ఆ ఫామ్‌హౌజ్ నా ఆధీనంలో లేదు:ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి**

నగరశివారులోని మొయినాబాద్ మండలం తొల్కట్టలో జరిగిన ఘటనతో తనకు సంబంధం లేదని భారాస ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పోలీసుల నోటీసులకు పూర్తి వివరణ ఇస్తానని, విచారణకు సహకరిస్తానని చెప్పారు. 2018లో కొనుగోలు చేసిన భూమికి సంబంధించిన అన్ని వ్యవహారాలను తన మేనల్లుడు జ్ఞానదేవ్ రెడ్డి చూసుకుంటున్నారు. అక్కడ ఫామ్ హౌస్, గెస్ట్ హౌస్ లేవు. కేవలం మామిడి, కొబ్బరి తోట, పనివారి కోసం రెండు గదులు మాత్రమే ఉన్నాయి. నా ప్రమేయం లేకుండానే తోటను వర్రా రమేష్ కుమార్ రెడ్డి అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చినట్లు నిన్నటి ఘటన తర్వాత జ్ఞానదేవ్ రెడ్డి నుంచి తెలిసింది. వర్రా రమేష్ కుమార్ రెడ్డి కూడా ఆ తోటను ఎం.వెంకటపతి రాజుకు కౌలుకు ఇచ్చారని.. నిన్నటి వరకు నా దృష్టికి రాలేదు. సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని నిన్ననే పోలీసులకు ఫిర్యాదు చేశానని అన్నారు. మీడియాలో వస్తున్నట్లు ఆ తోటలో ఏమైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగి ఉంటే వాటికి, నాకు ఎలాంటి సంబంధం లేదు.

## భేటీలు తీర్పులను ప్రభావితం చెయ్యవు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** సుప్రీంకోర్టు తీర్పుల విషయంలో రాజకీయ జోక్యం ఉంటుందన్న ఆరోపణలను మాజీ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ తీవ్రంగా ఖండించారు. చట్ట ప్రకారమే రాజకీయ పార్టీల నేతలకు, కార్యకర్తలకు బెయిల్ ఇచ్చామని, గతేడాది 21,300 బెయిల్ పిటిషన్లు కొట్టేశామని గుర్తుచేశారు. మెజార్టీ వ్యక్తులకు అనుకూలంగా తీర్పులు ఉంటాయన్న ఆరోపణలను ఆయన ఖండించారు. గణపతి పూజ సందర్భంగా తమ ఇంటికి ప్రధాని మోదీ రావడంపై మాజీ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ మరోసారి స్పందించారు. భారత న్యాయ వ్యవస్థపై ప్రజలకు అచంచలమైన విశ్వాసం ఉందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పష్టం చేశారు. బీబీసీ నిర్వహించే హార్డ్ టాక్ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధి స్టీఫెన్ సకూర్ అడిగిన పలు ప్రశ్నలకు జస్టిస్ డీవై చంద్రచూడ్ తనదైన శైలిలో సమాధానమిచ్చారు. అందులో ఆర్టికల్ 370 రద్దు నుంచి ఆయన ఇంట గణేష్ చతుర్థి వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొనడం వరకు అడిగిన అన్ని ప్రశ్నలకు జస్టిస్ చంద్రచూడ్ చాలా హుందాగా సమాధానమిచ్చారు.ప్రధాని మీకు బాగా సన్నిహితమా అని ఓ ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు ఆయన స్పష్టమైన సమాధానం ఇచ్చారు. తమ వ్యవస్థ పరిణతితో వ్యవహరిస్తుందని బదులిచ్చారు. రాజ్యాంగపరం గా ఉన్నత పదవుల్లో ఉన్న ఇద్దరు వ్యక్తుల మధ్య మర్యాదపూర్వక భేటీని అతిగా చూడొద్దని సలహా ఇచ్చారు.. కేసుల తీర్పునకు ఇలాంటి మర్యాదలకు మధ్య సంబంధం లేదని అర్థం చేసుకొనే పరిణతి మా వ్యవస్థలో ఉందని మాజీ సీజేఐ వెల్లడించారు.

## ఇరాన్‌పై దాడికి ఇజ్రాయెల్ సన్నాహాలు

న్యూయార్క్(జనంసాక్షి):ఇరాన్‌లోని అణుస్థావరాలపై దాడి చేసేందుకు వీలుగా ఇజ్రాయెల్ సన్నాహాలు చేసకొని సిద్ధంగా ఉందని అమెరికా నిఘా వర్గాలు నివేదికలు సమర్పించాయి.ఈవిషయాన్ని వాషింగ్టన్ పోస్ట్, వాల్‌స్ట్రీట్ జర్నల్‌లు కథనాలు ప్రచురించాయి. 2025 ఏడాది మధ్యలో ఈ ముందస్తు దాడులు జరగొచ్చని అంచనా వేస్తున్నారు. ఇజ్రాయెల్ దెబ్బకు ఇరాన్ అణు కార్యక్రమం కొన్ని రోజులు లేదా నెలలు వెనక్కి వెళ్లిపోయే అవకాశం ఉందని అవి చెబుతున్నాయి.ఈ దాడుల ప్రణాళికకు మద్దతు ఇవ్వాలని ప్రస్తుత ట్రంప్ కార్యవర్గానికి ఇజ్రాయెల్ విజ్ఞప్తి చేసే అవకాశం ఉందని ఆ నివేదికలు చెబుతున్నాయి. దీనికి శ్వేత సౌధం నుంచి సానుకూల స్పందన వచ్చే అవకాశం కూడా ఉంది.అణుస్థావరాలపై దాడికి అవసరమైన ఆయుధాలు అమెరికా నుంచి ఇజ్రాయెల్‌కు అందే అవకాశం ఉంది. దీనికి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కార్యాలయం, సైన్యం, ఇటు శ్వేతసౌధం స్పందించేందుకు నిరాకరించాయి. వాషింగ్టన్ పోస్టుతో శ్వేతసౌధం ఎన్ఎస్‌సీ ప్రతినిధి బ్రియాన్ హ్యూస్ మాట్లాడుతూ ఇరాన్ అణ్వాయుధాలు తయారుచేయడాన్ని ట్రంప్ సర్కారు ఏమాత్రం ఆమోదించదన్నారు. కాకపోతే ఇరాన్‌తో చర్చలు జరపడానికే ఆయన ప్రయత్నిస్తారని.. అదీ సాధ్యం కాకపోతే మిగిలినవి ఆలోచిస్తారన్నారు. ఇటీవల ఫాక్స్ న్యూస్‌తో ట్రంప్ మాట్లాడుతూ ఇటువంటి వ్యాఖ్యలే చేశారు. తాను ఒప్పందానికి సిద్ధమైనా.. ఇరాన్ మాత్రం ఘర్షణనే ఇష్టపడుతుందని పేర్కొన్నారు.ఇరాన్‌లోని ఫొర్డ్వా, నటాంజ్ అణుస్థావరాలు లక్ష్యంగా దాడులు జరగొచ్చని జనవరి నెలలో అమెరికాకు ఇంటెలిజెన్స్ సమాచారం అందింది. ఇప్పటికే ఇజ్రాయెల్ అక్టోబర్‌లో జరిగిన బాంబింగ్‌లో టెహ్రాన్ ఎయిర్‌డిఫెన్స్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. ఇప్పుడు ప్రత్యర్థులు చేసే గగనతల దాడులను వేగంగా గుర్తించే స్థితిలో ఇరాన్ లేదని అమెరికా అధికారి ఒకరు చెప్పినట్లు వాషింగ్టన్ పోస్టు కథనంలో పేర్కొంది.మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్‌గా పేరున్న జీబీయూ 43లను ఇజ్రాయెల్‌కు అందించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇటీవల ఓ జర్మనీ పత్రిక కథనం ప్రచురించింది.

# హైదరాబాద్ గడ్డపై మైక్రోసాఫ్ట్ కొత్తక్యాంపస్




భాగంగా సరికొత్త ఏ ఐ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందని,15 వేలకోట్ల రూపాయల పెట్టుబడులను పెట్టనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెంట్ సిటీలో ఏఐ సెంటర్ ను ఏర్పాటు చేయడంతోపాటు తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో రాష్ట్రంలోని 1.2 లక్షల మందికి పైగా ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ లో శిక్షణను పొందడానికి మూడు సరికొత్త కార్యక్రమాలను మైక్రోసాఫ్ట్ సంస్థ చేపట్టనుందని తెలిపారు. అడ్వాంటేజ్ తెలంగాణ కార్యక్రమంకింద రాష్ట్రంలోని 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ కోర్సును పరిచయం చేసేందుకు మైక్రోసాఫ్ట్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఫౌండేషన్స్ అకాడెమి కార్యాచరణ రూపొందించి అమలు చేయడం జరుగుతుందని, దీని ద్వారా 50వేల మందికి విద్యార్థులకు పరిపూర్ణమైన శిక్షణ లభించే అవకాశం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తదితరులు అభిప్రాయపడ్డారు. ఏ ఐ ఇండస్ట్రీ ప్రో పేరుతో మరొక అద్భుతమైన కార్యక్రమాన్ని చేపట్టడం ద్వారా రాష్ట్రమంతటా 20వేల మంది పరిశ్రమ నిపుణులకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడానికి ఈ శిక్షణ దోహదపడుతుందని వారు వివరించారు. ఏఐ – సిఒఇ నీ ఏర్పాటు చేసి ఏఐ–గవర్న్ ఇనిషియేటివ్ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 50 వేల మంది ప్రభుత్వ అధికారులకు ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ప్రోడక్టివిటీ వంటి కీలకమైన రంగాలలో అధునాతనమైన శిక్షణను ఇవ్వడానికి ఆస్కారం లభిస్తుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అభివృద్ధితోపాటు రాష్ట్రంలో హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్లలో తన పెట్టుబడులను రెట్టింపు చేస్తామని ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ సంస్థ ప్రతినిధులు స్పష్టం చేశారు రాబోయే సంవత్సరాలలో వీటికి అదనంగా 15 వేల కోట్ల రూపాయల పెట్టుబడులను దశలవారీగా పెట్టనున్నట్లు వారు వివరించారు. భవిష్యత్తంతా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వైపు ప్రయాణిస్తున్న సందర్భంలో హైదరాబాదులో మైక్రోసాఫ్ట్ కొత్త ఫెసిలిటీ సెంటర్ ను ఏర్పాటుచేయటం అందరికీ గర్వకారణమని, ఇది హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ పటంపై మరింత సగర్భంగా నిలబడేలా చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని ముఖ్యమంత్రి తదితరులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వాలిదాసు జగదీశ్వర్ గౌడ్, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### 19న బిఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం

నమోదు, పార్టీ నిర్మాణం, నిర్మాణాత్మక అంశాలపై చర్చించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ వైఫల్యాలలపై చర్చించడంతో పాటు వాటిని ఎండగట్టేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించి.. ప్రజలను చైతన్యం చేసేందుకు అనుసరించాల్సిన విధానాలపై శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. కేసీఆర్ అధ్యక్షతన పార్టీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా పార్టీ అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ, ఎంపీలు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులు, కార్పోరేషన్ ఛైర్మన్లు, జిల్లా పరిషత్ ఛైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు.. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు హాజరవుతారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలమీద ప్రధానంగా చర్చ జరగనుంది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు అనుగుణంగా పార్టీ శ్రేణులు చేపట్టవలసిన కార్యాచరణపై సమగ్ర చర్చ జరగనుంది.

### ఫాస్టాగ్ యూజర్లకు కొత్త నిబంధనలు

ఈ మేరకు జనవరి 28నే ఓ సర్క్యులర్ జారీ చేసింది.ఫాస్టాగ్‌లో తగిన బ్యాలెన్స్ లేకపోతే ఆ ఫాస్టాగ్ బ్లాక్‌లిస్ట్‌లోకి వెళుతుంది. టోల్‌ప్లాజా రీడర్ వద్దకు చేరుకునే సమయానికి 60 నిమిషాల కంటే ఎక్కువ సేపు ఫాస్టాగ్ ఇన్‌యాక్టివ్‌లో ఉంటే కోడ్ 176 ఎర్రర్‌ను చూపి లావాదేవీని తిరస్కరిస్తారు. అలాగే, స్కాన్ చేసిన 10 నిమిషాల తర్వాత ఇన్‌యాక్టివ్‌లోకి వెళ్లినా ఇదే కారణంతో లావాదేవీని తిరస్కరిస్తారు.ఉదాహ రణకు ఉదయం 9 గంటలకు మీ ఫాస్టాగ్ బ్లాక్‌లిస్ట్‌లోకి వెళ్లిందనుకుందాం. ఒకవేళ మీరు 10.30 గంటలకు టోల్ ప్లాజాకు చేరుకుంటే.. మీ లావాదేవీ రిజెక్ట్ అవుతుంది. అదే 70 నిమిషాల్లోగా బ్లాక్‌లిస్ట్‌కు సంబంధించిన బ్యాలెన్స్ నింపడం, పెండింగ్ కేవైసీని పూర్తి చేయడం చేస్తే లావాదేవీ సజావుగా పూర్తవుతుంది. అదేవిధంగా టోల్ రీడ్ జరిగిన 10 నిమిషాల తర్వాత కూడా బ్లాక్‌లిస్ట్‌లో ఉన్నా ఆ లావాదేవీ తిరస్కరిస్తారు. కాబట్టి ఈ నిబంధన గురించి వాహనదారులు తెలుసుకోవడం ముఖ్యం.

– వ్యవసాయం, విద్య, రవాణారంగం, ప్రభుత్వ డిజిటల్ కార్యకలాపాలకు ఈ కేంద్రం సహకరిస్తుందని వెల్లడి

కేంద్రం సహకరిస్తుందని ఆ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ టెక్నాలజీ పవర్ హౌస్ గా తీర్చిదిద్దుతాం... రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) : ప్రపంచ ఐటి దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యంతో హైదరాబాద్ మహానగరంలోని శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి పరిధిలో 11 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యధిక ప్రమాణాలతో నిర్మించిన మైక్రోసాఫ్ట్ నూతన కార్యాలయాన్ని గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మైక్రోసాఫ్ట్ ఇండియా డెవలప్మెంట్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ కుమార్ తదితరులు ముఖ్యమంత్రితో ప్రారంభో

## హైదరాబాద్‌లో గూగుల్ ఏఐ కేంద్రం

త్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వానికి మైక్రోసాఫ్ట్ ఐటీ సంస్థకు మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఈ అధునాతన మైక్రోసాఫ్ట్ కార్యాలయంలో 2 వేల 500 మంది ఉద్యోగులు ఒకేసారి విధులను నిర్వర్తించడానికి అవకాశం కలుగుతుంది. మైక్రోసాఫ్ట్ సంస్థ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా సరికొత్త ఏ ఐ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందని,15 వేలకోట్ల రూపాయల పెట్టుబడులను పెట్టనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెంట్ సిటీలో ఏఐ సెంటర్ ను ఏర్పాటు చేయడంతోపాటు తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో రాష్ట్రంలోని 1.2 లక్షల మందికి పైగా ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ లో శిక్షణను పొందడానికి మూడు సరికొత్త కార్యక్రమాలను మైక్రోసాఫ్ట్ సంస్థ చేపట్టనుందని తెలిపారు. అడ్వాంటేజ్ తెలంగాణ కార్యక్రమంకింద రాష్ట్రంలోని 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ కోర్సును పరిచయం చేసేందుకు మైక్రోసాఫ్ట్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఫౌండేషన్స్ అకాడెమి కార్యాచరణ రూపొందించి అమలు చేయడం జరుగుతుందని, దీని ద్వారా 50వేల మందికి విద్యార్థులకు పరిపూర్ణమైన శిక్షణ లభించే అవకాశం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు. ఏ ఐ ఇండస్ట్రీ ప్రో పేరుతో మరొక అద్భుతమైన కార్యక్రమాన్ని చేపట్టడం ద్వారా రాష్ట్రమంతటా 20వేల మంది పరిశ్రమ నిపుణులకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడానికి ఈ శిక్షణ దోహదపడుతుందని వారు వివరించారు. ఏఐ – సిఒఇ నీ ఏర్పాటు చేసి ఏఐ–గవర్న్ ఇనిషియేటివ్ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 50 వేల మంది ప్రభుత్వ అధికారులకు ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ప్రోడక్టివిటీ వంటి కీలకమైన రంగాలలో అధునా తనమైన శిక్షణను ఇవ్వడానికి ఆస్కారం లభిస్తుంద న్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అభివృద్ధితోపాటు రాష్ట్రంలో హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్లలో తన పెట్టుబడులను రెట్టింపు చేస్తామని ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ సంస్థ ప్రతినిధులు స్పష్టం చేశారు రాబోయే సంవత్సరాలలో వీటికి అదనంగా రూ.15 వేల కోట్ల పెట్టుబడులను దశలవారీగా పెట్టనున్నట్లు వారు వివరించారు. భవిష్యత్తంతా ఆర్టిఫిషియల్ ఇం టలిజెన్స్ వైపు ప్రయాణిస్తున్న సంద ర్భంలో హైదరా బాదులో మైక్రోసాఫ్ట్ కొత్త ఫెసిలిటీ సెంటర్ ను ఏర్పా టుచేయటం అందరికీ గర్వకారణమని, ఇది హైద రాబాద్ నగరాన్ని ప్రపంచపటంపై మరింత సగర్భంగా నిలబడేలా చేస్తుందన్నారు

## విభజన తర్వాత తెలంగాణను అప్పులకుప్ప చేశారు

నిర్మించాం. ఇందిరాగాంధీ మెదక్ నుంచి ప్రాతినిధ్యం వహించారు.. కానీ, మెదక్ జిల్లాలో మొదటి రైల్వే స్టేషన్‌ను మోదీ సర్కారే ఇచ్చింది. రామగుండం ఎరువుల కర్మాగారాన్ని మోదీ పునరుద్ధరించారు. తెలంగాణకు పసుపు బోర్డు మంజూరు చేశాం. బడ్జెట్‌లో ఏ ఒక్క రాష్ట్రానికి పెద్దపీట వేయలేదు. బడ్జెట్‌కు ముందు అన్ని రాష్ట్రాలను సంప్రదిస్తున్నాం" అని నిర్మలా సీతారామన్ తెలిపారు.

## వక్ఫ్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**'వక్ఫ్ సవరణ బిల్లు–2024'పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) రూపొందించిన నివేదికను కేంద్ర ప్రభుత్వం గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. జేపీసీకి చైర్మన్‌గా వ్యవహరించిన జగదంబికా పాల్, బిజెపి ఎంపీ సంజరు తదితరులు ఈ ముసాయిదా బిల్లుపై తమ నివేదికను హిందీ, ఇంగ్లీష్ భాషల్లో సభ ముందుకు తీసుకొచ్చారు. ఈ బిల్లుపై నివేదికను రాజ్యసభ ఎంపీ మేధా కులకర్ణి సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సభలో గందరగోళం నెలకొంది. నివేదికపై ప్రతిపక్ష ఎంపీలు నిరసన తెలిపారు. తాము సమర్పించిన డిస్సెంట్ (అసమ్మతి) నోట్‌ను తొలగించారంటూ నిరసనకు దిగారు. సభలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో సభను చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ 20 నిమిషాల పాటు వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభమైనప్పటికీ ప్రతిపక్షాలు తమ నిరసనను కొనసాగించాయి. ఈ నిరసనల మధ్యే ఈ నివేదికకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. కాగా, జనవరి 29న ముసాయిదా నివేదికను జెపిసి ఆమోదించిన విషయం తెలిసిందే. బీజేపీ సభ్యులు సూచించిన 14 సవరణలను కమిటీ ఆమోదించింది. అయితే కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఆప్, శివసేన(యూబీటీ), ఏఐఎంఐఎంతోసహా ప్రతిపక్ష సభ్యులు సూచించిన ప్రతి మార్పును కమిటీ తిరస్కరించింది. ఈ సవరణలతో వక్ఫ్‌బోర్డులలో ముస్లిమేతరులు కూడా సభ్యులుగా ఉంటారు. ఈ బిల్లుపై ముస్లింలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టి త్వరితగతిన ఆమోదింపజేసుకుంది.

## బందీలను విడుదలచేయకుంటే మళ్లీ యుద్ధమే

ఆరోపిస్తూ.. బందీల విడుదలను ఆలస్యం చేస్తున్నట్లు ప్రకటించింది. ఈనేపథ్యంలో ట్రంప్, ఇజ్రాయెల్‌లు ఆ సంస్థకు డెడ్‌లైన్ విధించాయి. బందీల విడుదలను ఆపితే హమాస్‌ను పూర్తిగా తుడిచిపెట్టేవరకు తమ బలగాలు పోరాడతాయని నెతన్యాహు ఓ వీడియోలో పేర్కొన్నారు. గాజా లోపల, వెలుపల బలగాలను సమీకరించాలని ఐడీఎఫ్‌ను ఆదేశించినట్లు వెల్లడించారు. ఈక్రమంలో కాల్పుల విరమణకు బీటలు వారడంతో మధ్యప్రాచ్యంలో మళ్లీ ఉద్రిక్తతలు నెలకొంటాయనే ఆందోళన వ్యక్తమవుతుంది.గాజాను స్వాధీనం చేసుకోవడంతో పాటు.. నిరాశ్రయులైన పాలస్తీనియన్లు అక్కడినుంచి వెళ్లిపోవాలని ట్రంప్ ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. దీనికి వ్యతిరేకంగా హమాస్ ప్రపంచవ్యాప్తంగా సంఘీభావ ర్యాలీకి పిలుపునిచ్చింది.

## అమెరికాతో ప్రపంచ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నిర్మిస్తాం

అమెరికాకు చేరుకున్నారు. ఫ్రాన్స్‌లో తన రెండు రోజుల పర్యటనను ముగించిన తర్వాత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలవడానికి. వారు ప్రతినిధి స్థాయి ఫార్మాట్లలో ద్వైపాక్షిక సమావేశాలను నిర్వహిస్తారు. గురువారం వాషింగ్టన్‌లో అధ్యక్షుడు ట్రంప్‌తో జరిగే సమావేశానికి ముందు మోదీ అదనపు సుంకాల కోతలకు సిద్ధమవుతున్నారు. ఇది భారతదేశానికి అమెరికన్ ఎగుమతులను పెంచవచ్చు.అధ్యక్షుడు ట్రంప్, డోజ్ అధిపతి ఎలాన్ మస్క్‌తో భేటీ కానున్నారు. ఈ సందర్భంగా మోదీకి భారత సంతతి వారు ఘనంగా స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ప్రపంచంలోనే అత్యంత ప్రత్యేకమైన అతిథి గృహంలో బస చేస్తున్నారు. 1651 పెన్సిల్వేనియా అవెన్యూలోని బ్లెయిర్ హౌస్ ఆయనకు ఆతిథ్యం ఇస్తోంది. ఈ భవనం శ్వేత సౌధానికి ఎదురుగా ఉండటం దీని విశేషం. అమెరికాలో పర్యటించే అత్యంత ప్రత్యేకమైన అతిథులకు ఇక్కడ బస ఏర్పాటు చేస్తారు. గతంలో చాలా మంది దేశాధ్యక్షులు, రాజకుటుంబ సభ్యులకు దీనిని విడిదిగా వాడారు. దౌత్యపరంగా ప్రాధాన్యమున్న భవనంగా దీనిని భావిస్తారు. ఇది కేవలం విలాసవంతమైన గెస్ట్‌హౌస్ మాత్రమే కాదు. అమెరికా ఆతిథ్యానికి చిహ్నంగా నిలిచింది. దాదాపు 70 వేల చదరపుటడుగుల్లో నాలుగు భవనాలు అనుసంధానమై ఉండటం దీని ప్రత్యేకత. ఇక్కడ మొత్తం 119 గదులు ఉన్నాయి. వీటిలో 14 బెడ్రూమ్‌లు, 35 బాత్ రూమ్‌లు, మూడు డైనింగ్ గదులున్నాయి. అత్యాధునిక బ్యూటీ సెలూన్ కూడా దీనిలో ఉంది. ఇక్కడి వచ్చిన అతిథులకు ఫైవ్‌స్టార్ ఆతిథ్యం ఇస్తారు. అమెరికా చరిత్రను తెలిపే పురాతన వస్తువులు, ఆర్ట్స్‌తో దీనిని అలంకరించారు. 1824లో ఈ భవనాలను నిర్మించారు. ప్రెస్టోన్ ఫ్రాన్సిస్ బ్లెయిర్ 1837లో కొనుగోలు చేశారు. ఆయన పేరును దీనికి పెట్టారు. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత శ్వేతసౌధానికి అతిథుల తాకిడి గణనీయంగా పెరిగింది. చాలా దేశాధినేతలు, సైన్యాధినేతలు అక్కడే బస చేసేవారు. ఆ తర్వాత 1942లో అమెరికా ప్రభుత్వం ఈ హౌస్‌ను అద్దెకు తీసుకొంది. ఆ ఏడాది చివరి నాటికి 1.56లక్షల డాలర్లకు కొనుగోలు చేసింది. అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఆ దేశ డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ తులసీ గబ్బర్డ్‌తో భేటీ అయ్యారు. వీరిద్దరూ పలు అంశాలపై చర్చించారు. డీఎన్ఐగా ఆమె నేడు పదవీ బాధ్యతలు చేపట్టడం విశేషం.

## పార్లమెంట్‌లో 'ఐటి' రగడ

వచ్చారు. అయితే విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి. బిల్లుకు నిరసనగా వాకౌట్ చేయడం గమనార్హం. అనంతరం కాసేపటికే లోక్‌సభ మార్చి 10కి వాయిదా పడింది. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టానికి, ఎన్నో సవరణలు జరిగాయి. దీంతో సంక్లిష్టంగా తయారైంది. పన్ను చెల్లింపుదార్లకు వ్యయాలూ పెరిగాయి. దీంతో ఈ చట్టాన్ని సమీక్షించి, సరళతరం చేస్తామని 2024 జులై బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఆ మేరకు ఇప్పుడు బిల్లును రూపొందించారు. ఈ చట్టాన్ని సమీక్షించడానికి కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి ఒక అంతర్గత కమిటీని ఏర్పాటు చేసింది. చట్ట సమీక్షకు 22 ప్రత్యేక సబ్ కమిటీలనూ ఏర్పాటు చేశారు. మొత్తం మీద కొత్త చట్టం సమీక్ష నిమిత్తం 6500 సలహాలను ఆదాయ పన్ను విభాగం అందుకుంది. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకుని, కొత్త బిల్లు తీసుకొచ్చారు. మొన్నటి బడ్జెట్‌లో కూడా ఆదాయపు పన్ను విషయంలో సరళీకరణ చేపట్టామని అన్నారు. అందుకు అనుగుణంగా కొత్త ఐటి చట్టానికి ఇటీవలే కేబినెట్ ఆమోదించింది. దానికి చట్టబద్ధత కల్పించేందుకు పార్లమెంటు ముందుకు తీసుకుని వచ్చారు.

## రైతు ప్రభుత్వంలో అన్నదాతలపై వేధింపులు సరికాదు

**హైదరాబాద్(జనంసాక్షి):** రైతులపై బ్యాంకు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు సరైందికాదని, కొన్ని సంఘటనలు చూస్తే మనసు చలిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా మండిపడ్డారు. స్వరాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని..కష్టాల్లో ఉన్న పాడి రైతు లోన్ కట్టలేదని.. ఏకంగా ఆ ఇంటికి ఉన్న గేటును బ్యాంక్ సిబ్బంది ఎత్తుకెళ్లారని.. మరి రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తానని.. మాటతప్పిన ముఖ్యమంత్రిపై చర్య తీసుకునే ధైర్యముందా అని ప్రశ్నించారు. రుణం తీర్చలేదని రైతుపై చూపిన ప్రతాపాన్ని.. రుణమాఫీ చేయని సీఎం రేవంత్ రెడ్డిపై చూపించగలరా.. అని అన్నారు. పేద రైతు కు ఒక న్యాయం.. పదవిలో ఉన్న వారికి మరో న్యాయమా.. అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు గుర్తు పెట్టుకోవాలని, రైతులు అంతా గమనిస్తున్నారని.. ఇలాంటి ఘోరాలను చూస్తూ ఊరుకోరని.. కాంగ్రెస్ నేతల్ని ఇంటి గేటు కూడా తొక్కనియ్యరని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కాగా బ్యాంకులో తీసుకున్న అప్పు తిరిగి చెల్లించలేదని బ్యాంకు అధికారులు ఇంటి గేట్లు ఎత్తుకెళ్లిన ఘటన జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏడునూతులలో తండా మంజుల, మద్దెబోయిన ప్రేమలతలకు పాడిగేదెల కోసం జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఉన్న డీసీసీబీ రూ.8.72 లక్షల రుణం 2021 అక్టోబరులో ఇచ్చింది. ఒక్కో గ్రూపునకు ఐదుగురు చొప్పున రెండు గ్రూపుల్లో మొత్తం 10మంది తలా ఒక పాడిగేదె కొన్నారు. అయితే కొంత అప్పు కట్టినా రెండు గ్రూపులు కలిపి మొత్తం రూ.7 లక్షల బాకీ చెల్లించలేదు. వాస్తవానికి 2023లోనే ఈ రుణ వాయిదాలు పూర్తి కావాల్సి ఉంది. దీంతో బ్యాంకు అధికారులు లబ్ధిదారులకు 2023 అక్టోబరులో లీగల్ నోటీసులు పంపారు.

## సరిహద్దుల్లో స్థిరంగానే పరిస్థితులు

**న్యూఢిల్లీ,(జనంసాక్షి):**భారత్–పాక్ సరిహద్దుల్లో పరిస్థితి నిలకడగానే ఉందని భారత సైన్యం ప్రకటించింది. తాజాగా నేడు పాక్ కవ్వింపులకు గట్టిగా బుద్ధి చెప్పిన నేపథ్యంలో ఆర్మీ స్పందించింది. ఇక్కడ అస్థిర పరిస్థితులు నెలకొన్నట్లు వచ్చిన వార్తలను ఖండించింది. కాల్పుల విరమణ స్థిరంగా కొనసాగుతోందని పేర్కొంది. జమ్మూకశ్మీర్‌లో పూంఛ్ జిల్లా కృష్ణ ఘాటి సెక్టార్‌లో బుధవారం రాత్రి కాల్పుల విరమణ ఉల్లంఘన చోటుచేసుకుంది. నియంత్రణ రేఖ వెంబడి తార్కుండి ప్రాంతంలో ఉన్న ఫార్వర్డ్ పోస్ట్‌పై పాక్ సైన్యం కాల్పులను భారత బలగాలు తిప్పికొట్టాయి. వీటిల్లో శత్రువుల వైపు 'భారీగా ప్రాణనష్టం' జరిగిందని భద్రతా అధికారులు వెల్లడించారు. అయితే, మృతుల సంఖ్య వివరాలను మాత్రం స్పష్టంగా చెప్పలేదు. కాల్పుల విరమణ ఉల్లంఘనకు సంబంధించి ఈ ఏడాదిలో ఇదే తొలి ఘటన. అయితే, గత కొన్ని రోజులుగా వివిధ మార్గాల్లో పాక్ కవ్వింపులకు పాల్పడుతూనే ఉంది. ఫిబ్రవరి 4, 5 తేదీల మధ్య అర్ధరాత్రి కొంతమంది చొరబాటుదారులు భారత భూభాగంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా భారత సైన్యం వారిపై కాల్పులు జరిపింది.

## సినిమా థియేటర్లలో పిల్లల ప్రవేశం.. సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టులో సవాల్

కోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ మల్టీప్లెక్స్ యాజమాన్యాల సంఘం అప్పీలు దాఖలు చేసింది. ఈ నిర్ణయం వల్ల మల్టీప్లెక్స్ థియేటర్ల యాజమాన్యం తీవ్రంగా నష్టపోతుందని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు.సింగిల్ బెంచ్ వద్ద పిటిషన్ పెండింగ్‌లో ఉండగా.. అప్పీలుపై జోక్యం చేసుకోలేమని సీజే ధర్మాసనం స్పష్టం చేసింది. సింగిల్ బెంచ్ వద్ద ఉన్న పెండింగ్ పిటిషన్‌లో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయాలని సూచించింది. దీనికి పిటిషనర్లు అంగీకరించడంతో అప్పీల్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.

## సరిహద్దుల్లో పాక్ కవ్వింపు చర్యలు

ప్రయత్నించగా భారత సైన్యం వారిపై కాల్పులు జరిపింది. ఈ ఘటనలో ఏడుగురు హతమవ్వగా.. వీరిలో కొందరు పాక్ భద్రతా సిబ్బంది ఉన్నట్లు సమాచారం. ఇక, ఫిబ్రవరి 8న రాజౌరీ సెక్టార్‌లో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఓ సైనికుడికి గాయాలయ్యాయి.

## మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో ఊరట

**ముందస్తు బెయిల్ మంజూరు**

**హైదరాబాద్(జనంసాక్షి):**సినీ నటుడు మోహన్‌బాబుకు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. జర్నలిస్టు పై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఆయన సుప్రీంకోర్టులో ఫిటీషన్ వేశారు. దీనిపై గురువారం విచారణ జరిపిన న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసును జస్టిస్ సుధాంశ్ దులియా ధర్మాసనం విచారణ జరిపింది. గత విచారణ సందర్భంగా మోహన్‌బాబుపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు తెలంగాణ పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.

# కుల్కచర్ల గిరిజన హాస్టల్లో విద్యార్థి మృతి

- ప్రాథమిక చికిత్స కోసం పరిగి ఆసుపత్రికి తరలింపు
- విద్యార్థి మృతి చెందినట్లు ధ్రువీకరించిన డాక్టర్లు
- పరిగి ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నాకు దిగిన విద్యార్థి తల్లిదండ్రులు
- హాస్టల్ సిబ్బందిపై దాడికి యత్నం
- ఆసుపత్రి వద్ద భారీగా మోహరించిన పోలీసులు





**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 13 (జనంసాక్షి)** : అర కొర వసతులు ఉన్న ప్రభుత్వ హాస్టల్లో తరచు విద్యార్థులు అస్వస్థకు గురి అవుతున్నారు. ఆస్పత్రి పాలవుతున్నారు. పరిస్థితి విషమిస్తే మృత్యువాత పడుతున్నారు. తాజాగా వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని సాంఘిక సంక్షేమ గిరిజన బాలుర హాస్టల్లో ఉంటూ పదవ తరగతి చదువుతున్న దేవేందర్ అనే విద్యార్థి మృత్యువాత పడ్డాడు. గురువారం తెల్లవారుజామున తోటి విద్యార్థులు దేవేందర్ ను నిద్ర నుంచి లేపితే అప్పటికే విద్యార్థి దేవేందర్ విగతగా పడి ఉన్నారు. ఆందోళన చెందిన తోటి విద్యార్థులు హాస్టల్ సిబ్బందికి తెలియజేయడంతో వారు హుటాహుటిన పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థిని పరీక్షించిన డాక్టర్లు కొన్ని గంటల ముందు విద్యార్థి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ విషయమై సాంఘిక సంక్షేమ గిరిజన హాస్టల్ జిల్లా అధికారి కమలాకర్ రెడ్డి విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించారు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులతో పాటు వారి బంధువులు భారీగా పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలివచ్చారు. తన కొడుకు మృతి పై అనుమానాలు ఉన్నాయని వారు పరిగి ప్రభుత్వ ఆసపత్రి ముందు ధర్నాకు దిగారు. వీరికి తోడు విద్యార్థి సంఘాలు ప్రతిపక్ష పార్టీలు నాయకులు తోడు కావడంతో పరిగి ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర కొన్ని గంటల పాటు ఉద్రుత పరిస్థితి నెలకొంది. హాస్టల్లో మృతి చెందిన విద్యార్థి దేవేందర్ కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారంతోపాటు వారి కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు పోస్టుమార్టం నిర్వహించేది లేదని ఆందోళనకు దిగారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ఈ సంఘటనపై స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని ఆందోళన చేశారు. ఆస్పత్రికి కలెక్టర్ వచ్చి విద్యార్థి వృత్తిపై చర్యలు చేపట్టాలని వారి డిమాండ్ చేశారు. విద్యార్థి మృతి పట్ల విచారణ జరపడానికి వచ్చిన సాంఘిక సంక్షేమ గిరిజన అధికారులపై గిరిజనులు కర్రలతో దాడి చేయడానికి ప్రయత్నించారు. అప్పటికే అప్రమత్తమైన పోలీసులు అధికారులపై దాడి జరగకుండా చర్యలు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆందోళన జరిగింది. లక్ష రూపాయల పరిహారం ఒక ఉద్యోగం ఇవ్వడానికి అధికారులు అంగీకరించారు. విద్యార్థి శవానికి పోస్టుమార్టం చేస్తేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు విద్యార్థి తల్లిదండ్రులకు ఆందోళనకారులకు నచ్చ చెప్పారు. సాయంత్రం వేళ డాక్టర్లు పోస్టుమార్టం నిర్వహించి విద్యార్థి దేవేందర్ గుండెపోటుతో మృతి చెందినట్లుగా నిర్ధారించారు. ఈ విషయమై విద్యార్థి తల్లిదండ్రులకు తెలియజేశారు. పోస్టుమార్టం అనంతరం శవాన్ని బంధువులకు అప్పగించారు. కాగా కుల్కచర్ల హాస్టల్లో మృతి చెందిన సంఘటనపై విచారణకు కలెక్టర్ ఆదేశించినట్లు తెలుస్తుంది.

## పింక్ బుక్ మెయింటైన్ చేస్తున్నాం..
# ఇంతకింత చెల్లిస్తాం

- పార్టీ ఫిరాయించిన వారి స్థానాల్లో ఉప ఎన్నికలొస్తే ఎగిరేది గులాబీ జెండానే
- బీసీ రిజర్వేషన్ పెంపు ఆచరణ సాధ్యంకావాలి
- జనగామ జిల్లాలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలు



**జనగామ, ఫిబ్రవరి 13 (జనంసాక్షి)** : అక్రమ కేసులతో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కాంగ్రెస్ ప్రభుత్వం వేధిస్తుండడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా స్పందించారు. "మేము పింక్ బుక్ మెయింటైన్ చేస్తున్నాం. అందులో అన్నీ రాసుకుంటాం. ఇంతకింత తిరిగి చెల్లిస్తాం. లెక్కలు ఎలా రాయాలో మాకు తెలుసు. మీ లెక్కలన్నీ తీస్తాం. అన్నింటినీ మేం అధికారంలోకి వచ్చాక తిరిగి చెల్లిస్తాం" అని కాంగ్రెస్ పార్టీని తీవ్రంగా హెచ్చరించారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, కాంగ్రెస్ వేధింపులకు గులాబీ సైనికులు భయపడబోరని తేల్చిచెప్పారు. గురువారం జనగామ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ డిప్యుటీ సీఎం టీ.రాజయ్యతో కలిసి ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. అంతకు ముందు పెంబర్తిలోనూ విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. రైతు డిక్లరేషన్ పై నిలదీస్తారని రాహుల్ గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారని విమర్శించారు. సామాజిక మాధ్యమాల్లో చిన్న విమర్శ చేసినా సీఎం రేవంత్ భయపడుతున్నారని, పోస్టు చేసిన మరుసటి నాడే ఇంటికి పోలీసులు వచ్చి వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా రాజ్యాంగాన్ని పట్టుకొని రాహుల్ గాంధీ తిరుగుతారని, కానీ తెలంగాణలో మాత్రం రేవంత్ రెడ్డి రాజ్యాంగాన్ని కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే దగా, మోసమని స్పష్టం చేశారు.



## కులగణనపై అసెంబ్లీ తీర్మానం చేస్తుందనుకున్నాం

- తూతూ మంత్రంగా చర్చించి పక్కన పడేశారు
- మాజీ స్పీకర్ మధుసూధనాచారి విమర్శలు

**వరంగల్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి)** : కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేసి చట్టం తెస్తారని అనుకున్నామని.. తూతూ మంత్రంగా ప్రకటన చేసి చేతులు దులుపుకున్నారని శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనా చారి అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని ఆయన పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి కాస్కో అంటూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హనుమకొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. కేసీఆర్ మౌనం.. దాని పర్యావసానం గురించి వైఎస్సార్, చంద్రబాబుకు తెలుసునని.. రాబోయే రోజుల్లో కేసీఆర్ ధాటికి రేవంత్‌రెడ్డి వణికిపోవడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ పార్టీ కడియం శ్రీహరికి ప్రాధాన్యత ఇచ్చి డిప్యూటీ సీఎం పదవి ఇస్తే.. పార్టీకి మోసం చేశాడని మండిపడ్డారు. దమ్ము, ఆత్మ విశ్వాసం ఉంటే ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మళ్లీ పూర్తిస్థాయిలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేత దాస్యం వినయ్ భాస్కర్ మాట్రలాడుతూ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాల్సిందేనన్నారు. తూ తూ మంత్రంగా కుల గణనను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని.. విమర్శించారు. బీఆర్ఎస్ ఒత్తికి దిగివచ్చిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చిందని.. రీ సర్వే ఘనత బీఆర్ఎస్‌దేనన్నారు. గుడిసె వాసులకు పార్టీ అండగా ఉంటుందన్నారు.

## పార్టీ పిరాయింపులను నిరోధించేందుకు పటిష్ట చట్టం రావాలి

- ప్రభుత్వాల వైఫల్యం వల్లే ప్రజలకు అన్యాయం
- మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి



**హుస్నాబాద్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి)** : పార్టీ పిరాయింపులను నిరోధించేందుకు పటిష్ట చట్టం రావాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకటరెడ్డి అభిప్రాయపడ్డారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కుల గణన పై రీ సర్వే చేయడం మంచి పరిణామమని, సర్వేలో పాల్గొనని వారంతా సర్వేలో పాల్గొని వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. కుల గణన సర్వే పూర్తి అయిన తర్వాత జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలన్నారు.అనేక క్రిమినల్ చట్టాలు ఉన్నాప్పటికి పాలకుల పనితీరు వల్ల చట్టలు అమలులో నిర్లక్ష్యం చేయడంతో ప్రజలకు అన్యాయం జరుగుతోందని చాడ వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల్లో ఉచిత హామీలు మంచిది కాదని, రాజకీయ లబ్ధి కోసమే ఉచితాల హామీ ఇస్తున్నారని, ఆ తరువాత వాటిని అమలు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బొయిని అశోక్,సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జాగీర్ సత్య నారాయణ,యెడల వనేష్, అక్కన్నపెట కోహెడ మండలాల సిపిఐ కార్యదర్శులు కొమ్ముల భాస్కర్,ముంజ గోపి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజివరెడ్డి,ఎగ్గోజు సుదర్శన్,బొజ్జపురి రాజు, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జెరిపోతుల జనార్ధన్,రైతుసంఘం నాయకులు జంగ విజయ, కాల్వల ఎల్లయ్య,సిపిఐ మండల నాయకులు అయిలేని మల్లారెడ్డి,పొదిల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పోచంపల్లికి శ్రీనివాస్‌రెడ్డికి నోటీసులు

- నాలుగు రోజుల్లో తమ ముందు హాజరుకావాలని వెల్లడి



**హైదరాబాద్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి)** : కోడిపందేల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి మొయినాబాద్ పోలీసులు గురువారం నోటీసులు ఇచ్చారు. కోడి పందాలు జరిగిన ల్యాండ్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి చెందినదిగా పోలీసులు నోటీసుల్లో పేర్కొన్నారు. మొయినాబాద్ తోల్కట్ట గ్రామం సర్వే నెంబర్ 165/ఏలో ఈ ఫార్మ్‌హౌస్ ఉందని పోలీసులు తెలిపారు. నాలుగు రోజుల్లో ఆధారాలతో తమ ముందు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి హాజరు కావాలని నోటీసుల్లో పోలీసులు పేర్కొన్నారు. ఇప్పటికే ఈ కేసులో పోచంపల్లిని నిందితుడిగా మొయినాబాద్ పోలీసులు చేర్చారు. సెక్షన్ 3 అండ్ 4 గేమింగ్ యాక్ట్ కింద్ కేసు నమోదు చేశారు. సెక్షన్ 11 యానిమల్ యాక్ట్ కింద మరో కేసు నమోదు చేశారు. ఫార్మ్ హౌస్‌లో బెట్టింగ్స్ చేస్తూ పందాలు ఆడిస్తున్నట్లు మొయినాబాద్ పోలీసులు గుర్తించారు. శ్రీనివాస్ రెడ్డి ఫార్మ్‌హౌస్‌ను సబ్ లీజుకు భూపతి రాజు శివకుమార్ వర్మ అలియాస్ గబ్బర్ తీసుకున్నారు. ఫార్మ్‌హౌస్‌లో భారీ సెటప్‌తో కోడి పందాలను గబ్బర్ నిర్వహించాడు. అయితే కోడిపందాలకు సంబంధించి మరి కొంతమందిని విచారించే అవకాశాలు ఉన్నాయి. కాగా.. మూడు రోజుల క్రితం నగర శివారులో భారీ క్యాసినోను పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన కలకలం రేపింది. మొయినాబాద్‌లోని ఫామ్ హౌస్‌పై దాడి చేసిన రాజేంద్రనగర్ పోలీసులు.. కోళ్ల పందాలతోపాటు క్యాసినో నిర్వహిస్తున్న ముఠా గుట్టు రట్టు చేశారు. ఈ ఘటనలో 64 మందిని అరెస్టు చేశారు. రూ. 30 లక్షల నగదుతోపాటు 55 కార్లు, 86 కోళ్లు స్వాధీనం పరుచుకున్నారు. పెద్ద మొత్తంలో బెట్టింగ్ కాయిన్స్ కూడా సీజ్ చేశారు. పట్టుబడినవారిలో ఏపీ, తెలంగాణకు చెందినవారు ఉన్నట్లు సమాచారం. నగరానికి చెందిన పలువురు ప్రముఖులు కలిసి క్యాసినో, కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

## చిలుకూరు పూజారిపై దాడికేసులో పోలీసుల అదుపులో మరో ఏడుగురు



**రంగారెడ్డి, ఫిబ్రవరి 13 (జనంసాక్షి)** : మొయినాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి కేసులో మరో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు తూర్పు గోదావరి, భద్రాచలం జిల్లాలకు చెందిన వ్యక్తులుగా గుర్తించారు. దాడి జరిగిన తర్వాత పరారీలో ఉన్న నిందితులలో గురువారం ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గత శుక్రవారం రాఘవరెడ్డి 20మంది అనుచరులతో కలిసి రంగరాజన్ ఇంటికి వెళ్లి దాడి చేసిన విషయం తెలిసిందే. దాడి జరిగిన తర్వాత ప్రధాన నిందితుడు రాఘవరెడ్డితో పాటు మరికొంత మందిని అరెస్టు చేశారు. దీంతో మిగతా నిందితులు అప్పటి నుంచి పరారీలో ఉన్నారు. నిందితుల కోసం ప్రత్యేక టీమ్ లను ఏర్పాటు చేసి పోలీసులు గాలిస్తున్నారు. రామ రాజ్య స్థాపనకు మద్ధతు ఇవ్వాలని రాఘవరెడ్డి 20 మంది అనుచరులతో అర్చకులు రంగరాజన్ పై దాడి చేశారు. అడ్డొచ్చిన ఆయన కుమారుడిపై కూడా దాడి చేశారు రాఘవరెడ్డి బ్యాచ్. దీనిపై చిలుకూరు బాలాజీ ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ ఎంవీ సౌందర్ రాజన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి కీలక నిందితులను అరెస్టు చేశారు. మిగత నిందితుల కోసం గాలిస్తున్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- కామారెడ్డి ఎఎస్పీ చైతన్యరెడ్డి

**కామారెడ్డి, ఫిబ్రవరి 13 (జనంసాక్షి)** : రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు కామారెడ్డి ఎఎస్పీ చైతన్యరెడ్డి పేర్కొన్నారు. దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగిన ఏరియాలను ఎస్పీ పరిశీలించారు. గతేడాది కాలంగా ఎక్కువగా యాక్సిడెంట్లు జరిగిన ప్రాంతాలను హాట్ స్పాట్‌లుగా గుర్తించి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యాసంపల్లి, టెకిర్యాల్ శివార్లను ఆమె పరిశీలించారు. స్పీడ్ బేకర్లు ఏర్పాటు చేయడం,హెచ్చరిక బోర్డుల ఏర్పాటు అంశాలపై సూచనలు చేశారు. రూరల్ సీఐ రామన్ దేవునిపల్లి ఎస్సై రాజు ఉన్నారు.

# వర్క్ ఫ్రమ్ కారు!

- టెక్కీకి వేయి జరిమానా
- బెంగళూరులో సంచలన కేసు



**బెంగళూరు, ఫిబ్రవరి 13 (జనంసాక్షి)** : వర్క్‌ఫ్రమ్ హోమ్ అంటే కారులో డ్రైవ్ చేస్తూ..చేసే పనికాదని బెంగళూరు పోలీసులు గట్టి షాక్ ఇచ్చారు. రైళ్లు, బస్సుల్లో ప్రయాణిస్తూనే ఐటీ ఉద్యోగులు కొందరు ల్యాప్‌టాప్‌లో వర్క్ చేస్తూ ఉండటం మనం అప్పుడప్పుడు గమనిస్తున్నాం. అలా బెంగళూరుకు చెందిన ఓ మహిళ కూడా ప్రయాణవేళల్లో వర్క్ చేసింది. అయితే ఆ సమయంలో ఆమె కారు నడుపుతూ ల్యాప్‌టాప్‌లో వర్క్ చేయడం వివాదాస్పదమైంది. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ కాగా.. దీనిపై పోలీసులు చర్యలు చేపట్టారు. బెంగళూరులోని ఆర్టీ నగర్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఓ మహిళ కారు డ్రైవ్ చేస్తూనే ల్యాప్‌టాప్‌లో వర్క్ చేస్తుంది. దీన్ని ఎవరో వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశారు. అదికాస్తా వైరల్‌గా మారి ట్రాఫిక్ పోలీసుల కంట పడింది. దీంతో ఆమెను ట్రాక్ చేసిన పోలీసులు వెయ్యి రూపాయిలు జరిమానా విధించారు. అంతేకాక.. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆ మహిళ వీడియోతో పాటు అదుపులోకి తీసుకున్న ఫొటోను ట్రాఫిక్ డీసీపీ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'వర్క్ ఫ్రమ్ హోమ్ అనేది ఇంటి నుంచి చేసేది. కారు డ్రైవ్ చేస్తూ కాదు' అని రాసుకొచ్చారు. దీనిపై పలువురు నెటిజన్లు స్పందిస్తూ.. పోలీసుల చర్యకు అభినందనలు తెలుపుతున్నారు. మరోవైపు ఆ మహిళ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ కామెంట్లు పెడుతున్నారు.

## గ్రూప్2 మెయిన్ పరీక్షపై
# ఏపీపీఎస్సీ కీలక ప్రకటన

**అమరావతి, ఫిబ్రవరి 13 (జనంసాక్షి)** : ఆంధ్రప్రదేశ్ గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షకు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) జారీ చేసింది. త్వరలో నిర్వహించనున్న గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను గురువారం (ఫిబ్రవరి 13) విడుదల చేసినట్లు ఏపీపీఎస్సీ ప్రకటించింది. అధికారిక వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను అభ్యర్థులు ముందుగానే డౌన్‌లోడ్ చేసుకుని అందులోని సూచనలను పాటించాలని పేర్కొంది. గతంలో ఇచ్చిన ప్రకటన మేరకు గ్రూప్ 2 మెయిన్స్ పరీక్ష జనవరి 5వ తేదీన నిర్వహించవల్సి ఉంది. కానీ అప్పట్లో మెగా డీఎస్సీ హడావిడిలో ఈ పరీక్ష నిర్వహణ సాధ్యంకాదని కమిషన్ వాయిదా వేసింది. అయితే నాటకీయ పరిణామాల దృష్ట్యా మెగా డీఎస్సీ ప్రకటన వెలువడకపోగా మరింత ఆలస్యమైంది. ఇందుకోసం వాయిదా వేసిన గ్రూప్ పరీక్ష కూడా చాలా రోజుల వరకు వాయిదా పడింది. మరోవైపు టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాలన్నీ బిజీగా మారనున్నాయి. అందుకే ఈ పరీక్షలన్నింటికంటే ముందుగానే గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని భావించిన కమిషన్.. ఆ మేరకు ఫిబ్రవరి 23వ తేదీన నిర్వహించాలని నిర్ణయించింది. గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ఫిబ్రవరి 23న మొత్తం 13 జిల్లా కేంద్రాల్లో జరగనున్నాయి. పేపర్ 1 ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, పేపర్ 2 పరీక్ష సాయంత్రం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు నిర్వహించనుంది. కాగా గత ప్రభుత్వ హాయంలో గతేడాది డిసెంబర్ 7న గ్రూప్ 2 నోటిఫికేషన్‌ను విడుదల చేయగా.. అనంతరం రెండు నెలల వ్యవధిలోనే అంటే ఈ ఏడాది ఫిబ్రవరి 25న ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించింది. ఈ పరీక్షకు 4,83,535 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. వారిలో 4,04,037 మంది పరీక్షకు హాజరయ్యారు. ఏప్రిల్ 10న గ్రూప్ 2 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసింది. ఇందులో 92,250 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. ఇప్పటి వరకూ గ్రూప్ 2 మెయిన్స్ పరీక్ష తేదీని రెండు సార్లు వాయిదా పడింది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 23వ తేదీన మెయిన్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ స్పష్టం చేసింది.

# పదో తరగతి పరీక్షల్లో కీలకమార్పు

- విద్యార్థులకు అవగాహన కల్పించాలని విద్యాశాఖ సూచన
- మార్చి 6 నుంచి మార్చి 15వ తేదీ ప్రీఫైనల్
- మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పబ్లిక్ పరీక్షలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి)** : తెలంగాణ రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి వార్షిక పరీక్షల్లో కీలక మార్పు తీసుకురానున్నారు. పబ్లిక్ పరీక్షల్లో ఓఎంఆర్ పత్రంలో వివరాలను నింపడం నుంచి తదితర అంశాలను కొత్తగా చేర్చనున్నారు. దీనిపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షల్లోనే నమూనా ఓఎంఆర్ పత్రాలను అందించాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రీ ఫైనల్ పరీక్షలు మార్చి 6 నుంచి మార్చి 15వ తేదీ వరకు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్షల్లో టెన్త్ విద్యార్థులందరికీ ఓఎంఆర్ పత్రాలను అందించనున్నారు. విద్యార్థులకు అందించే ఈ ఓఎమ్ఆర్ పత్రాల్లో ప్రతి విద్యార్థి తనకు ఇచ్చిన ఆన్సర్ బుక్‌లెట్ సంఖ్యను రాయాల్సి ఉంటుంది. అలాగే దానిపై సంతకం కూడా చేయాలి. విద్యార్థికి సంబంధించిన ఇతర వివరాలు కూడా అందులో ముందుగానే ముద్రించి ఉంటాయి. వాటిని విద్యార్థులు సరిచూసుకోవాలి. వివరాల్లో తప్పులున్నా.. ఆ ఓఎంఆర్ తనది కాకపోయినా.. విద్యార్థులు వెంటనే ఇన్విజిలేటర్‌కు చెప్పాల్సి ఉంటుంది. అలాగే వారిచ్చే ఇతర నామినల్ రోల్ పత్రంలో సరైన వివరాలను రాయాల్సి ఉంటుంది. ఇక ఈ పరీక్షలు ముగిసిన తర్వాత మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల్లో ప్రతిరోజూ ఓఎంఆర్ పత్రాలను విద్యార్థులకు అందిస్తారు. నేరుగా పబ్లిక్ పరీక్షల్లో ఓఎంఆర్ పత్రాలను ఇవ్వడం వల్ల విద్యార్థులు అయోమయానికి గురయ్యే అవకాశం ఉంది. అందువల్ల కొందరు విద్యార్థులు తప్పులు చేసే అవకాశం ఉంది. మరికొందరికి సమయం వృథా అయ్యే ఛాన్స్ ఉంది. దీన్ని నివారించేందుకు ప్రీ ఫైనల్ పరీక్షల్లో నమూనా ఓఎంఆర్ పత్రాలను ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. దీనివల్ల విద్యార్థులకు కొంత సాధన అవుతుందని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి పేర్కొన్నారు. అలాగే గత ఏడాది వరకు 4 పేజీల మెయిన్ బుక్‌లెట్ తొలుత జారీ చేసి.. అది సరిపోకపోతే అదనపు షీట్లను ఇచ్చేవారు. దీంతో అదనపు షీట్ల సంఖ్యను కూడా ఓఎంఆర్ పత్రంపై రాసేవారు. అయితే ఈసారి మాత్రం ఇంటర్మీడియట్ తరహాలో 24 పేజీల బుక్‌లెట్‌ను పదో తరగతి విద్యార్థులకు కూడా ఇస్తున్నారు. దీనివల్ల బుక్‌లెట్‌పై అదనపు పత్రాల సంఖ్య రాయవల్సిన అవసరం ఉండదు. ఇలాంటి మార్పులన్నింటి దృష్ట్యా ప్రీ ఫైనల్ పరీక్షల్లో నమూనా ఓఎంఆర్ పత్రాలను అందించాలని విద్యాశాఖ భావిస్తుంది.

# రైతు నేస్తం...రేడియో...!



బహుజనహితాయా - బహుజన సుతాయ అన్నది ఆకాశవాణి ఆశయం. ఇది నెరవేరడానికి విద్య, వైద్య, విజ్ఞాన, వినోద కార్యక్రమాలతో పాటు, వ్యవసాయ కార్యక్రమాలు శ్రోతలకు అందించేందుకు కృషి చేస్తుంది. భారత దేశానికి వ్యవసాయం వెన్నెముక అని గుర్తించి, రేడియో గ్రామీణులకు సమాచారం చేరవేసే ప్రధాన మాధ్యమం కాబట్టి,1966లో అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి భారతరత్న సి.సుబ్రహ్మణ్యం ఆకాశవాణిలో సాగుబడి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.నాటి నుంచి వ్యవసాయ కార్యక్రమాలకు తన ప్రసారాల్లో ముఖ్య భాగం కల్పిస్తుంది. హరిత విప్లవ సమయంలో ఆకాశవాణి భూమిక విస్మరించ లేనిది.ఆ సమయంలో ఒక కొత్త వంగడానికి "రేడియో రైస్" అని పేరు పెట్టడం విశేషం. 1990 దశకం ప్రారంభం నుంచి స్థానిక రేడియో కేంద్రాలు సైతం వ్యవసాయ కార్యక్రమాలకు పెద్దపీటవేశాయి. 2004 నుంచి ఫిబ్రవరి 15న కేంద్ర వ్యవసా య మంత్రిత్వ శాఖ సౌజన్యంతో దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన కేవలం 12 రేడియో కేంద్రాల్లో కిసాన్ వాణి కార్యక్రమాలు ప్రారంభించగా,అందులో ప్రతిభ కలిగిన టువంటి, నిష్ణాతులైనటువంటి, రైతులను గుర్తించి, ప్రతి సంవత్సరం వారికి సన్మాన కార్యక్రమాన్ని చేస్తున్నాయి ఆకాశవాణి కేంద్రాలు.

ఆకాశవాణి కేవలం స్టూడియో కార్యక్రమాలకే పరిమితం కాకుండా, గ్రామాలకు కిసాన్ వాణి ప్రతినిధులను పంపించి, రైతుల అనుభవాలను, సమస్యలను రికార్డు చేసి రేడియోలో ప్రసారం చేస్తుండడం తో,ఆయా జిల్లాల్లో ఉన్నటువంటి,వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు కూడా జిల్లా వ్యాప్తంగా ప్రసారమయ్యేట్టుగా చూస్తున్నాయి. రైతాంగం ఈ కార్యక్రమాలను విని ప్రయోజనం పొందుతూ వ్యవసాయానికే పరిమితం కాకుండా పాడి పరిశ్రమ, పట్టు పరిశ్రమ, పండ్లతోటలు, కూరగాయల సాగు, మత్స్య పరిశ్రమ,తదితర అనుబంధ రంగాలపై సమగ్ర సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తుంది ఆకాశవాణి. రైతు సోదరుల అనుభవాలతో పాటు రోజు వాతావరణ శాఖ అందించే వివరాలు, వ్యవసాయ మార్కెట్ వారు తెలియజేసే ధరల వివరాలు,సాగు పాఠాలు,ఈ కిసాన్ వాణి కార్యక్రమాల్లో భాగంగా ఉంటాయి.రేడియో కేంద్రం పనిచేసేటువంటి జిల్లా లోని రైతులు పంటల నుంచి అధిక దిగుబడులు సాధించేందుకు ఆకాశవాణి కేంద్రం వారు ప్రత్యేకంగా రైతుల కోసం ఉదయం వేళ పొలం కబుర్లు,సాయంత్రం వేళ కిసాన్ వాణి, కర్షక లోకం వంటి కార్యక్రమాలు ప్రసారం చేస్తున్నారు.ఈ కార్యక్రమాలను విని తన సొంత వ్యవసాయ భూముల్లో అధిక దిగుబడులు సాధించే పంటలను పండిస్తూ,ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. కర్షకలోకం శీర్షిక న శాస్త్రవేత్త లు, వ్యవసాయ అధికారులు,పశుసంవర్ధ శాఖకు సంబం ధించినటువంటి అధికారులు, ఉద్యాన వన శాఖ అధికారు లు, ఇంకా వివిధ శాఖలకు సంబంధించినటువంటి అధికారుల యొక్క సలహాలు, సూచనలను ఇంటర్వ్యూల ద్వారా, వ్యవసాయ క్షేత్రాల యొక్క పరిశీలన ద్వారా రైతులకు చేరవేస్తూ,రైతులలో అవగాహనను పెంపొందించి అధిక దిగుబడి సాధించే విధంగా కృషి చేస్తున్నాయి.

భారత ప్రభుత్వం వ్యవసాయ మంత్రిత్వ శాఖ సమాచార శాఖల సలహా మేరకు 20 ఏళ్లుగా "రేడియో కిసాన్ దినోత్సవం" నిర్వహిస్తూ ఎంపిక చేసిన ఉత్తమ రైతులను ఘనంగా సత్కరిస్తుంది. రేడియో కార్యక్రమాలు క్రమం తప్పకుండా వినడం, పంటల సాగులో సాంప్రదాయ, శాస్త్రీయ పద్ధతుల ను సమన్వయం చేసుకుంటూ, మెలకువగా వ్యవసా య విధానం అనుసరించే వారిని గౌరవించడం వీరి ఉద్దేశమైతే, మహిళా రైతులకు సమ ప్రాధాన్యాన్ని ఇవ్వడం మరో ప్రధాన ఆశయం.ఆకాశవాణి ప్రతినిధులు సమర్పించే సమాచారంతోపాటు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు అందించే సమాచారం ప్రాతిపది కగా ఉత్తమ రైతులను ఎంపిక చేస్తూన్నారు.ఒక గ్రామంలో ఒకరికి మించి ఉత్తమ రైతులు ఉంటే వారిని తదుపరి సంవత్సరాలలో సత్కరిస్తూ,ప్రతి సంవత్సరం అన్నదాతకు అండగా నిలుస్తూ వారికి అవసరమైన సమాచారాన్ని ప్రసారం చేస్తూనే పంటల్లో అధిక దిగుబడులు వచ్చేలా సహకరిస్తున్నాయి ఆకాశవాణి కేంద్రాలు.అంతేగాక ప్రముఖుల సూచనలు పాటిస్తూ మంచి దిగుబడులు సాధించిన రైతులను గుర్తించి సన్మానిస్తుంది.ఈ విధంగా కిసాన్ వాణి,కర్షక లోకం కార్యక్రమాలు ఫలితాలను ఇస్తున్నాయి.పంటల సాగులో అధిక దిగుబడులు సాధిస్తూనే ఉత్తమ రైతులకు సన్మానించి వారికో గుర్తింపునిస్తూ, వారికి అండగా నిలుస్తుంది ఆకాశవాణి.

**డాక్టర్ మోటె చిరంజీవి**
తాత్కాలిక వ్యాఖ్యాత,
వరంగల్ రేడియో జర్నలిస్టు
అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు. వరంగల్.
ఆకాశవాణి వరంగల్ కేంద్రం.
సెల్ : 9949194327



# ఢిల్లీలో నూతన శకం ఆరంభం..!

గత మూడు దశాబ్దాలుగా దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ మరియు పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ఆసక్తిని నెలకొల్పడంతో పాటు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నాయి.ప్రతీసారిఢిల్లీ ప్రజల విన్నూతనమైన తీర్పులో భాగంగా ఫిబ్రవరి 2025 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఆప్ అనూహ్య ఓటమితో పాటు భాజాపా సంచలన విజయం దేశ రాజకీయాల్లో మరో నూతన ఒరవడికి నాంది పలికింది.12 ఏళ్ల ఆప్ ప్రభుత్వ పాలనను "ఢిల్లీ ఆమ్ ఆద్మీ"తన ఓటు సాయంతో ఈ సారి 22 అసెంబ్లీ సీట్లతో ప్రతిపక్షం హోదాకు పరిమితం చేస్తూనే,48 అసెంబ్లీ సీట్లతో మోదీకి సంపూర్ణ మద్దతుతో ఘనవిజయాన్ని ప్రకటించారు.మోదీ జైత్రయాత్ర కు అంతర్జాతీయ గుర్తింపుకు నిదర్శనంగా దేశ రాజధానిలో "డబుల్ ఇంజిన్" సర్కార్ ను భాజాపా నాయకత్వంనకు కానుకగా ఇచ్చారు.



అవినీతి వ్యతిరేక ఉద్యమకారుడు,సామాజిక కార్యకర్త అన్నా హజారే జంతర్ మంతర్ దీక్ష సందర్భంగా జాతీయ మీడియా వెలుగులోకి వచ్చిన కేజ్రీవాల్ స్వల్ప కాలంలోనే ఆప్ ను స్థాపించి, దేశ రాజకీయాల్లో జాతీయ పార్టీ కన్వీనర్ గా ఎదిగి తనదైన శైలిలో ప్రభావం చూపారు.చీపురు గుర్తుతో, అవినీతి రహిత పాలన పేరుతో ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలతో విద్య, వైద్యం రంగాల్లో సమూల మార్పులు తీసుకొచ్చారు.దేశభక్తి అనేది ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించిన పేటెంట్ హక్కు కాదంటూ "నవరాజకీయ పోకడలతో"బలమైన నాయకునిగా ఎదిగారు.ముఖ్యంగా మోదీ రాజకీయ చతురతను మరియు భాజాపా విజయపరంపరను బలంగా ఎదుర్కొనే ప్రయత్నమే చేశారు.కానీ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో జైలుకు వెళ్ళడం, ఇండియా కూటమిలో భాగమై వుంటూనే ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ను విమర్శించడం, పారిశుద్ధ్యం, పర్యావరణ కాలుష్యములో ప్రజలు ఊహించిన మెరుగైన స్థాయిలో పాలన అందించకపోవడం, పార్టీ శాసనసభ్యులు అవినీతి ఆరోపణలు ఎదుర్కొవడం వంటివి ఎన్నో కారణాలు నేడు ఆప్ ను అపజయం ముంగిట్లో నిలిపాయి.యమునా నది శుద్ధి కి సంబంధించిన బలమైన రాజకీయమే నేటి ఆప్ ఓటమికి మరో ప్రధాన కారణంగా చెప్పవచ్చు.

కల్కాజీ నియోజకవర్గం నుంచి ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ స్వల్ప మెజారిటీతో గెలవటం కొంచెం ఆప్ పార్టీకి ఊరటనిచ్చే అంశం.అవినీతి మార్క్ తనపై వుండకూడదని ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి, ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ అరవింద్ కేజ్రీవాల్ భాజాపా అభ్యర్థి పర్వేష్ వర్మ పై ఓడిపోవడం నేడు దేశవ్యాప్తంగా సంచలన వార్త అయ్యింది.ప్రజాతీర్పును శిరసావహించి ప్రజాక్షేత్రంలో ప్రజాపక్షాన భాజాపా పాలనపై పోరాడుతామన్న కేజ్రీవాల్ రాజకీయ భవిష్యత్తు ఇప్పుడు కష్టకాలంలో వుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.మరి "ఆప్" ప్రయాణం,పోరాటం ఎటువైపు వెళ్తుందో కాలమే సమాధానం చెప్పాలి.15 సంవత్సరాలు ఢిల్లీ ని పాలించిన కాంగ్రెస్ ను ప్రజలు ఈసారి కూడా తిరస్కరించిన వైనం మనం ఫలితాల గణాంకాల నుంచి అర్థం చేసుకోవచ్చు.కొంచెం ఓటుశాతం పెరగడం మాత్రం ఆ పార్టీకి కొంచెం ఉపశమనం.ఏదేమైనా ఇండియా కూటమిలో కీలకంగా వున్న కాంగ్రెస్ పార్టీ నేడు భాజాపా ను,మోదీ విజయ యాత్రను ఎదుర్కొవాలంటే చాలా చాలా కష్టపడాలి.దేశ ప్రజలను తమ ప్రజాస్వామ్య, లౌకిక తత్వపు నిబద్ధతతో ఆకట్టుకోవాలి.రాహుల్ గాంధీ నాయకత్వంపై దేశప్రజలకు నమ్మకం వచ్చేలా వారి ప్రయాణం ప్రజాహితమై దేశ ఉజ్వల భవిష్యత్తుకై ముందుకే కొనసాగాలి.ఎందుకంటే రాజకీయాల్లో ఏమైనా జరగొచ్చనే విషయాన్ని గుర్తించుకొని రాహుల్ గాంధీ మరియు కేజ్రీవాల్ దేశాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలి.

ఇక 26 సంవత్సరాలుగా అందని ద్రాక్ష గా మిగిలిన ఢిల్లీ సింహాసనాన్ని గెలవడంలో ఈసారి భాజాపా రాజకీయ



వ్యూహం,కార్యకర్తల అకుంఠిత దీక్షతో కూడిన శ్రమ బాగానే పనిచేశాయి.అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూనే ఢిల్లీ ప్రజల ఓట్లను "అభివృద్ధి నమూనా"పేరుతో కాలుష్యం పై యుద్ధం ప్రకటించి ఎన్నికల్లో ముందుకు వెళ్ళింది భాజాపా అగ్రనాయకత్వం.2025 కేంద్ర వార్షిక బడ్జెట్ లోని 12 లక్షల వార్షిక ఆదాయంనకు ఆదాయపు పన్ను మినహాయింపు ప్రకటన ఢిల్లీ లోని మధ్యతరగతి ప్రజల విశ్వాసాన్ని గెలిచి,ఓట్ల వర్షాన్ని భాజాపా పై కురిపించింది.


ఈసారి మోదీ కూడా స్వయంగా వికాస్,విజన్,విశ్వాస్ ప్రకటనతో "మోదీ గ్యారంటీ" ని జనం గుండెల్లోకి చొచ్చుకొని పోయేలా తన ప్రసంగాలను మార్చుకున్నారు.ఆప్ నుంచి ఢిల్లీ ప్రజలకు విముక్తి కావాలనే బలమైన విమర్శలతో పాటు "తన భరోసా" విశ్వాసాన్ని చాటారు.ఆప్ ప్రభుత్వ పథకాల అవినీతి ఆరోపణల బాగోతాన్ని ప్రజలకు వివరించారు.

ఇప్పటికే ఒక సంవత్సరం నుంచి ఆప్ ప్రభుత్వ పాలనతో విసిగిపోయిన రాజధాని ప్రజలు వికసిత భారత్ 2047 లో భాగంగా ఢిల్లీ ని కూడా మోదీకి కమలంలో పెట్టి అందించారు.దేశానికి గుండె లాంటి దేశరాజధాని ఢిల్లీ మనదేశ అభివృద్ధి ముఖచిత్రాన్నే మార్చాలని,ఇక గెలుపోటములను సహజ విషయాలుగా తీసుకొని అన్ని పార్టీల నాయకులు రాజకీయాలకతీతంగా, ప్రజాస్వామ్య బద్ధంగా మన దేశ జాతి సమగ్రతను కాపాడుతూ అభివృద్ధి భారతాన్ని నిర్మించడంలో తమవంతు పాత్రను పోషిస్తారని ఆశిద్దాం.ఢిల్లీ ప్రజలు "కాలుష్యరహిత పాలనలో" వికసించాలని కోరుకుంటూ.....

**ఫిజిక్స్ అరుణ్ కుమార్**
ప్రయివేటు టీచింగ్ ఫ్యాకల్టీ
9394749536



# ట్రంప్ -నేతన్యహు లక్ష్యం ఒక్కటే!



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 'గాజా ' మీద ఇజ్రాయిల్ యుద్ధంను అక్కడి ప్రధాని నేతన్యహు ను ఒప్పించి ఆప్పించానని చెప్పాడు. షరతుల ప్రకారం హమాస్ వద్ద, అటు ఇజ్రాయిల్ వద్ద ఉన్న ఇరుపక్షాల ఖైదీ లను విడుతల వారీగా విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యం లో గాజా మీద యాజమాన్య హక్కు తనకు ఉంటుందని అక్కడ సముద్రపు ఒడ్డున రిసార్ట్ లు, అక్కడ మంచి ఏర్పాట్లు చేస్తామని, అయితే గాజా పట్టిని ఖాళీ చేయాలని, జోర్డాన్ తదితరులు వారిని చూసుకోవాలని అంటాడు ట్రంప్! ట్రంప్ ప్రకటన నేతన్యాహు కు నచ్చినట్లె, ఎందుకంటే గాజా నుంచి జనాన్ని ఖాళీ చేయించడమే, అతని లక్ష్యం కదా! ఇక్కడ వీరిద్దరి ఉద్దేశం ఒక్కటే అని తేలిపోయింది! ఇదంతా చూస్తున్న, వింటున్న హమాస్ తమ వద్ద ఉన్న, అఖరి ఆయుధమైన ఖైదీల విడుదల విషయంలో కొంత డిలే చేయడమే కాక యుద్ధం, దాడులు మళ్ళీ గాజా ఖాళీ చేయించే విషయం లో నేతన్యాహు, ట్రంప్ లు కలిసి దాడి చేసే అవకాశం ఉందని అప్రమత్తం అవుతున్నట్లు కనిపిస్తున్నది. మరో వైపు తాము గాజా విడిచి ఎటుపోతామని, బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఈ శనివారం అంటే 15 న మధ్యాన్నం 12 గంటల వరకు హమాస్ నిర్బంధం లో ఉన్న ఇజ్రాయిల్ ఖైదీలను విడుదల చేయాలని, ట్రంప్ వార్నింగ్ జారీ చేశాడు. మళ్ళీ గాజా మీద దాడి తప్పదా? అనే పరిస్థితి ఉన్నది. కొన్ని చోట్ల దాడులు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే 56,200 మంది గాజా లో పాలస్థినీయులు చంపబడిన అధికారిక,78,000 మంది మరణించారు అనేది అనధికారిక లెక్కలు చెబుతున్నాయి.92 శాతం గృహాలు,70 శాతం పెద్ద భవనాలు, ఆసుపత్రులు నేలమట్టం అయ్యాయి. ఉండడానికి షెల్టర్ లేదు. అక్కడ మళ్ళీ గాజా నిర్మాణానికి పది హేను ఏండ్ల పడుతుంది. అయితే యుద్ధం, బాంబుల మోత వల్ల భూమి పనికి రాకుండా అయ్యింది, అంటున్నారు. ఈ నేపథ్యంలో గాజా ను కబ్జా చేసే పని లో ఉన్నారు అమెరికా అధ్యక్షుడు ట్రంప్! అయితే తాజాగా ట్రంప్ మాటలను చైనా ఖండిస్తూ, ముమ్మాటికీ గాజా పాలస్థినియులదే అని పేర్కొంది. ట్రంప్ ఆలోచన దుర్మార్గమైనదని, ప్రపంచ దేశాల లోని మెజారిటీ ప్రజలు పేర్కొంటున్నారు. ప్రపంచం ఇలా చూసుకుంటూ ఉంటే ఎట్లా ? ఇప్పుడు కాకుంటే ఎన్నటికి సాధ్యం కాదు !

**ఎండి.మునీర్,**
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,



కళ్ల ముందు కనిపించే సమాజాన్ని
తెలుసుకో లేక....
కనిపించని లోకం గురించి
ఊదర గొట్టే బోధననే
ఆధ్యాత్మికం అంటారు

-హెచ్.ఆర్.చంద్రం
9493248053

# పుల్వామా ఉగ్రదాడి

## ఒక విషాదకర అధ్యాయం



మాతృ భూమి కోసం ప్రాణాలు త్యాగం చేసి వారి రక్తంతో దేశమాత నుదుటి పైకన్నీటి తిలకం దిద్దారు పుల్వామా రణభూమిలో అమరులైనారు, వీర సైనికులు దేశమాత గుండెలలో అరుణ రక్తపు నదులుగా ప్రవహిస్తున్నారు, ధైర్యంతో సింహ గర్జన చేసి శత్రువులతో పోరాటం చేస్తూ, ప్రాణాలను దారపోసిన సైనికులారా మీకు ఇవే మా కన్నీటి నివాళులు.మీ జ్ఞాపకాలు మాకు సరిహద్దులలో దీపకాంతులై రక్షణ మంత్రాన్ని స్మరిస్తున్నాయి.2019 ఫిబ్రవరి 14న జమ్మూ-కాశ్మీర్ లోని పుల్వామా జిల్లాలో సీఆర్పీఎఫ్ జవాన్ల కన్వాయ్‌పై జరిగిన ఉగ్రదాడి, భారతదేశ చరిత్రలోనే అత్యంత మారణహోమాల్లో ఒకటిగా నిలిచింది. ఈ స్వీయ-విస్ఫోటక దాడిలో 40 మంది భారతీయ సైనికులు ప్రాణాలర్పించారు. జైష్-ఎ-ముహమ్మద్ (JeM) సంస్థ ఈ దాడికి బాధ్యత వహించింది, ఇది భారత-పాకిస్తాన్ సంబంధాలను మరింత తీవ్రతరం చేసింది. జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై పుల్వామా సమీపంలో సాయంత్రం 3:15 గంటల సమయంలో ఈ దాడి జరిగింది. ఉగ్రవాది అదిల్ అహ్మద్ దార్ 300-350 కిలోగ్రాముల విస్ఫోటకాలతో లాదిన్ చేసిన SUV వాహనాన్ని సీఆర్పీఎఫ్ కన్వాయ్‌పై ఢీకొట్టాడు. ఈ కన్వాయ్‌లో 78 వాహనాల్లో 2,500 మంది జవాన్లు ప్రయాణిస్తున్నారు. 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు మరణించారు, అనేక మంది గాయపడ్డారు. ఈ దాడికి ప్రతిస్పందనగా, భారత ప్రభుత్వం ఫిబ్రవరి 26న పాకిస్తాన్లోని బాలకోట్ లో జైష్-ఎ-ముహమ్మద్ శిబిరాలపై వాయుదాడి నిర్వహించింది. ఇది భారత్ యొక్క "ప్రిఎంప్టివ్ స్ట్రైక్"గా ప్రచారం చేయబడింది. అమెరికా, ఫ్రాన్స్, యుకె తదితర దేశాలు ఉగ్రవాదాన్ని ఖండించాయి. (ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్) పాకిస్తాన్‌పై ఆర్థిక ఒత్తిడిని తీవ్రతరం చేసింది.భారతదేశంలో దాడి పట్ల అత్యంత కోపం మరియు సహా నుభూతి తరంగాలు ఏర్పడ్డాయి. సైనిక భద్రతా ప్రోటోకాల్లు మరింత కఠినమయ్యాయి. భారత్ పాకిస్తాన్‌కు "అత్యధిక ప్రాధాన్యత దేశం" (MFN) స్థితిని రద్దు చేసింది. కాశ్మీర్‌లోని అర్ధసైనిక దళాల కార్యాచరణలు మరింత బలోపేతం చేయబడ్డాయి పుల్వామా దాడి, భారతదేశం యొక్క భద్రతా వ్యవస్థలోని లోపాలను బహిర్గతం చేసింది మరియు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ సహకారం యొక్క అవసరాన్ని హైలైట్ చేసింది. ఈ దాడిలో ప్రాణాలర్పించిన వీరుల స్మరణలు భారతీయుల హృదయాల్లో ఎల్లకాలం నిలిచిపోయాయి. ఉగ్రవాదం వల్ల కలిగే మానవీయ మరియు రాజకీయ నష్టాలను ఇది మళ్లీ నొక్కిచెప్పింది. జై భారత్ నినాదాలతో ధ్వజమెత్తి మరణాన్ని కూడా లెక్క చేయక దేశ స్వాభిమానాన్ని కాపాడిన సైనిక వీరుల త్యాగం మరువలేనిది వారి మరణం తిరిగిరానిది. దేశమాత ఉదయం పై జై జవాన్ నామస్మరణ నిత్యం ప్రతిధ్వనిస్తూనే ఉంది.

**పూసపాటి వేదాద్రి**
కవి సాహితీ విశ్లేషకులు
9912197694



# "మూడో గొంతుక కోసం వెతుకులాట"

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1980 నుండి 90 దశకం చివరి వరకు జరిగిన ఎన్‌కౌంటర్ హత్యాకాండలో అనేక మంది యువకులు హత్యగావించబడ్డారు. ఆ హత్యలకు భయపడి గ్రామాల్లోని యువత వేరే ప్రాంతాల్లోకి పారిపోయారు. స్థానికంగా ఉన్న ఏ యువకున్నైనా ఇంట్లో నుంచి ఎత్తుకెళ్ళి ఊరు అవతల ఎన్‌కౌంటర్ పేరుతో హత్యగావిస్తున్న స్థితిని ప్రజలెవరూ తట్టుకోలేకపోయారు. కానీ అప్పటికే అంటే 1987లో 7గురు ఐఎస్ ఆఫీసర్లలో ఒకడైన ఎస్ఆర్ శంకరన్ గుర్తెడులో కిడ్నాప్‌కు గురై విడుదల కాబడ్డ అతను 1997లో పదవీ విరమణ తరువాత ఈ ఎన్‌కౌంటర్లపై స్పందిస్తూ ఒక మూడవ గొంతుక ఉండాలని ప్రయత్నం చేశాడు. ఆ ప్రయత్నంలో భాగంగానే పౌరస్పందన వేదిక (మూడవ గొంతుక) ఏర్పడింది. ఇది సుమారు ఒక దశాబ్ద కాలం చేసిన ప్రయత్నాల మూలంగా అటు అప్పుడున్నటువంటి ఉద్యమపార్టీ పీపుల్స్ వార్‌తో అదే విధంగా అప్పటికే ఉన్న తెలుగుదేశం చంద్రబాబు నాయుడు ప్రభుత్వంతో సంప్రదింపుల చర్యలు ప్రారంభమయ్యాయి. ఆ సమయంలోనే అలిపిరి 2003లో జరిగిన ఘటనలో చంద్రబాబు నాయుడు తృటిలో తప్పించుకోవడం ఆ తరువాత 9 నెలల ముందుగానే ఎన్నికల్లోకి వెళ్ళడం జరిగింది. దీనిలో చంద్రబాబు నాయుడు మీకు ఇట్ల హింసారాజకీయాలు కావాలా నాలాంటి రాజకీయాలు కావాలా తెల్చుకొమ్మని రెఫరెండంగా ఆ ఎన్నికలను ప్రకటించడం జరిగింది. దానిలో ప్రజలు హింసారాజకీయాలవైపే మొగ్గు చూపుతూ చంద్రబాబుపై జరిగిన దాడి సానుభూతి కూడా లేకుండా ఘోరంగా ఓడగొట్టడం చర్చలకు, నిషేదం ఎత్తివేతకు సిద్ధమని ప్రకటించిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వానికి అధికారాన్ని అప్పగించడం ప్రజల చైతన్య స్పూర్తికి నిదర్శనంగా నిలబడింది. ఆ నాటి నుండి పౌరస్పందన వేదిక అనేక మంది మేధావులతో ప్రధానంగా అన్ని తెలుగు దిన పత్రికల సంపాదకులతో అదే స్థాయిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నటువంటి మేధావి వర్గంతో కలిసిపోతూ ఒక శాంతియుత వాతావరణం కోసం తీవ్రంగా ప్రయత్నం చేసింది. అందులో భాగంగానే 2004లో శాంతి చర్చలకు పునాది రాయి పడింది. ఆ శాంతి చర్చల కాలంలోనే పీపుల్స్‌వార్‌గా ఉన్నటువంటి ఉద్యమపార్టీ హైదరాబాదు ఫీర్జాదిగూడ గ్రౌండ్‌లో మావోయిస్టు పార్టీగా తన పేరును ప్రకటించుకున్నది. మొదటి దఫ శాంతి చర్చల కాలం ముగిసిన తరువాత రెండవ దఫా చర్చలకు మళ్ళీ పిలుస్తామని చెప్పి ఆపేసిన చర్చలు మళ్ళీ ఇంత వరకు జరగలేదు. తరువాత వచ్చిన సామాజిక రాజకీయ మార్పుల్లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రిగా వచ్చిన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కూడా తెలంగాణ ఉద్యమంలో మావోయిస్ట ఉద్యమకారుల పాత్రను పరిగణలోకి తీసుకున్నప్పటికి అదేమీ లేదన్నట్లుగా బుకాయించడం కోసమే ఆ రంగం నుండి వచ్చిన మేధావులందరిని తన కోటరీలో ప్రధాన బాధ్యతల్లో చేర్చుకొని ఉద్యమంపై ఉక్కు పాదాన్ని మోపాడు. కానీ మావోయిస్టుపార్టీ ఎజెండానే తన ఎజెండాగా ప్రకటించాడు తప్ప వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాలంలో ఆగిపోయిన శాంతి చర్చల ప్రక్రియను పునరుద్దరించడంలో విఫలం అవడమే కాక, 2015లో శృతి, సాగర్‌లను అత్యంత క్రూరంగా ఎన్‌కౌంటర్ పేరుతో హత్యగావించారు. దాన్ని తట్టుకోలేని రెండు తెలుగు రాష్ట్రాల ప్రజానీకం వేలాదిగా హైదరాబాదుకు తరలివచ్చి హైదరాబాద్ ముట్టడిని కొనసాగించింది. వాళ్ళను నిర్బంధించడానికి హైదరాబాదులోని పోలీస్ స్టేషన్ చాలక గోషామహల్ స్టేడియంను ఉపయోగించుకున్న స్థితి ఉంది. ఆ ఎన్‌కౌంటర్ హత్యలు భవిష్యత్తులో ఉండవని ప్రజలకు, హామీ ఇవ్వడం ఒక మేరకు బాధ్యతపడడం జరిగింది. నేడు అదే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికి తెలంగాణ సరిహద్దు ప్రాంతాలన్ని ఎన్‌కౌంటర్ హత్యలతో నెత్తురు పారుతున్నది. కానీ ఇక్కడ హక్కుల సంఘాలు, ప్రజా సంఘాలు, కొద్ది మంది మేధావులు స్పందిస్తు ఆపరేషన్ కగార్ హత్యాకాండను నిరసిస్తూ మాట్లాడుతున్నారు. కానీ రాజకీయ పార్టీలుగా బలంగా మాట్లాడడం లేదు. ప్రధానంగా సిపిఐ పార్టీ నుంచి కూనంనేని సాంబశివరావు, మాస్‌లైన్ పార్టీ నుండి పోటు రంగారావు, బిఆర్ఎస్ పార్టీ నుండి ఎంఎల్‌వి క్రాంతి కుమార్ వ్యక్తులుగానే మాట్లాడగలుగుతున్నారు. కానీ వారి శక్తి కూడా సరిపోవడం లేదు. ఎలాగైతే ప్రపంచంలో పాలస్తీనపై ఇజ్రాయేలు దాడి చేస్తే ఐక్యరాజ్య సమితి నిస్తేజమై ఉన్నట్లుగా నేడు మధ్యభారతంలో ఆదివాసీల పరిస్థితి ఉన్నది. దేశంలో ఉన్న అన్ని ప్రతిపక్ష పార్టీలు, ప్రాంతీయ పార్టీలు మధ్యభారతంలో జరుగుతున్న ఆదివాసీల హననంపై బాధ్యతగా మాట్లాడాల్సిన అవసరం ఉన్నది. కానీ రాజకీయ పార్టీలన్ని ఒకే తాన్‌లో ముక్కలాగా ఏవీ కూడా బాధ్యతగా మాట్లాడలేకపోతున్నాయి. మన తెలంగాణ వరకు చూసినా బిఆర్ఎస్ పార్టీ గాని కాంగ్రెస్ పార్టీ గాని బలంగా మాట్లాడాల్సిన అవసరం ఉన్నది. ఒక వైపు మాట్లాడకపోగా తెలంగాణ సరిహద్దుల్లో చెన్నపట్నం పుసుగుప్ప లాంటి చోట్ల మొత్తం 4 పోలీస్ క్యాంపులన ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పుడు ఈ స్తితి ఒక మూడవ గొంతుక కోసం వెతుకులాట సాగుతున్నది. ఒక వైపు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పూర్తి అప్రజాస్వామికంగా ఉద్యమాన్ని హత్యలతో నిర్మూలిస్తామని పెద్ద పెద్ద ఎన్‌కౌంటర్లు జరిగినప్పుడల్లా ప్రకటిస్తు వస్తున్నారు. కానీ అక్కడ జరుగుతున్నవి ఏవీ ఎన్‌కౌంటర్ కావని వేలాదిగా ఒక్కసారిగా గ్రామాన్ని చుట్టుముడితే మరొకవైపు అడవిలోకి పారిపోతున్న ఆదివాసీలను బంధీలుగా చేసుకొని క్రూరంగా హింసించి చంపేసి యూనిఫామ్స్ తొగిడి నక్సలైట్లుగా ప్రకటిస్తున్నారు. అదే నిజం కాకపోతే హక్కుల సంఘాలన నిజనిర్ధారణకు అవకాశం ఇచ్చేవారు. ఇప్పటికే అక్కడ ఉన్నటువంటి పియుసిఎల్ లాంటి హక్కుల సంస్థ ఇప్పటికే రెండుమూడు ఘటనల మీద నిజనిర్ధారణ ప్రక్రియను కొనసాగిస్తే వారిపై కూడా తీవ్ర నిర్బంధం అమలవుతున్నది. నిజనిర్ధారణ సంస్థలపై నిర్బంధం తప్ప ఎన్‌కౌంటర్ హత్యా ఘటనలపై నిజనిర్ధారణ చేసే అవకాశం లేకుండా డబుల్ ఇంజన్ సర్కార్ పాలన చేస్తున్నది. ప్రజాస్వామ్యం ప్రపంచంలోనే అతి ప్రదానమైనదిగా భావిస్తాం, అది మన భారతదేశంలో ఉన్నదని గర్వపడతాం. కానీ ఆచరణలోకి వస్తే మూలవాసులైన ఆదివాసులపై వారి జీవించే హక్కు పూర్తిగా అభద్రతకు లోనైనా గామాల్లో పట్టణాల్లో జీవిస్తున్న మధ్యతరగతి ఉన్నత స్థాయి అనుకునే మేధావులు కావచ్చు బుద్ధి జీవులు కావచ్చు కనీసంగా నైనా 30-40లుగా హత్యకు గురవుతున్న ఆదివాసుల పట్ల గొంతెత్తడానికి కూడా ముందుకు రావట్లేదు. 2018లో ప్రారంభమైన అర్బన్ నక్సల్ అనే నిర్బంధం దానికి తోడు ఉపా చట్ట నిర్బంధం రాజకీయ పార్టీల మీద ప్రజాసంఘ నేతల మీద కూడా తీవ్ర ప్రభావం చూపిస్తున్నదనేది ఒక వాస్తవమైనప్పటికి ఆదివాసుల జీవించే హక్కు, ఉద్యమకారుల జీవించే హక్కులను బూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో అమలు చేయడాన్ని ప్రజాస్వామిక వాదులుగా మనందరం వ్యతిరేకించాల్సిన అవసరం ఉన్నది. అందుకోసమైన మన నుండి ఒక మూడవ గొంతుక రావాల్సిన అవసరం ఉంది. ఆ వైపుగా ప్రధాన మీడియా సంపాదక వర్గం ముందుకు రావాల్సిన అవసరం ఉంది. ఒక వైపు చత్తీస్‌ఘడ్‌లో జాతీయ, అంతర్జాతీయ మీడియా ఎటువంటి స్థానం లేని స్థితిలో స్థానికంగా ఉన్న యూట్యూబ్ ఛానెల్స్‌లో అక్కడ జరుగుతున్న హక్కుల ఉల్లంఘనను ప్రపంచం చూడగలుగుతుంది. అది కూడా లేకుండా బస్తర్ జంక్షన్ ముఖేష్ చంద్రాకర్‌ను అత్యంత క్రూరంగా హత్యచేసిన స్థితిని మనందరం చూశాం. హక్కుల సంఘాల నిజ నిర్ధారణకు అవకాశం లేకుండా చేయడం ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన పత్రికా స్వేచ్ఛ కూడా లేని స్థితిని కల్పించి కొనసాగిస్తున్న కగార్ హత్యాకాండను ప్రజాస్వామిక వాదులుగా మనం ఎలా అంగీకరించగలం. ఇప్పటికే 1 జనవరి 2024 నుండి ఆపరేషన్ కగార్ పేరుతో డిసెంబర్ 2024 వరకు 350 మంది హత్యగావించబడితే, ఈ ఏడాది రెండు నెలలు పూర్తి కాకుండానే ఇప్పటికే 86 మంది హత్యగావించబడ్డారు. ఏ హత్యాఘటన మీద ఇప్పటి వరకు ఎటువంటి విచారణను ప్రభుత్వం చేపట్టలేదు. అలాగని హక్కుల సంఘాలకు నిజనిర్ధారణకు అవకాశం ఇవ్వడం లేదు. ఒక రకంగా మోడీ అమిత్‌షాలు ఫాసిస్టు నిర్బంధ పాలనను దేశవ్యాప్తంగా కొనసాగిస్తున్నారు. రచయితలు, మేధావులు, విద్యార్థులు అందరు కూడా తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొంటున్నారు. ఢిల్లీలోపట కగార్ హత్యాకాండను ప్రచారంలో భాగంగా వాల్ రైటింగ్ రాసినందుకు వారిపై కూడా తీవ్ర చిత్ర హింసలను అక్రమ కేసులను బనాయించి నిర్బంధించిన స్థితిని చూస్తున్నాం. ఈ స్థితిలో మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ప్రతిపక్ష నాయకుడైన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుతోపాటు సిపిఐకు చెందిన కూనంనేని సాంబశివరావు, మాస్‌లైన్ పార్టీకు చెందిన పోటురంగారావులు బాధ్యత పడి ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి రాజ్యాంగాన్ని పూర్తిస్థాయిలో అమలు పరచడానికి, ఇప్పటి వరకు జరిగినటువంటి కగార్ హత్యాకాండపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జి చేత నిజనిర్ధారణ జరిపించడానికి డిమాండ్ చేయాలని పౌరహక్కుల సంఘంగా విజ్ఞప్తి చేస్తూ ఇటువంటి డిమాండ్‌ను నెరవేర్చడానికి రాజకీయపార్టీలపై ఒత్తిడి తీసుకురావాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రధానంగా జరుగుతున్న హత్యాకాండ దండకారణ్యంలో ఉన్నటువంటి కోట్లాది విలువైన సహజ వనరుల కోసమే తప్ప మరొకటి కాదు రాజ్యాంగంలో అతి ముఖ్యమైనది మౌలికమైనది జీవించే హక్కు ఆర్టికల్ 21. దాన్ని విధ్వంసం చేసుదానికే, వనరులను దోచిపెట్టడానికే ప్రభుత్వం ఆదివాసులపై కొనసాగిస్తున్న యుద్ధమే ఆపరేషన్ కగార్. నేడు కూడా పౌర స్పందన వేదిక లాగా మూడవ గొంతుక అవసరం ఎంతైనా ఉంది. ఆ వైపుగా మేధావి వర్గం, బుద్ధిజీవులు, ప్రధానంగా ప్రధానపత్రికల సంపాదకులు కదిలి దేశంలో ఆదివాసుల ఉద్యమకారుల హననాన్ని నిరోదించవలసిన బాధ్యత వారిపై ఉందనే నిజాన్ని గ్రహించాలని ఆ వైపుగా మీ పయనం ఉండాల్సిందిగా అందరికి పౌరహక్కుల సంఘం విజ్ఞప్తి చేస్తూ ఆదివాసీల హననానికి వ్యతిరేకంగా గొంతు విప్పుదామని తెలియజేస్తున్నది. 50 ఏళ్ళుగా నిరూపించబడుతున్న సత్యం ఎన్‌కౌంటర్లన్ని ప్రభుత్వ హత్యలే. ఈ ఎన్‌కౌంటర్లు తెలుగు రాష్ట్రాలను దాటి దండకారణ్యంలో ఈ ఎన్‌కౌంటర్ వేట కొనసాగుతుంది. ఈ దేశ పౌరులుగా మనకున్న బాధ్యతలోంచి న్యాయ వ్యవస్థను గౌరవించాల్సిన ప్రభుత్వం తానే హత్యలు చేస్తూ న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నది. ఇప్పటికే దేశవ్యాప్తంగా మీడియా వ్యవస్థ నిర్వీర్యమైపోయి ఉన్నది. న్యాయవ్యవస్థను కూడా కూల్చేస్తున్న ప్రభుత్వాల దమన నీతిని ప్రశ్నించాల్సిన అవసరం మనందరిపై ఉన్నది. దండకారణ్యాన్ని చుట్టుముట్టి ఉన్న భద్రతా దళాలన్నింటిని ఖాళీ చేయించాలి, ఎన్‌కౌంటర్ హత్యాకాండలను ఆపివేయండని డిమాండ్ చేస్తూ గతంలో గుజరాత్, మణిపూర్‌ల తర్వాత చత్తీస్‌ఘడ్‌లో ఆదివాసీల వెచ్చని నెత్తురును పారిస్తున్న ప్రభుత్వాల అమానుష హత్యాకాండను నిలువరించాల్సిందిగా డిమాండ్ చేస్తూ ఉద్యమిద్దాం.



**ఎన్. నారాయణ రావు,**
ప్రధానకార్యదర్శి,
పౌరహక్కుల సంఘం.



# విద్యా హక్కు చట్టం ప్రైవేట్‌కు చుట్టం

- పర్యవేక్షించాల్సిన అధికారులు మొద్దు నిద్రలో..
- ప్రభుత్వ నిర్దేశించిన ఫీజులపై నియంత్రణ లేని వైనం

**మేడ్చల్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** మేడ్చల్ మండల పరిధిలో ప్రభుత్వ విద్యాశాఖ అధికారులు విద్యా హక్కు చట్టాన్ని కాలరాస్తున్నారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు జోరుగా నడుస్తున్నాయి. ప్రభుత్వం విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ స్కూల్లతో పాటు ప్రైవేట్ స్కూళ్లలో కూడా పర్యవేక్షించాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులపైనే ఉంటుంది. కానీ దానికి పూర్తి భిన్నంగా విద్యాశాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య హక్కు చట్టం ప్రవేశపెట్టి నిరుపేద విద్యార్థులకు ప్రైవేట్ స్కూళ్లలో సైతం విద్యాహక్కు చట్టం ద్వారా అడ్మిషన్లు కల్పించి వారి విద్యా వ్యవస్థకు తోడ్పాటు అందిస్తుంది. దీని పర్యవేక్షించాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులు. కానీ విద్యాశాఖ అధికారులు మాత్రం విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడంలో పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారని మేడ్చల్ పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అంతేకాకుండా ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ఫీజులను నిర్ణయించింది. ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు వివిధ స్లాబులవారిగా ప్రభుత్వం ట్యూషన్ ఫీజుల ధరలను నిర్ణయించగా కానీ ప్రైవేట్ స్కూల్లో యాజమాన్యాలు కూడా ఏనాడు కూడా విద్యా హక్కు చట్టాన్ని పూర్తిగా అమలు చేయడం లేదని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్య హక్కు చట్టాన్ని తుంగలో తొక్కడమే కాకుండా విద్యా హక్కు చట్టం ద్వారా చేర్చుకున్న పిల్లలకు సైతం ప్రభుత్వ స్లాబు రేటు ఫీజులను పక్కనపెట్టి ప్రైవేట్‌గా ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఏ మేరకు సమంజసం అని మేడ్చల్ మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**శ్రీ చైతన్య టెక్నో స్కూల్ యాజమాన్యంపై హత్య కేసు నమోదు చేయాలి**

శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థిని అఖిల (16) ఫీజు చెల్లించడం లేదని ఆ పాఠశాల ప్రిన్సిపల్ రమాదేవి విద్యార్థిని అందరి ముందు అవహేళన చేయడంతో ఇది భరించలేని విద్యార్థిని అవమానంగా భావించి ఇంటికి ఏడుస్తూ వెళ్లి తీవ్ర మానసిక ఆవేదనకు గురైన అఖిల ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన కేవలం ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుల ప్రకారం కాకుండా పాఠశాల యాజమాన్యం ఇష్టారీతిన ఫీజులు వసూలు చేయడం వల్ల అఖిల మృతిచెందినట్లు విద్యార్థిని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కావున సంబంధిత పాఠశాల యాజమాన్యంపై, సిబ్బందిపై హత్య కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## విద్యుత్ సరఫరా సక్రమంగా చేయాలంటూ రైతులు ఆందోళన



**ఝరాసంగం, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** త్రీఫేస్ విద్యుత్ సరఫరా సక్రమంగా చేయకపోవడంతో పొలంలో సాగు చేసిన పలు రకాల పంటలు ఎండు ముఖం పడుతున్నాయని మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామానికి చెందిన రైతులు మల్లికార్జున పాటల్,రవీందర్, ,యాదగిరి లు గురువారం స్థానిక విద్యుత్ కార్యలయం ముందు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు మూడు రోజుల నుంచి త్రీఫేస్ విద్యుత్ సరఫరా రాకపోవడంతో కోత కు వచ్చిన ఆలు గడ్డ,శనగ,జొన్న పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. విషయం సంబంధిత అధికారులకు తెలియజేసిన పట్టించుకోవడం లేదన్నారు. పంటల సాగు కోసం పెట్టుబడిగా లక్షల రూపాయలను వెచ్చించడం జరిగిందన్నారు . విద్యుత్ ఏఈ అందుబాటులో ఉండకపోవడం వల్లే ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయన్నారు.

## ఆదిశిలా క్షేత్రం దర్శించుకున్న ట్రైనీ కలెక్టర్లు



**మల్దకల్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని ట్రైనీ కలెక్టర్లు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపక్ వర్మ (ఢిల్లీ) అమిత్ వర్మ (ఢిల్లీ) మహేష్ లాల్ (ఢిల్లీ) మయూక్పాల్ (కలకత్తా) దేవాలయానికి రాగా అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించారు. అనంతరం పట్వారి అరవిందరావు స్వామి వారి శేష వస్త్రం చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా శ్రీ తిమ్మప్ప స్వామి చరిత్రను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయరెడ్డి, ఇంచార్జి ఎంపీఓ రాజశేఖర్, సూపర్డెంట్ పెద్ద నరసన్న, పంచాయతీ కార్యదర్శి తిరుమలయ్య,చంద్రశేఖర రావు, టెక్నికల్ అసిస్టెంట్ నాగరాజు తదితరులు ఉన్నారు.

## చేనేత రంగాన్ని సమిష్టిగా కాపాడుకుందాం

- సహకార భారతి జాతీయ అధ్యక్షులు అనంత కుమార్ మిశ్రా



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** దేశ స్వాతంత్ర సమరంలో ప్రధాన పాత్ర పోషించి ప్రజల మానం కాపాడుతున్న చేనేత పరిశ్రమను అందరం కలిసి సమిష్టిగా కాపాడుకుందాం అని సహకార భారతి జాతీయ అధ్యక్షులు అనంత కుమార్ మిశ్రా పిలుపునిచ్చారు. గురువారంసహకార భారతి ఆధ్వర్యం లో నారాయణపేట పట్టణంలో అఖిల భారత సహకార భారతీ చేనేత విభాగం కో కన్వీనర్ కే.శ్రీనివాస్ అధ్యక్షతన చేనేత కార్మికుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని అనంత కుమార్ మిశ్రా మాట్లాడుతూ సమాజంలో చేనేతది ఎంతో ప్రాముఖ్యం అన్నారు. అలాంటి నేత కార్మికులు నేడు అన్నమో రామచంద్ర అంటు బతుకిడుస్తు దయనీయ స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి చేనేత పరిశ్రమను ప్రభుత్వాలు గతంలో విధ్మరించాయని అన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వలె నేడు నేత కార్మికులు దుర్భర జీవితాలు గడుపుతున్నారని అన్నారు. వారి సంక్షేమం కోసం సహకార భారతి తన వంతు కృషి చేస్తున్నదని అన్నారు. అయినా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వాలు చేనేతను మరీ నిర్లక్ష్యం చేయడంతో కార్మికులు ఆత్మహత్యలకు పాల్పదుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వము పరిష్కరించాలని కోరారు. ప్రస్తుతం నడుస్తున్న త్రిఫ్ట్ ఫండ్ స్కీమ్ లో ప్రభుత్వం మూడుసంవత్సరముల నుండి రెండు సంవత్సరములు,ముగ్గురు సభ్యుల నుండి ఇద్దరిని చేయడం, రూపాయలు 2200 నుండి రూ 1800 లు తగ్గించడం చూస్తుంటే ప్రభుత్వ విధానం విడ్డూరంగా ఉందని అన్నారు. అందుకే సహకార భారతి రాష్ట్ర శాఖ తరుపున త్రిఫ్ట్ ఫండ్ ను గతంలో ఉన్నట్లు మూడు సంవత్సరములు ఉండాలి ముగ్గురు సభ్యులకు ఉండాలి ఒక మొగ్గానికి రూపాయలు 4000 లు కార్మికులు కట్టే విధంగా ప్రభు త్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమములో బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగు రావు నామాజీ,సహకార భార తి రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు ఎన్.కుమార స్వామి, కే.బాల్ రెడ్డి, ఉదయబాను, యాదగిరి, రాధాకృష్ణ, వెంకట్రాములు, వివిధ చేనేత సంఘాల అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మన ఇసుక వాహనం ద్వారానే ఇసుక తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** జిల్లా ప్రజల అవసరం మేరకు మన ఇసుక వాహనం ద్వారా ఇంటి వద్దకే ఇసుక సరఫరా చేయడం జరుగుతుందని, ఇసుకకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే ప్రజలు కంట్రోల్ రూమ్ కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి నేడు ఒక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. వనపర్తి జిల్లాలో అక్రమ ఇసుక వ్యాపారం చేసేవారి పై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో 12 ఇసుక రీచ్ లు ఉన్నాయని, గృహ నిర్మాణాలు చేపడుతున్న జిల్లా ప్రజలకు మన ఇసుక వాహనం ద్వారా తక్కువ ధరకే ఇసుక ఇంటి వద్దకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఇసుకకు సంబంధించి ఏమైనా సమస్యలు ఎదురైనట్లయితే ఐ డి ఓ సి లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 08545-233525 కు కాల్ చేసి తెలపవచ్చని చెప్పారు. నేరుగా వచ్చి సమస్య తెలియజేయాలనుకునేవారు ఐడిఓసి లోని రూమ్ నెంబర్ 115 కి వచ్చి తమ సమస్యలను తెలియజేసి సహాయం పొందవచ్చు అని చెప్పారు. ఉదయం ఆరు గంటల నుంచి, సాయంత్రం 6 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

## ఏకీకృత పెన్షన్ మాకొద్దు

- సీపీఎస్ యూనియన్ జిల్లా ఆర్థిక కార్యదర్శి: మైలారం చంద్రం



**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** ఏకీకృత పెన్షన్ మాకువద్దని సిపిఎస్ యూనియన్ ఆర్థిక కార్యదర్శి మైలారం చంద్రం అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యూపీఎస్ విధానం వద్దుఅనే కరపత్రాన్ని ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఇటీవల కేంద్ర మంత్రి వర్గం యూపీఎస్ విధానం ను ఆమోదం తెలపిందని, ఏప్రిల్ 1 2025 నుండి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేయనున్న ఏకీకృత పెన్షన్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. ఏకీకృత పెన్షన్ విధానం అనేది కేవలం ఉద్యోగులను మోసగించి, కార్పొరేట్ల కడుపు నింపడానికి వచ్చింది తప్ప ఉద్యోగి కుటుంబానికి సామాజిక భద్రత చేకూర్చే పథకం కాదని దీన్ని తీవ్రంగా ప్రతిఘటించాల్సిన సమయం ఆసన్నమైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేణుమాధవ్, ఇందిరా రెడ్డి, భూపాల్ రెడ్డి, పవన్, రుక్మిణి, రజాక్, ప్రణిత, లక్ష్మి, శ్రీవాణి, పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలతో నమ్మకం పెంచుకోండి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



**చర్ల, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** జిల్లాలో మారుమూల ప్రాంతాల ప్రభుత్వ ఆసుపత్రులు పట్ల నమ్మకం పెంచాలని.. అందుకు తగ్గట్లగానే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అడుగులు వేస్తున్నామని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. చర్ల మండలంలో గురువారం కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించారు. చర్ల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఆయన ఇక్కడ ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు.. ఆసుపత్రిలో వార్డులో తిరిగి రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆరా తీశారు. వైద్య సిబ్బంది ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.. చర్ల ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. భద్రాచలం వెళ్లే డయాలసిస్ రోగులకు ఇక్కడ డయాలసిస్ కేంద్రం ఏర్పాటుతో చాలావరకు వారి కష్టాలు తీరాయన్నారు. డయాలసిస్ కేంద్రంలో ఐదు యంత్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆపరేషన్ థియేటర్ , ల్యాబ్, ఫార్మసీ అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటామన్నారు. చర్ల ఆసుపత్రి భవనాల నిర్మాణాలతో పాటు ఈ ప్రాంత ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందుబాటు లోకి తేవడమే సంకల్పంగా పని చేస్తామన్నారు. దంత వైద్యానికి సంబంధించిన సామాగ్రిని అందుబాటులోకి తెస్తామన్నారు. రక్త నిధి కేంద్రం ఏర్పాటును పరిశీలిస్తామని పేర్కొన్నారు. అంతకుముందు చర్ల మండలంలోని చింతకుంట, మొగలపల్లి ఇసుక ర్యాంపులు సందర్శించారు. ఇసుక అక్రమ రవాణా జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, తాసిల్దార్ శ్రీనివాస్ ఎంపీడీవో ఈదయ్య ,వైద్యాధికారులు బురుగడ్డ సాయి వర్ధన్, పెద్దాడ శ్రీకాంత్, పాలంచ జగన్, సీడీపీవో చైతన్య పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

- టిపిటియు రాష్ట్ర అధ్యక్షులు రాధాకృష్ణ



**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** ఉపాధ్యాయ ఉద్యోగులకు సంబంధించి పెండింగ్లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని టిపిటియు రాష్ట్ర అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు రాధాకృష్ణ, పట్ల చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి లో టి పి టి యు సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే జిపిఎఫ్ సరెండర్ లీవులు, సప్లమెంటరీ బిల్లులు నెలల తరబడి పెండింగ్ లో పెట్టడంతో ఉపాధ్యాయులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పెన్షనర్లు వారి సర్వీసు మొత్తంలో దాచుకున్న డబ్బులు రాకపోవడంతో ఆవేదనతో ఆత్మహత్యలకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగులో ఉన్న బిల్లులు విడుదల చేసి మెరుగైన పి అర్ సి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి ఎం. భుజంగం, నరసింహమూర్తి, సతీష్, రూప్ సింగ్ పాల్గొన్నారు.

## లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి ,రమేష్




**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** పని ప్రదేశాలలో లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర ఆదేశాల మేరకు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి బి రమేష్ గురువారం జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై అవగాహన కల్పించారు. పి ఓ ఎస్ హెచ్ చట్టం 2013 పని ప్రదేశాలలో స్త్రీలపై లైంగిక వేధింపులు జరపరాదని, జరిపిన వారిపై కఠినంగా శిక్షించడం జరుగుతుందని తెలిపారు. మహిళా ఉద్యోగులు కార్మికులు ఎక్కడైనా లైంగిక వేధింపులకు గురైతే ఫిర్యాదు ఇవ్వవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీధర్ రావు, అటవీ శాఖ ఉద్యోగులు, ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా విముక్తి రాజనీతి కవితా సంపుటి ఆవిష్కరణ



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** విముక్తి రాజనీతి కవిత సంపుటి సమాజ్ వాది ఉద్యమ నేత అక్కల బాబు గౌడ్ రచించిన పుస్తకాన్ని గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సంపుటినిబీసీ ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్రఅధ్యక్షులు. కె.రామాంజనేయులు గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సమకాలీన రాజకీయ వ్యవస్థపై 77 ఏళ్ల స్వతంత్ర పాలనలో 76 సంవత్సరాల రాజ్యాంగ అమలులో, రాజ్యాంగబద్ధంగా దేశ ప్రజలందరికీ, సామాజిక, ఆర్థిక రాజకీయ, సమానత్వం, రాష్ట్రంలోని 90 శాతం సబ్బండ జాతీప్రజలకు అందని ఎండమావి అయిన విషయమై,రచయిత అక్కల బాబుగౌడ్,తను రాసిన విముక్తి రాజనీతి కవితా సంపుటి అన్నారు. 28 కవితలలో ఓటు విలువ గురించి, అణచివేయబడ్డ వర్గాల ప్రజల రాజకీయ ఓటు చైత న్యం గురించి సబ్బండ జాతు లు రాజకీయ అధికారాన్ని సాధించే దిశగా,తన కవితల లో స్పష్టంగా సరలమైన భాష లో,లోతైన విషయ అవగాహ నతో,నేటి రాజకీయ పరిస్థి తులను, పాలనావిధానాలను అద్భుతంగా వివరించారన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలందరికీ సమాన ప్రాతినిధ్యం లభిం చాలని,రాజ్యాంగ స్ఫూర్తిని, ప్రజా సంక్షేమ పాలన గురించి చక్కగా వివరించాడన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారి. జి. రంగప్ప యాదవ్. ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి. ఎం. లింగం గౌడ్ . నారాయ ణపేట జిల్లా కార్యదర్శులు సత్యనారాయణ ముదిరాజు. రవికుమార్. లక్ష్మణ్ యాదవ్. ముష్టి రాజు. గోవింద్ యాదవ్ . నరసింగప్ప ఎం. నారాయణ యాదయ్య గౌడ్ . డి. నరసింహులు ఆశోక్ గౌడ్. బోయినపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉత్తమ విద్యతోపాటు నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలి

- అదనపు కలెక్టర్ నర్సింగరావు



**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** విద్యార్థులకు ఉత్తమ విద్య అందించడంతో పాటు,నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అధికారులకు ఆదేశించారు. గురువారం గద్వాల మండలంలోని పుటాన్ పల్లి గ్రామంలో తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాల ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో పరిస్థితులను సమీక్షించి, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన తయారీ విధానాన్ని నిశితంగా పరిశీలించి,విద్యార్థులకు పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి,విద్యార్థుల హాజరు శాతం మెరుగుపరచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించిన అదనపు కలెక్టర్, పరిశుభ్రత విషయంలో ఎప్పుడూ శ్రద్ధ వహించాలని అన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించి, వారు ఏ విధంగా చదువుతున్నారు, ఏయే సబ్జెక్టులపై ఆసక్తి చూపుతున్నారు అనే విషయాలను తెలుసుకున్నారు. విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరిచే విధంగా వారికి ఉత్తమ విద్య అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొంటూ, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేలా చదువు, విలువలు, క్రమశిక్షణ కలిగి ఉండేలా మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకుల కళాశాల సిబ్బంది,ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రాజ్యాంగంపై గౌరవం లేని పాలకుల చేతిలో దేశం మగ్గుతోంది

- **కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**




**పాల్వంచ, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** రాజ్యాంగంపై, ప్రజాస్వామ్యంపై గౌరవంలేని పాలకుల చేతిలో దేశం మగ్గుతోందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం పట్టణ పరిధిలోని వాసవి హాల్ లో సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి సభ్యులు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ ప్రతిపక్ష పాలిత ప్రభుత్వాలను కూల్చేసే పనిలో కేంద్ర బీజేపి ప్రభుత్వం ఉందని, అధికారం కోసం బిజెపి ఎంతకైనా తెగిస్తున్నారుని, అందులో భాగంగానే అక్రమ కేసులు పెట్టి సీబీఐ, ఈడి ద్వారా దాడులు జరుపుతూ ప్రతి పక్షాలను భయపెడుతున్నారుని విమర్శించారు. మావోయిస్టులును మార్చ్ వరకు లేకుండా చేస్తాం అని అమిత్ షా ప్రకటన వెనక ఆంతర్యం ఏంటి అని, ప్రశ్నించే గొంతుకులను నలిపివేయటమే బిజెపి ఎజెండాగా పెట్టుకుందని విమర్శించారు. పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్ర జెండా పార్టీకి ఎదురులేదని, ప్రజలకు ఏ కష్టమొచ్చినా గుర్తొచ్చేది ఎర్ర జెండానేని అన్నారు. సమ సమాజ స్థాపన-సోసిలిస్టు రాజ్య సాధనే కమ్యూనిస్టుల లక్ష్యం అని, అందుకోసం ఎటువంటి త్యాగాలకైనా వెనకాల పోమని స్పష్టం చేశారు. స్థానిక సంస్థలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కునేందుకు సిపిఐ సిద్ధంగా ఉందని, పొత్తులు సర్దుబాట్లు ఎన్నికల వచ్చినప్పుడు నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రతి పంచాయతీలో సిపిఐకి ప్రాతినిధ్యం వచ్చే విధంగా కార్యకర్తలు నాయకులు కార్యాచరణ రూపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే జిల్లా వ్యాప్తంగా సిపిఐ శత వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించాలని, శతవసంతాల వేడుకలతో పార్టీ ప్రజా సంఘాలను మరింత బలోపితం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి అయోధ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, పుల్లారెడ్డి, సలీం, కే సారయ్య, కల్లూరి వెంకటేశ్వరరావు, కమటం వెంకటేశ్వర్లు, మున్నా లక్ష్మి కుమారి, నారాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, దేవరకొండ శంకర్, పట్టణ మండల కార్యదర్శులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, వాసిరెడ్డి మురళి, భూక్య దస్రు, బంధం నాగయ్య, గుగులోత్ రామ్ చందర్, డి సుధాకర్, జి రామకృష్ణ, సతీష్, బుర్ర కేశవరావు, నారాయణ, ఎండి యూసుఫ్, ధర్మ, గుగ్గిల కృష్ణ, జిల్లా సమితి సభ్యులు, ప్రజాసంఘాల జిల్లా బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక విక్రయించే చిరు వ్యాపారుల జోలికి వెళ్లొద్దు

- **రాచకొండ కమిషనర్‌తో మాట్లాడిన మధుయాష్కీ**



**హయత్‌నగర్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** ఇసుక కుప్పలు (డంపులు) ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందుతున్న ఎల్బీనగర్ పరిసర ప్రాంతాలకు చెందిన చిరు వ్యాపారస్తులు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ ని కలిశారు. కాలేశ్వరం నుంచి పెద్ద లారీ లలో వచ్చే ఇసుకను కొనుక్కొని.. రిటైల్ గా విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నామని వారు పేర్కొన్నారు. కానీ కొన్ని రోజులుగా ఇసుక డంపులపై ఎస్ఓటీ పోలీసులు దాడులు చేస్తూ, కేసులు పెడుతున్నారని.. తమ సమస్య పరిష్కరించాలని వేడుకున్నారు. స్పందించిన మధుయాష్కీ రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు కి ఫోన్ చేసి మాట్లాడారు. లారీలలో నుంచి కొనుక్కొని చిల్లరగా విక్రయించుకునే చిరు వ్యాపారస్తులను ఇబ్బందులు పెట్టవద్దని సూచించారు. అక్రమంగా రవాణా చేసేవారిని కాకుండా.. చిరు వ్యాపారులను ఇబ్బందు పెట్టడం తగదన్నారు. కమిషనర్ కూడా అక్రమంగా లారీలలో తరలించే వాటిపై మాత్రమే చర్యలు తీసుకుంటున్నామని.. చిరు వ్యాపారస్తులను ఇబ్బందులు పెట్టమని వివరించారు. ఈ క్రమంలో వేగంగా స్పందించిన రాచకొండ కమిషనర్ తమ కిందిస్థాయి అధికారులు అందరికీ వెంటనే సూచనలు చేసినట్టు అధికారులు తెలిపారు. ఇసుక కుప్పలు పెట్టుకొని విక్రయించుకునే వారిని ఇబ్బందులకు గురి చేయవద్దనీ అధికారులకు సూచించారు. వేగంగా సమస్య పరిష్కారం కావడంతో చిరు వ్యాపారస్తులు సంతోషం వ్యక్తం చేశారు. రాచకొండ సిపి వెంటనే స్పందించి కింది స్థాయి అధికారులందరికీ తగిన ఆదేశాలు ఇవ్వడంపై మధుయాష్కి సీపీ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ విషయంపై ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ తో, ఎస్ఓటి పోలీసులతో, జిల్లా మైనింగ్ అధికారులతోనూ వారు మాట్లాడారు. ఇసుక విక్రయించుకునే చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయకూడదని సూచించారు. తమ సమస్యపై వెంటనే స్పందించి ఉన్నతాధికాలతో మాట్లాడి సమస్య పరిష్కరించినందుకు ఇసుక వ్యాపారులంతా మధుయాష్కీకి ధన్యవాదాలు తెలిపారు. తమకు ఏ సమస్య వచ్చినా అండగా ఉండాలని కోరారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వారు పేర్కొన్నారు.

# పంచాయతీ ఎన్నికల్లో స్టేజ్-2 అధికారుల పాత్ర కీలకం

- **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో స్టేజ్-02 అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. గురువారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జడ్పిటిసి ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి. స్టేజ్-02 రిటర్నింగ్ ఆఫీసర్స్ శిక్షణా కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామని గ్రామ పంచాయతీ ఎన్నికలలో స్టేజ్ -02 అధికారులు కీలకంగా వ్యవహరించాలని ఈయనే కౌంటింగ్ చేసి ఫలితాలు ప్రకటించే అధికారిగా ఉంటారన్నారు.. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు కౌంటింగ్ రోజు నిబద్ధతతో పని చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించుకోవాలని, పోలింగ్ కేంద్రాలను పరిశీలించుకుని మౌలిక వసతులు సరిగా ఉన్నాయా లేదా లేకపోతే సంబంధిత ఎంపీడీవో దృష్టికి తీసుకుని వెళ్లి తద్వారా చర్యలు చేపట్టాలన్నారు. రెండో రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్ లతో విధులు నిర్వహించే వారితో వెళ్లి పోలింగ్ కేంద్రాల్లో ఉండి మరుసటి రోజు ఎన్నికల నిర్వహించుకుని వార్డ్ వైజ్ , కౌంటింగ్, సర్పంచ్ కౌంటింగ్ చేసి ఉపసర్పంచిని ఎన్నిక చేసుకోవాల్సి ఉంటుంది అన్నారు, ఎన్నికల నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ వార్డ్ మెంబర్స్, సర్పంచ్ ఎంపికలో ఎలాంటి పొరపాట్లు తావు లేకుండా పక్కా ప్రణాళికతో వ్యవహరించాల్సిన బాధ్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవో రమాదేవి,జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, విద్యాశాఖ అధికారి రాధా కిషన్, సైన్స్ అధికారి రాజిరెడ్డి, సంబంధిత స్టేజ్-02అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 8న జాతీయ లోకదలాత్

- **జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని చంద్ర**



**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** క్షణికావేశంలో ఇరువర్గాలు చిన్న చిన్న తగాదాలు పడి కేసులు నమోదు జరిగి కోర్టు చుట్టూ తిరుగుతూ తమ తమ విలువైన సమయాన్ని వృధా చేసుకోకుండా కోర్టులో తమ తమపై ఉన్నటువంటి కేసులను రాజీచేసుకుని సామరస్యంగా స్నేహభావంతో కలిసిమెలిసి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. భవాని చంద్ర పేర్కొన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సౌజన్యంతో సంగారెడ్డి కోర్ట్ లో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు న్యాయవాదులతో వచ్చే నేల 8 వ తేదిన జాతియ లోకదలత్ సందర్భం గా సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతు,రాజీ చేయదగ్గ పోలీస్ కేసులు, భార్యాభర్తల చిన్నచిన్న వివాదాలు, ఎక్సైజ్ కేసులు, బ్యాంక్ కేసులు తదితర కేసులు రాజీ చేయదగ్గ కేసులలో ఇరువర్గాలు లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకోవచ్చు అన్నారు. న్యాయవాదులు సహకారం అందించి లోకదళత్‌ను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి .రమేష్ ,బార్ ప్రెసిడెంట్ విష్ణు వర్ధన్ రెడ్డి ,సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# పాల్వంచలో పర్యటించిన మంత్రి పొంగులేటి



**పాల్వంచ, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్వంచ పట్టణంలో గురువారం పర్యటించారు. పర్యటనలో భాగంగా స్థానికంగా ఉన్న పెద్దమ్మతల్లి ఆలయాన్ని, శివాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో సత్కరించారు. అదేవిధంగా స్థానిక ఫంక్షన్ హాల్‌లో జరిగిన బత్తుల అంజి సోదరుని కుమారుని వివాహానికి హాజరయ్యారు. పట్టు వస్త్రాలను కానుకగా సమర్పించారు. నిండు నూరేళ్ళు చల్లగా ఉండాలని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఇటీవల వివాహం జరిగిన నవీన్ దంపతులను కేశవాపురంలోని వారి ఇంటి వద్ద ఆశీర్వదించి పట్టు వస్త్రాలను కానుకగా అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన చీకటి కార్తీక్ గాంధీ భవన్‌లో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసేందుకు వెళ్తూ మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన టీమ్ ఆధ్వర్యంలో మంత్రిని గజమాలతో ఘనంగా సత్కరించారు. డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. పలు ప్రైవేట్ కార్య క్రమాల్లోనూ పొంగులేటి పాల్గొన్నారు. ఈ పర్యటనలో మంత్రి వెంట ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావ్, జారే ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

# ఇసుక అక్రమ రవాణాపై కొనసాగుతున్న దాడులు

- **స్పెషల్ డ్రైవ్‌తో 71కు చేరిన కేసుల నమోదు**



**మల్కాజిగిరి, ఫిబ్రవరి13 (జనంసాక్షి) :** అక్రమ ఇసుక రవాణా అరికట్టడంలో రాచకొండ పోలీసులు మరోసారి తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ, అక్రమంగా ఇసుక తవ్వకాలు, రవాణా చేపట్టే వారిపై రాచకొండ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత కొన్ని రోజులుగా రాచకొండ కమిషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక రవాణా మీద పోలీసుల ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ఈ క్రమంలో రెండో రోజు కొనసాగిన స్పెషల్ డ్రైవ్ తో నమోదయిన కేసుల సంఖ్య 71 కి చేరుకుంది. ఎల్బీనగర్ జోన్ 26 కేసులు,మల్కాజిగిరి జోన్ 23 కేసులు,యాదాద్రి- భువనగిరి జోన్ 10 కేసులు, మహేశ్వరం జోన్ 12 కేసులు నమోదు చేశారు. ఇలా నాలుగు జోన్లలో 107 మంది నిందితుల మీద 71 కేసులు నమోదు చేయడంతో పాటు 44 ఇసుక డంపులలోని 58 లక్షల 72 వేల రూపాయల విలువైన 3762 టన్నుల ఇసుకను సీజ్ చేసి 9 లారీలు, 5 టిప్పర్లు, ఒక మినీ వ్యాన్ మరియు 8 ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ, ఇసుక మాఫియాను అరికట్టడంలో రాచకొండ పోలీసులు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని, ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై మరింత కఠినంగా వ్యవహరించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇక ముందు కూడా తమ దాడులు ఇలాగే కొనసాగుతాయని, నేరస్తులను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

# సమస్యలపై కలెక్టర్‌కు బీఆర్ఎస్ నాయకుల వినతి



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** మణికొండ పురపాలక సంఘం లోని పలు సమస్యలపై భారాస అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుప్పాలగూడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రక్కన 2019 లో రూ. 45 లక్షల బడ్జెట్ తో బాబాసాహెబ్ అంబేద్కర్ భవనాన్ని నిర్మించాలని, అప్పుడు శంకుస్థాపన చేసిన పనులు ప్రారంభించలేదని పుప్పాలగూడ గ్రామ ప్రజల సంతకాల సేకరణ తో కూడిన పత్రాన్ని కలెక్టర్కు అందజేశారు. అలాగే పుప్పాలగూడ గ్రామం నుంచి ఊరికి సంబంధించిన స్మశాన వాటికకు రహదారిని పునర్నిర్మించాలని ఇప్పుడున్న బిల్డర్ల ఆర్.ఎం.సి ప్లాంట్ ను తొలగించాలని, ముస్లింల స్మశాన వాటికకు నెక్నాంపూర్ గ్రామంలో స్థలం కేటాయించాలని, పుప్పాలగూడ గ్రామంలో తానాషా నగర్ హుడా కాలనీ పార్క్ వద్ద అంబేద్కర్ విగ్రహాలను నెలకొల్పాలని కలెక్టర్కుకు కోరారు. ఈ కార్యక్రమంలో సీతారాం ధూళిపాళ, కుంబగళ్ళ ధనరాజ్, గుట్టమీది నరేంద్ర, అందె లక్ష్మణ్ రావు, ఉపేంద్రనాథ్ రెడ్డి, సంగం శ్రీకాంత్, రామ సుబ్బారెడ్డి, సుమన్, భాను చందర్, ఆరీఫ్ మొహమ్మద్, సుమ నళిని, ఉసేన్, అశ్వక్ అలీ, మణి, బొడ్డు శ్రీధర్, తిరుపతి, శేఖర్ పాల్గొన్నారు.

# బైపాస్ బాధితులకు పునరావాసం కల్పించి ఆదుకోవాలి



**చారకొండ, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** జడ్చర్ల- కోదాడ జాతీయ రహదారి 167లో భాగంగా మండల కేంద్రంలో నిర్మాణం చేపడుతున్న బైపాస్ రోడ్డులో ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం పునరావసం కల్పించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా నేత బండపల్లి బాలస్వామి అన్నారు. మండల కేంద్రంలోని ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులు చేపట్టిన రిలే నిరహారదీక్షలు గురువారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా సీపీఎం జిల్లా నేత బాలస్వామి మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి ఇళ్లు కట్టుకోని ఇక్కడే బ్రతుకుతున్న నిరు పేదలకు చెందిన 29 మంది ఇళ్లను బైపాస్ రోడ్డుకు అడ్డు వస్తున్నాయని అధికారులు ముందస్తుగా ఏలాంటి సమాచారం ఇవ్వకుండానే తమ కళ్లముందు ఇళ్లను నేలమట్టం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల కాళ్లు పట్టుకొని మా ఇళ్లు కూల్చోద్దని ప్రత్యామ్మాయం చూసుకొనేంత వరకు కొంత సమయం ఇవ్వాలని నిర్వసితులు గుండెలు బాదుకుంటు వేడుకున్న కనికరం లేకుండా అధికారులు దగ్గర ఉండి ఇళ్లను కూల్చి వేయడంతో నిర్వాసితుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆరోపించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి నిర్వాసితులకు ఇంటి జాగతో పాటు ఇళ్లు నిర్మించి, పరిహారం రూ.50 లక్షలు పెంచి ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నందూరి చిట్టెమ్మ, అలివేల, విజయ, వెంకటమ్మ, లాలమ్మ, బాల్ నారి, అశోక్ రెడ్డి, లింగమయ్య, నల్ల కిరణ్ , రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆలస్యంగా వచ్చారని స్కూల్ యాజమాన్యం దాష్టీకం

- **మూడు గంటల పాటు గేటు బయట**
- **మండుటెండలో పిల్లలను నిలబెట్టిన వైనం**
- **యాజమాన్యం తీరుపై మండిపడుతున్న తల్లిదండ్రులు**




**బూర్గంపహాడ్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం మోరంపల్లి బంజర లో పాఠశాలకు ఆలస్యంగా వచ్చారని ఓ ప్రయివేటు స్కూల్ యాజమాన్యం చిన్నారులు అని కూడా చూడకుండా మూడు గంటల పాటు మండుటెండలో నిలబెట్టి విద్యార్థుల పట్ల అమానుషంగా ప్రవర్తించారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మోరంపల్లి బంజర్ గ్రామంలో ఓ స్వచ్ఛంద సంస్థ పేరుతో నిర్వహిస్తున్న స్టెల్లా మేరీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ యాజమాన్యం ముగ్గురు చిన్నారులు స్కూల్ కు గురువారం ఆలస్యంగా వెళ్లడంతో ఆ పాఠశాల యాజమాన్యం ఆ ముగ్గురు పిల్లలను గేటు బయటకు పంపి మూడు గంటల పాటు మండుటెండలో నిలబెట్టి పనిష్మెంట్ ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న చిన్నారుల తల్లిదండ్రులు పాఠశాల హెచ్‌ఎం ను ప్రశ్నించడంతో ఆమె దురుసుగా ప్రవర్తించి టీసీ కూడా ఇచ్చి పంపుతానని బెదిరించినట్లు కూడా తెలిసింది. పాఠశాల సమయం దాటి పిల్లలు వస్తే మందలించాలే తప్ప ఇలా అమానుషంగా ప్రవర్తించి చిన్న పిల్లలు అని కూడా చూడకుండా గంటల తరబడి ఎండలో నిలబెట్టడమేమిటంటూ విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఆ పాఠశాల ఉపాధ్యాయుల్లో కొందరు యాజమాన్యం తీరుపై మండిపడుతున్నారు. ఇదిలా ఉండగా గతంలో కూడా ఈ పాఠశాలలో పిల్లలు ఫీజులు చెల్లించలేదని ఆరుబయట నిలబెట్టి వెనక్కు పంపిన పరిస్థితి కూడా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఓ స్వచ్ఛంద సంస్థ పేరుతో పాఠశాల నడుపుతూ నిర్లక్ష్యంగా పిల్లలను హింసిస్తున్న ప్రయివేటు యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు, విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

# ఒకే దఫాలో రైతులకు పరిహారం చెల్లింపు

- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** పారిశ్రామిక వాడకు భూములను ఇచ్చేందుకు సమ్మతించిన రైతులకు ఒకే దఫాలో నష్ట పరిహారాన్ని అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో పారిశ్రామిక వాడ ఏర్పాటు కోసం అసైన్డ్ భూములకు సంబంధించిన దుద్యాల్ మండలం లగచర్ల గ్రామ రైతులతో కలెక్టర్ ప్రతీక్ జైన్ చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ... పారిశ్రామిక వాడకు భూములను ఇచ్చేందుకు సమ్మతించిన రైతులకు చెక్కుల రూపంలో నష్టపరిహారంతో పాటు అప్రూవ్ లేఅవుట్ ప్రకారం ఇంటి స్థలాలను కేటాయించడం జరుగుతుందన్నారు. భూసేకరణలో ఏవైనా అభ్యంతరాలు, రైతుల సూచనలు తదితర అంశాలపై జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ సమావేశంలో కూలంకుశంగా చర్చించడం జరిగింది. లగచెర్ల గ్రామంలోని సర్వే నెంబర్ 102 లో 36 మంది రైతులకు సంబంధించిన 58 ఎకరాల భూమి ఉందని దీనిపై రైతులతో చర్చ నిర్వహించి రైతుల సమ్మతాన్ని పొందినట్లు కలెక్టర్ తెలిపారు. ఇట్టి సర్వే నెంబర్ భూమిలో 5 మంది రైతులు మరణించగా వారి వారసులుగా సోమవారంలోగా సమ్మతి పత్రాలను అందజేయాలని కలెక్టర్ సూచించారు. ఎకరానికి 20 లక్షలు, ఎకరానికి 150 గజాల ఇంటి స్థలములో ఇందిరమ్మ ఇల్లు, అర్హతల మేరకు ఇంటికి ఒక ఉద్యోగం కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారుకలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లింగ్యా నాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, టిజిఐఐసి జోనల్ మేనేజర్ ఓ.వి.టీ. శారద, అసిస్టెంట్ జోనల్ మేనేజర్ అజీమ సుల్తానా, దుద్యాల తహసిల్దార్ కిషన్, లగచెర్ల రైతులు పాల్గొన్నారు.

# ఉదండాపూర్ పరిహారంలో పంపిణీలో భారీ అక్రమాలు

- అక్రమార్కుల ఖాతాల్లోకి మళ్లిన కోట్ల రుపాయలు
- బీఆర్ఎస్ నేతలు సర్వే ఎందుకు వద్దంటున్నారు
- స్వార్థంతోనే సర్వే ను అడ్డుకుంటున్న బీఆర్ఎస్ నేతలు
- ప్రాజెక్టు పనులను అడ్డుకుంటే సహించేది లేదు : ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**మహబుబ్ నగర్ (జనంసాక్షి)**

ఉదండాపూర్ రిజ్వాయర్ లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు భూ పరిహారం చెల్లింపులోనూ, పునరావాసం ప్యాకేజీ ఇవ్వడంలోనూ జరిగిన అక్రమాలపై అధికారులు మరోసారి పునర్విచారణ జరిపించాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి డిమాండ్ చేసారు. బీఆర్ఎస్ నేతలు తాము చేసిన అక్రమాలు బయటపడతాయన్న భయంతోనే ఉదండా పూర్ లో సర్వే జరగకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. తమ స్వలాభం కోసం ప్రాజెక్టు పనులను అడ్డుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. ఉదండాపూర్ కు చెందిన పలువురు నిర్వాసితులు గురువారం ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డిని కలిసి భూ పరిహారం పంపిణీలో జరిగిన అక్రమాలపై ఫిర్యాదు చేసారు. ఈ విషయంగా అధికారులు కలిసి ఎన్నిసార్లు మొరపెట్టుకున్న ప్రయోజనం లేదని వారు ఆవేదన వ్యక్తం చేసారు. నిర్వాసితులు ఈ అక్రమాలకు సంబంధించిన పలు ఆధారాలను కూడా చూపించడంతో ఈ విషయంగా అనిరుధ్ రెడ్డి స్పందించారు. ఉదండాపూర్ రిజర్వాయర్ లో ముంపునకు గురయ్యే భూములకు పరిహారం చెల్లించడంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని చెప్పారు. భూమి ఒకరిది అయితే దానికి సంబంధించిన పరిహారం ఇంకొకరి ఖాతాల్లోకి జమ చేసారని ఈ కారణంగా నిజమైన బాధితులు పరిహారం కోసం ఇప్పటికీ అధికారుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ధరణిలో పేర్లు, పట్టా పాసుపుస్తకాలు ఒకరి పేరిట ఉంటే దానికి సంబంధించిన పరిహారాలు ఇంకొకరి పేరిట జమ చేసారన్నారు. భూమి ఒకరిదైతే పరిహారాలు ఇంకొకరి చెల్లించిన సంఘటనలు అనేకం జరిగాయని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ గైరాన్ భూములను కూడా పట్టా భూములుగా చూపించి పరిహారాలు దండుకున్నారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు ఈ విధంగా కోట్లాదిరుపాయల ప్రభుత్వ సొమ్మును దిగమింగారని ఆరోపించారు. గైరాన్ భూములకు చెందిన పరిహారాలు బీఆర్ఎస్ నేతల ఖాతాల్లోకి జమ చేసారని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులతో పాటుగా అప్పట్లో ఉన్న ఎమ్మార్వో, ఆర్ఐ కూడా అక్రమార్కులకు సహకరించి ప్రభుత్వ సొమ్మును దోచిపెట్టారని అనిరుధ్ రెడ్డి దుయ్యబట్టారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి సంబంధించి తాండాలు, వల్లూరు గ్రామాల్లో సర్వే పూర్తి కాగా ప్రస్తుతం ఉదండాపూర్ లో ఈ సర్వే జరగకుండా బీఆర్ఎస్ నాయకులు అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఉదండా పూర్ లో బినామీ వ్యక్తుల పేర్లు చేర్చి ప్రభుత్వ సొమ్మును కొల్లగొట్టాలని బీఆర్ఎస్ నాయకులు చేసిన కుట్రలు బయటపడతాయనే ఉద్దేశ్యంతోనే విచారణ జరగకుండా అడ్డుకుంటున్నారని అనిరుధ్ రెడ్డి ఆరోపించారు. ఉదండాపూర్ పరిహారం పంపిణీలో జరిగిన అక్రమాలను గురించి తాను అసెంబ్లీ లో కూడా లేవనెత్తుతానని వెల్లడించారు. పునరావాసం ప్యాకేజీకి సంబంధించి పరిహారం పెంపు కోసం తాను కృషి చేస్తున్నానని చెప్పారు. అయితే బీఆర్ఎస్ నేతలు ఈ విషయాన్ని కప్పిపుచ్చి ప్రాజెక్టు పనులను అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఉదండాపూర్ భూ పరిహారం పంపిణీలోజరిగిన అక్రమాలపై తక్షణం పుర్విచారణ చేయాలని డిమాండ్ చేసారు. ఈ అక్రమాలకు ఊతమిచ్చిన అప్పటి ఎమ్మార్వో, ఆర్ఐల పాత్రపై కూడా విచారణ చేయాలని కోరారు. ఈ అక్రమాలకు పాల్పడింది ఎంతటి వారైనా వారిపై చర్యలు తీసుకోవాలని, నిజమైన బాధితులకు న్యాయం చేయాలని అనిరుధ్ రెడ్డి అధికారులను కోరారు.

# అంకురా హాస్పిటల్లో ఎపిలెప్సీ స్పెక్ట్రమ్ అధునాతన చికిత్సా


అంకురా హాస్పిటల్ ఫర్ ఉమెన్, చిల్డ్రన్ కన్సల్టెంట్ పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్ డాక్టర్ రమ్య బండి

**ఖైరతాబాద్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి)**

మూర్ఛ అనేది అసాధారణ మెదడు కార్యకలాపాల కార ణంగా పునరావృతమయ్యే మూర్ఛలతో కూడిన నాడీ సంబంధిత రుగ్మత అని అంకురా హాస్పిటల్ ఫర్ ఉమెన్, చిల్డ్రన్ కన్సల్టెంట్ పీడియాట్రిక్ న్యూ రాలజిస్ట్ డాక్టర్ రమ్య బండి అన్నారు. ఆమె మాట్లాడుతూ ఈ మూర్ఛలు అవగాహన, కండరాల నియంత్రణ, భావోద్వేగాలు, ప్రవర్తన ను ప్రభావితం చేస్తాయ న్నారు. భారతదేశంలో, దాదాపు 12 మిలియన్ల మంది ప్రజలు(జనాభాలో 1శాతం) మూర్ఛ వ్యాధితో జీవిస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అధిక ప్రాబల్యం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా, 50 మిలియన్ల మంది ప్రజలు ప్రభావితమయ్యా రు. 60 శాతం మంది వ్యక్తులకు, కారణం తెలియ దు మరియు 30 శాతం మంది రోగులు మందుల కు ప్రతిస్పందించరని, అదనంగా మూర్ఛతో బాధప డుతున్న వ్యక్తులు నిరాశ, ఆందోళనతో సహా మాన సిక ఆరోగ్య సమస్యలను ముంచుకొచ్చే లేదా అనుభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న మహిళలు, పిల్ల ల కోసం అంకురా హాస్పిటల్ ప్రత్యేక సంరక్షణను అందిస్తుందన్నారు. స్త్రీలకు, ముఖ్యంగా గర్భధారణ సమయంలో, మూర్ఛలు, మూర్ఛ నిరోధక మందు లు తల్లి, పిండం ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి కాబట్టి మూర్ఛను నిర్వహించడం చాలా ముఖ్యం అన్నారు. ఆసుపత్రి యొక్క మల్టీడిసిప్లినరీ బృం దం పరిస్థితిని పర్యవేక్షించడానికి, నిర్వహించడా నికి దగ్గరగా పనిచేస్తుందన్నారు. తల్లి, బిడ్డ ఇద్దరికీ సరైన ఆరోగ్య ఫలితాలను నిర్ధారిస్తుందన్నారు.

# మాది ఫాంహౌజ్ ప్రభుత్వం కాదు

**దమ్ముంటే రాజీనామా చేయండి..**

**కెసిఆర్ కేటీఆర్ కు ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి సవాల్**

**పెబ్బేరు ఫిబ్రవరి 13 (జనం సాక్షి)**



గత బిఆర్ ఎస్ ప్రభుత్వం ఫామ్ హౌస్ పాలన కాదని మాది ప్రజా ప్రభుత్వమని ప్రజలు తెలుసుకున్నారని వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి అన్నారు. గురువారం పెబ్బేరు శ్రీరంగాపూర్ మండలంలోని పలు గ్రామాలలో 10 కోట్లతో చేపట్టిన ఎస్సీ ఎస్టీ కాలనీలో సీసీ డ్రైనేజీ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా కొత్త సూగూర్ గ్రామంలో ఎమ్మెల్యే మెగా రెడ్డి విలేకరులతో మాట్లాడారు. గత సిఎం కేసీఆర్ పదేళ్ల ఫామ్ హౌస్ పాలన సాగించారని ప్రస్తుత సిఎం రేవంత్ రెడ్డి 14 నెలల నుండి ఒక్కరోజు సెలవు లేకుండా అభివృద్ధి పనుల్లో బిజీగా ఉన్నారని గుర్తు చేశారు. మొన్న పని పాట లేని కేటీఆర్ కొడంగల్ లో ధర్నా నిర్వహించి ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేశారని విమర్శించారు. కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావులు, తిన్నది అరగక ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని టిఆర్ఎస్ కీలక నేతలు ముగ్గురికి వనపర్తి నుండి సవాల్ విసిరుతున్నానని, తెలిపారు . తక్షణమే వారి పదవులకు రాజీనామా చేసి మళ్లీ ఎలక్షన్లలో గెలిచి చూపియాలన్నారు. వనపర్తి లో ఒక బిల్డింగు హైదరాబాదులో సెక్రటేరియట్ కట్టి అదే అభివృద్ధి అని భ్రమలో ఉన్నారని మెగా రెడ్డి ఘాటుగా విమర్శించారు. మాది ఇందిరమ్మ రాజ్యంలో గల్లి నుండి ఢిల్లీ దాకా అభివృద్ధి చేస్తామన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ఇందిరామరాజ్యంలో చేసి చూపిస్తున్నామన్నారు. రైతు భరోసా మూడు ఎకరాల వరకు ఖాతాలో జమ చేశామని మిగతా వారికి కూడా తొందరలోనే ఖాతాలో జమ చేస్తామన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇలా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుంది అన్నారు. పెబ్బేరు శ్రీరంగాపూర్ మండలాల్లో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు 10 కోట్లు, ఎస్ డి ఎఫ్ నిధులు 5 కోట్లతో, సీసీ రోడ్లు, డ్రైనేజీ, బీటీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపనలో పూజా కార్యక్రమాలు చేశామన్నారు. వనపర్తి నియోజకవర్గంలో 100 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి, చెక్కులు పెబ్బేరు శ్రీరంగాపూర్ మండలాలకు సంబంధించిన దాదాపు 200 మంది లబ్ధిదారులకు వారి గ్రామాల దగ్గరే చెక్కులు అందజేస్తున్నాం అన్నారు. కార్యక్రమంలో వనపర్తి, పెబ్బేరు మార్కెట్ చైర్మన్లు శ్రీనివాస్ గౌడ్, గౌని ప్రమోదిని రెడ్డి, వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటసాగర్, తదితరులు పాల్గొన్నారు.

# ఏడుపాయల జాతర నిర్వహణ పక్కా ప్రణాళికతో జరగాలి

**అధికారులతో సమీక్షలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 13 (జనం సాక్షి ):**



ఏడుపాయల జాతరలో పార్కింగ్ నిర్వహణ పక్కా ప్రణాళికతో జరగాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు ఏడుపాయల వనదుర్గ అమ్మవారి జాతర పార్కింగ్ ప్రణాళికపై సంబంధిత అదనపు కలెక్టర్ నగేష్, దేవాదాయ, పోలీస్, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సమీక్షించారు. ఈ సందర్భంగా జాతరలో పార్కింగ్ ఏర్పాట్ల ప్రణాళికపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా జాతర నిర్వహణ ట్రాఫిక్ అంతరాయం కలగకుండా మూడు రోజులు పార్కింగ్ నిర్వహణ పకడ్బందీగా జాతర చర్యలు చేపడుతున్నామన్నారు. జాతరలో సింగల్ యూస్ ప్లాస్టిక్ నిషేధాన్ని పగడ్బందీగా అమలు చేయడానికి గ్రామపంచాయతీ ద్వారా. చర్యలు తీసుకుంటున్నామన్నారు . క్షేత్రస్థాయిలో ఏడుపాయల జాతర నిర్వహణ ప్రదేశాలను అధికారులు పరిశీలించుకుని లోటు పాట్లను సవరించుకొని , పగడ్బందీగా జాతర నిర్వహించాలన్నారు. అనంతరం వనదుర్గ అమ్మవారి జాతర నిర్వహణ వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిపిఓ యాదయ్య, డీఎస్పీ ప్రసన్నకుమార్, ఏడుపాయల టెంపుల్ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి, సంబంధిత పోలీస్, దేవాదాయ , పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతితో విధులలో మరింత బాధ్యత

**జిల్లా ఎస్పీ టి .శ్రీనివాస రావు.**

**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 13 (జనంసాక్షి)**



పోలీస్ సిబ్బందికి పదోన్నతి ఉత్సాహం తో పాటు విధులలో మరింత బాధ్యత పెంచుతుందని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా 1999 బ్యాచ్ కు చెందిన ముగ్గురు కానిస్టేబుల్స్ అధికారులు ఏ .రేఖ రెడ్డి, మస్తాన్ , యాకూబ్ హుస్సేన్ లు హెడ్ కానిస్టేబుల్స్ గా పదోన్నతి పొందిన సంధర్భంగా వారు గురువారం జిల్లా ఎస్పీ టి . శ్రీనివాస రావు ని ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారికీ శుభాకాంక్షలు తెలియజేసి మాట్లాడుతూ పోలీస్ శాఖలో పదోన్నతి ఉత్సాహంతో పాటు వారి విధులలో మరింత బాధ్యతను పెంచుతుందని అన్నారు. విధి నిర్వహణలో తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, కష్టపడి, బాధ్యత తో పని చేసి ప్రజల మన్ననలు పొందితే పోలీస్ శాఖలో ఎప్పటికైనా మంచి గుర్తింపు లభిస్తుందని ఎస్పీ అన్నారు.

## పేద విద్యార్థికి మణికొండ రెడ్డి ఫౌండేషన్ చేయూత

**రాజేంద్రనగర్,ఫిబ్రవరి13 (జనంసాక్షి)**



నిరుపేద రెడ్డి లను ఆదుకునేందుకు తమ వంతు కృషి గా రెడ్డి లు ఆర్థిక చేయూతనివ్వాలని రెడ్డి ఫౌండేషన్ సభ్యులు పిలుపునిచ్చారు. గురువారం యూనిసెంట్ స్కూల్ లో పదవ తరగతి చదువుతున్న సిరిపూర్ణి కి ఆర్థికంగా ఇబ్బంది ఫీజు కట్టుకోలేని పరిస్థితిలో మణికొండ రెడ్డి ఫౌండేషన్ ను సంప్రదించగా కొంత మంది సభ్యులు ముందుకు వచ్చి రూ.25వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమం లో ఫౌండేషన్ సభ్యులు సుభాష్ చంద్ర రెడ్డి , బొమ్ము ఉపేంద్రనాధ్ రెడ్డి , రామసుబ్బా రెడ్డి ,శరత్ రెడ్డి , శ్రీపతి రెడ్డి, రాధా ,సైది రెడ్డి , రాజా రెడ్డి ,శ్రీనివాసులు రెడ్డి , సుధాకర్ రెడ్డి, బొద్దు శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# చికెన్ ప్రియులను హడలెత్తిస్తున్న బర్డ్ ఫ్లూ

**ఆందోళనలో కోళ్ళ పెంపకందారులు**

**పరేషాన్ లో చికెన్ వ్యాపారులు**

**వనపర్తి,ఫిబ్రవరి13 (జనంసాక్షి)**



సామాన్యులు మొదలు సంపన్నులు సైతం చికెన్ వంటకాలను లొట్టలేసుకుంటూ తినడం పరిపాటి. పావు కిలో మటన్ ధర కంటే తక్కువకే ఒక కేజీ చికెన్ లభిస్తున్నందున అందరికీ అందుబాటులో ఫారం కోడికూర ఉండేది. సండే వచ్చిందంటే చాలు చికెన్ ప్రియులకు ఇంట్లో చికెన్ ఉండాల్సిందే. కొందరైతే ప్రతిరోజు తినడానికి కూడా వెనకాడరు. చికెన్ తో వెరైటీ రెసిపీలు చేసుకుని లాగించేస్తుంటారు. అయితే కొద్ది రోజుల క్రితం వరకు కొండెక్కిన చికెన్ ధరలు నేల చూపు చూస్తున్నాయి. ఉన్నట్టుండి ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. చికెన్ కిలో రూ. 50 కే వచ్చేస్తోంది. ఇది తెలిసిన చికెన్ లవర్స్ ఎగిరి గంతులేస్తున్నారు. అయితే చికెన్ ధరలు పడిపోవడానికి గల కారణం ఏంటంటే బర్డ్ ఫ్లూ ప్రభావం. కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకడంతో డిమాండ్ పూర్తిగా పడిపోయింది.

**ధర తగ్గినా కొనడానికి భయం**

కొన్ని చోట్ల బర్డ్ ఫ్లూ సోకి కోళ్ళు మృత్యు బారిన పడుతుండడంతో, మిగతా ప్రాంతాల ఫారం యజమానులు వాటిని రేట్లు వచ్చిన కాడికి అమ్ముకుంటున్నారు. అయినా కూడా చికెన్ కొనడానికి, తినడానికి ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొన్నది. బర్డ్ ఫ్లూ ప్రభావంతో పౌల్ట్రీ యజమానులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందంటున్నారు పలువురు. కొనుగోళ్లు తగ్గడంతో చికెన్ వ్యాపారులు లబోదిబోమంటున్నారు. కాగా ఆంధ్రప్రదేశ్ లో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. చనిపోయిన కోళ్ల శాంపిల్స్ ను ల్యాబ్ లకు పంపిచగా బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయ్యిందని పశుసంవర్ధక శాఖ అధికారులు వెల్లడించారు. బర్డ్‌ఫ్లూ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు కొన్ని రోజుల పాటు చికెన్ తినడం తగ్గించడం, లేదా మానేయడం మంచిదని అధికారులు సూచిస్తున్నారు. దీంతో తెలంగాణలో కూడా అధికారులు అలర్ట్ అయ్యారు.

**కొనుగోళ్ళు లేక నష్ట పోతున్నాం**

**రఘువర్ధన్ బాలాజీ పౌల్ట్రీ ఫామ్స్ యజమాని**

బర్డ్ ఫ్లూ పుకార్లతో కోళ్ళ కొనుగోళ్ళు నిలిచిపోయాయి. వేసవి రాకముందే ఎండలు మండుతున్నందున బ్రాయిలర్ కోళ్ళు బరువు తగ్గుతున్నాయి .లాభాలు రాకున్నా సరే ఎలాగోలా కోళ్ళను అమ్ముకొని సొమ్ము చేసుకుందామంటే బర్డ్ ఫ్లూ భయంతో హోల్ సేల్, రిటైల్ వ్యాపారస్థులు కొనడం లేదు. దీంతో దాణా పెట్టుబడి పెరిగిపోతున్నది .అసలు తెలంగాణలో ఫారం కోళ్ళు ఎకకడా చనిపోలేదు. ఏపీలో బర్డ్ ఫ్లూ ఆనవాళ్ళు ఉన్నందున ఇక్కడ ముందు జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ అధికారులు సూచించారు. అంతేగాకుండా చికెన్, గుడ్లు వండుకొని తింటారు, కాబట్టి వైరస్ ప్రభావం ఉండదని,చికెన్ తినడంపై అనుమాన పడొద్దని పశు సంవర్ధక శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ప్రజల్లో అవగాహన కల్పించి ఫారం కోళ్ళ రంగాన్ని ఆదుకోవాలి.

# డంపు యార్డు నిలిపివేసేందుకు పోరాడుదాం

**కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి నిరోధకులుగా మారకండి**

**ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి**

**నర్సాపూర్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి)**



నర్సాపూర్ ప్రాంత అభివృద్ధికి ఆటంకం కలిగిస్తూ అభివృద్ధి నిరోధకులుగా మారకూడదని కాంగ్రెస్ నాయకులకు సూచిస్తూ అదేవిధంగా నర్సాపూర్ పట్టణానికి మంజూరైన టూరిజం హోటల్ అర్బన్ పార్క్ కాటేజెస్ పలు అభివృద్ధి పనులు నిలిపి వేయకుండా అందరం కలిసికట్టుగా ప్రాంత అభివృద్ధికి పార్టీలకతీతంగా సహకరించాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు, గురువారం నర్సాపూర్ పట్టణంలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నర్సాపూర్ అటవీ ప్రాంతంలో నిర్మిస్తున్న దంపు యార్డు కు టిఆర్ఎస్ ప్రభుత్వమే అనుమతులు ఇచ్చింది అనడంలో ఎలాంటి వాస్తవం లేదన్నారు,నర్సాపూర్ పట్టణానికి మంజూరైన టూరిజం హోటల్ అర్బన్ పార్క్ కాటేజెస్ పలు అభివృద్ధి పనులు నిలిపి వేయకుండా అందరం కలిసికట్టుగా నియోజకవర్గ అభివృద్ధికి పార్టీలకతీతంగా సహకరించాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కోరారు. 2008 -09 లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే ఈ ప్రాంతాన్ని కి డంపు యార్డ్ కు భూమిని కేటాయించినట్లు ఆమె తెలిపారు. ఈ డంపు యార్డ్ తో నర్సాపూర్ నియోజకవర్గానికి శాపంగా మారుతుందని పచ్చని అడవిలో చిచ్చు పెట్టినట్లు అవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా విమర్శలు మాని పార్టీలకతీతంగా అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. డంపు యార్డు రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర మంత్రులను కలసి విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నయీముద్దీన్, సత్యం గౌడ్, నడిపి లావణ్య, రవి, జితేందర్ రెడ్డి, మానయ్య, శ్రీనివాస్ రెడ్డి, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# ఐటీ టవర్ సాధించింది నిరంజన్ రెడ్డి

**2023 సెప్టెంబర్ 29న కేటీఆర్ చే శంకుస్థాపన**

**వనపర్తి,ఫిబ్రవరి13 (జనంసాక్షి)**

వనపర్తి జిల్లా కేంద్రంలో 250మంది ఐ.టి నిపుణుల శిక్షణలో ఎంతో మంది యువతను నైపుణ్యం కలిగిన మేధావులుగా తయారు చేయడానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఐటీ టవర్ ను మంజూరీ చేయించారని బీఆర్ఎస్ మీడియాసెల్ జిల్లా కన్వీనర్ నందిమల్ల అశోక్ వెల్లడించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాగవరం శివారు సర్వే నం 167 లో 200 ఎకరాల భూమిని కేటాయించారని, 22కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించే ఐటీ టవర్ కు అప్పటి మంత్రి కేటీఆర్ చే 2023 సెప్టెంబర్ 29 న శంకుస్థాపన చేయించిన సంగతి ప్రజలందరికీ తెలుసని గుర్తు చేశారు. ఆ విషయాన్ని మర్చిపోయి కాంగ్రెస్ కు చెందిన ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి ,ఎం.ఎల్.ఏ మేఘారెడ్డి కొత్తగా మేము ఐ.టి టవర్ మంజూరు చేయించినామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని, వారి ప్రకటనలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఐ.టి.మాజీ మంత్రి ప్రయోజనాల కోసం ఐ.టి టవర్ మంజూరు చేశారని నానా యాగీ చేసిన ఏం.ఎల్.ఏ , శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయించారని అన్నారు. నాకృషి వల్లనే ఐ.టి టవర్ వచ్చిందని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ నాయకుల తీరును చూస్తే మంది పనులకు మంగళ హారతులు పట్టినట్లుందని దుయ్యబట్టారు. పట్టణ నడిబొడ్డులో ఉన్న పాలిటెక్నిక్ మరమ్మతులు, పాలిటెక్నిక్ హాస్టల్ నిర్మాణాల కోసం మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మంజూరు చేయించిన నిధులు తీసుకొచ్చి, ఆయా పనులు పూర్తి చేయిస్తే సంతోషిస్తామని నందిమల్ల అశోక్ అన్నారు.

# రిటైర్డ్ సింగరేణిల ఘోషను ఆలకించండి



అంతర్జాతీయంగా ఏకైక బొగ్గు ఉత్పత్తి చేస్తున్న కోల్ ఇండియా దేశానికి అవసరమైన 80 శాతం బొగ్గును అందిస్తూ కీలకమైన పాత్ర నిర్వహిస్తున్నది. దేశపు అత్యుత్తమ పరిశ్రమంలో 5 స్థానంగా నిలిచినది ఇంతటి మహోన్నత స్థానానికి కారణమైన ఉద్యోగుల సంరక్షణ సంక్షేమం పట్ల నిరాదరణ వహిస్తున్నది సహజంగా మనిషి / ఇతర ప్రాణులైన ఆ చేతన వ్యవస్థలో ఉన్నప్పుడు ఆదుకోవడం ప్రకృతి ధర్మం శక్తినంత ధారపోసి దేశానికి వెన్నుదన్నుగా నిలిచి యువజీవితాన్ని దేశాభివృద్ధికి కావలసిన ఇంధనం విద్యుత్ శక్తి అందించిన రిటైర్డ్ ఉద్యోగుల ఆలనా పాలన చూడ వలసిన కనీస గురుతర బాధ్యతను విస్మరిస్తున్నారు ఫలితంగా వృద్ధాప్య అనారోగ్యాలతో కనీస వైద్య సౌకర్యాలు అందుబాటులో లేక చాలీచాలని పెన్షన్ తో అన్నమో రామచంద్రా! అర్ధాకలితో అధికమంది రిటైర్డ్ ఉద్యోగులు అలమటిస్తున్నారు. కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ సంబంధించిన, బొగ్గుమంత్రిత్వ శాఖలో ఏదైనా సమావేశం జరిగిన గంపెడ ఆశతో పెన్షన్ పెంపొందించుటకు నిర్ణయం జరుగుతుందని ఎదురుచూస్తున్న ఎప్పటికప్పుడు నిరాశే మిగులుతున్నది చాలామంది ఎదురుచూస్తూ కాల గమనంలో కలిసిపోతున్నారు కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ 2025 లో బొగ్గు ఉద్యోగులకు ఆనవాయితీ ప్రకారం మసిపూసినారు మసితో జీవనయానం గావించి పేరుకపోతున్న మసితోనే కాలగర్భంలో కలిసిపోతున్నారు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి బొగ్గు పరిశ్రమలో విప్లమాతకమైన మార్పులు తీసుకు వస్తున్నందుకు ఉపరాష్ట్రపతి ఆయనపై ప్రశంసల వర్షం కురిపించినారు సింగిల్ విండో ద్వారా అన్ని అంశములను నిర్వహించుటకు ప్రక్రియను ప్రారంభించినారు

**బొగ్గు పరిశ్రమలో డిజిటలేషన్ ప్రవేశపెట్టి అది అంత్యం**

మైనింగ్ ప్రక్రియల నిర్వహణకు కృషి చేస్తున్నారు ఇంతటి అత్యాధునిక సాంకేతికతతో విప్లవాత్మకమైన మార్పులు చేపడుతున్న తరుణంలో రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమం గురించి ఆలోచించకపోవడం విస్మయాన్ని కలిగిస్తున్నది.

రాష్ట్రపతి ప్రధానమంత్రి బొగ్గు గనుల శాఖ మంత్రి బొగ్గు కార్యదర్శి అదనపు కార్యదర్శి పలువురు పార్లమెంట్ సభ్యులకు ఇతర ప్రజాప్రతినిధులకు ప్రావిడెంట్ ఫండ్ ధర్మకర్తల మండలి సభ్యులకు కార్మిక సంఘాల నాయకులకు మొరపెట్టుకున్న మా భగీరథ ఘోషను ఆలకించడం లేదు దేశంలోని అవసరాలకు 80 శాతం బొగ్గును అందిస్తున్న పరిశ్రమలలో 5 స్థానంగా ఉన్న గొప్ప సంస్థ యొక్క రిటైర్డ్ ఉద్యోగులు నిరాదరణకు గురవుతున్నారు భారత బొగ్గు సంస్థ స్వర్ణ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేకంగా నిధులను కేటాయించి మసి పేరుకుపోయిన రిటైర్డ్ ఉద్యోగుల జీవితాలలో వెలుగు ప్రసాదిస్తారని మరొకసారి వేడుకుంటున్నాము.

**దండంరాజు రాంచందర్ రావు, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, కాప్రా, హైదరాబాద్**

# రామానుజన్ గణిత ఒలింపియాడ్‌లో పారమిత విద్యార్థుల ప్రతిభ



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** ఇటీవల శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రామానుజన్ గణిత ఒలింపియాడ్‌లో స్థానిక పద్మనగర్ లోని పారమిత హెరిటేజ్ పాఠశాలకు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి అవార్డులను కైవసం చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు పరీక్షకు హాజరవగా, రెండవ లెవల్‌లో నిర్వహించిన ఒలింపియాడ్‌లో ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి మొదటి, రెండవ, మూడవ, నాల్గవ ర్యాంకులు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ తెలిపారు. రాష్ట్రస్థాయిలో అవార్డులు గెలుపొందిన విద్యార్థులలో 9వ తరగతికి చెందిన సి.హెచ్. వెంకట మోక్షిత్, కె.అగస్త్య, 8వ తరగతికి చెందిన సి.హెచ్. కశ్యప్, రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు, 8వ తరగతికి చెందిన జె.సాయిరిశిత్, 7వ తరగతికి చెందిన బి.సంహిత్, రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు, 9వ తరగతికి చెందిన హార్దిక్ గోయల్, రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు 8వ తరగతికి చెందిన టి.మన్విత్ రావు, రాష్ట్రస్థాయిలో నాలుగు (4) ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి అవార్డులను గెలుపొందిన విద్యార్థులను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేష్, వి.యు.యం. ప్రసాద్, టి.యస్.వి. రమణ, వినోద్ రావు, హన్మంత రావు, ప్రిన్సిపాల్ గోపీకృష్ణ , గైడ్ టీచర్ పవన్ సింగతి, గణిత ఉపాధ్యాయులు, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

# కోడిపందాల స్థావరాలపై పోలీసుల దాడి



**మక్తల్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** కోడిపందాల స్థావరాలపై పోలీసుల దాడి చేసిన సంఘటన మక్తల్ మండలంలోని చిట్యాల గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మక్తల్ మండలంలోని చిట్యాల గ్రామ శివారులో కోడి పందాలు ఆడుతున్నారన్న పక్క సమాచారంతో దాడి చేయగా అక్కడ కొంతమంది కోడి పందాలు ఆడుతున్నట్లు గుర్తించగా అందులో కొంత మంది మక్తల్ పోలీసులను చూసి పారిపోగా ఇద్దరు వ్యక్తులని పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి 6 బైక్ లను, 4 కోడిపుంజులను, ఒక సెల్ ఫోన్, 9000/- రూ.ల నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వారిపై గేమింగ్ యాక్ట్ చేసిన నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

# అల్ఫోర్స్ నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించండి

- శాతవాహన వర్సిటీ వాకర్స్ ను ఓటు అభ్యర్థించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి కి ఓటు వేసి గెలిపించాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కోరారు. స్థానిక నాయకులతో కలిసి ఉదయం శాతవాహన యూనివర్సిటీ లో వాకర్స్ ను ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి విజన్ ఉన్న నేత అని ఉద్యోగాల కల్పన విషయంలో గాని ఉద్యోగస్తుల సమస్యల పరిష్కారం కోసం గాని ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించే నాయకుడని అన్నారు. ఇప్పటికే ఒక్క సంవత్సరంలో యాభై ఆరు వేల ఉద్యోగాలు భర్తీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి ఓటు వేయాల్సిందిగా ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో అస్తపురం రమేష్, మల్లికార్జున్, అస్తపురం తిరుమల, ఊరడి లత, రజితా రెడ్డి, జ్యోతి రెడ్డి, మహాలక్ష్మి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, రెడ్డి,జక్కుల, మల్లేశం, సుదర్శన్, నర్సింగం, శ్యాం సుందర్, మ్యాకల నర్సయ్య, అంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వేయర్‌పై దాడి

**పాపన్నపేట, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** భూమిని సర్వే చేసి తిరిగి వస్తున్న సర్వేయర్ పై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది.ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.మండలంలో సర్వేయర్ గా విధులు నిర్వహిస్తున్న హహెూబిలం శ్రీనివాస్ ఇదే మండలం యూసుఫ్ పేట గ్రామానికి చెందిన తీగల మల్లేశం అనే వ్యక్తి భూమిని సర్వే చేయడానికి బుధవారం యూసుఫ్ పేట గ్రామానికి వెళ్ళాడు.సర్వేచేసి తిరిగి వస్తుండగా గ్రామ బస్టాండ్ సమీపంలో అదే గ్రామానికి చెందిన ఎరుపుల శ్రీనివాస్,ఎరుపుల గంగయ్య అనే ఇద్దరు వ్యక్తులు సర్వేయర్ ద్విచక్ర వాహనంను ఆపి దుర్భాషలాడారు.చేతులతో,శిరాస్త్రాణం తో ముఖంపై కొట్టారు.సర్వేయర్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.


## పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి



**నర్సాపూర్, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ అన్నారు, గురువారం నర్సాపూర్ లో బిజెపి పార్టీ తరపున పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో నిలిచిన అంజిరెడ్డి ఎన్నికల కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో నిలిచిన అంజిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పార్టీ నాయకులను కోరారు ఇందుకోసం బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రతి ఒక్కరు ఆయన గెలుపు కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఓబిసి రాష్ట్ర కన్వీనర్ పెద్ద రమేష్ గౌడ్ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్న రమేష్ గౌడ్ నాయకులు బాలరాజ్ గుండం శంకర్ రాజు సంతోష్ మహేందర్ గౌడ్ గోపి సాయి తదితరులు ఉన్నారు.

# ఘనంగా లోకపల్లి తిమ్మప్ప రథోత్సవం





- హోరెత్తిన భక్తులు

**నారాయణపేట జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** భక్తుల కొంగు బంగారం నారాయణపేట మండలం కర్ణాటక సరిహద్దులో వెలసిన లోక పల్లి తిమ్మప్ప(బాలాజీ వేంకటేశ్వర) జాతర ఉత్సవాల సందర్భంగా బుధవారం పౌర్ణమి రోజు అర్ధరాత్రి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ నిర్వహించి అభిషేకం చేసి పుష్పాలతో విశేషంగా అలంకరించారు.గురువారం జాతరకు భక్తులు పోటెత్తారు.భక్తులు దాసాంగాలతో నైవేద్యం వండి స్వామి వారికి సమర్పించారు.అంగజాతర ఉత్సవా లకు ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.భక్తులు స్వామి వారికి నైవేద్యం,తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.ఈ సందర్భంగా రెట్టపట్ల పోటీలు నిర్వహించారు.జాతర ఉత్సవాలకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.ఆర్టీసి ప్రత్యేక బస్సులు నడిపారు.

# అమర జవాన్లకు జానపదంతో అశ్రునివాళి

- పుల్వామ దాడికి నేటితో ఆరేండ్లు
- ఆలోచింపజేసిన 17వ బెటాలియన్ ఆర్ఎస్సై మనోహర్‌రెడ్డి పాట
- విదేశాల్లో ఉన్న ప్రతి భారతీయుడిని కదిలిస్తుంది
- తోట దీపక్ రాజ్




**హైదరాబాద్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** 'తృణమా.. రుణమా..' అంటూ ఓ పాట దేశభక్తిని ఉప్పొంగిస్తోంది. రణమా రణమా నీ జ్ఞాపకాలతో నిత్యం రణమా అనే లిరిక్స్ నరనరాన్ని ఉత్తేజపరుస్తున్నాయి. పుల్వామా దాడిలో అమరులైన 40 మంది వీర జవాన్లకు నివాళిగా రూపొందుకున్న ఈ పాట యూట్యూబ్‌లో ఆలోచింపజేస్తోంది. ఓ పోలీసు అధికారే స్వయంగా పాట రాసి, దీనిని తానే పాడటం ప్రత్యేకంగా నిలుస్తోంది. 17వ బెటాలియన్ ఆర్ఎస్సై మనోహర్‌రెడ్డి రాసిన ఈ పాటకు ఆయనే సింగర్‌గా వ్యవహరించారు. దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలేసేవారి కోసం, వారి కుటుంబ సభ్యుల ఆవేదనలు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ పాటకు ప్రాణం పోశారు. మనోహర్ పటేల్ మ్యూజిక్, ఎడిటింగ్ చేయగా.. తేజారెడ్డి ప్రొడ్యూసర్‌గా వహించారు. చిన్నికృష్ణ కీస్ అందించారు. శ్రేయాస్ హిట్స్ సాంగ్స్ యూట్యూబ్ ఛానెల్ అప్‌లోడ్ చేసిన ఈ పాటను మరిపల్లి స్టూడియోస్‌లో రికార్డ్ చేశారు. దుబాయ్ నుంచి ఈ పాట విన్న గల్ఫ్ కార్మికుడు తోట దీపక్ రాజ్ స్పందిస్తూ.. ఈ పాట భారతదేశాన్ని విడిచి బతుకుదెరువు కోసం విదేశాలకు వెళ్లినవారి గుండెల్ని కదిలిస్తోందని 'జనంసాక్షి'తో చెప్పారు. కుటుంబాలను వదిలిపెట్టి దూరంగా బతుకుతున్న వారి ప్రతి ఒక్కరి హృదయాన్ని ఈ పాట తాకుతుందని, ఆర్ధ్రత నిండిన ఈ పాటను పాడిన గాయకుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇలాంటి పాటలు ఎంతోమంది యువతను ఉత్తేజితుల్ని చేస్తుందన్నారు.

# అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ బియ్యం పట్టివేత



**హయత్‌నగర్, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బంజారా కాలనీలో ప్లాట్ నెంబర్ 47 ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ రైస్ గోదాం పైన హయత్నగర్ పోలీసులు దాడి చేసి బియ్యాన్ని పట్టుకున్నామని నాగరాజు గౌడ్ తెలిపారు. ఎండి మోసిన్, సలీం, శ్రీకాంత్ అను వ్యక్తులు ప్రజల వద్ద నుండి పిడిఎస్ బియ్యంను తక్కువ ధరకు 10 రూపాయలకు కొనుగోలు చేసి వాటిని అతను కిరాయికి తీసుకున్న ఇంటిలో ఉంచి, జాహీరాబాద్ లో ఎక్కువ ధరకు అమ్మడానికి సిద్ధంగా ఉంచారు. సుమారు 58 బస్తాల పిడిఎస్ బియ్యం, సుమారు 26 క్వింటాల్, 03 కాంటాలు లను, 03 యాక్టివా బైక్ లను సీజ్ చేసి, వారి పైన కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని నాగరాజ్ గౌడ్ తెలిపారు.

# కేఎల్ఐ మట్టి అక్రమంగా తరలింపు



**ఉర్కొండ, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** ఉర్కొండ మండలంలోని మాదారం గ్రామంలో కేఎల్ఐ మట్టిని గుట్టు చప్పుడు కాకుండా టిప్పర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్న వాహనాలను గ్రామ రైతులు అడ్డుకున్నారు. మిడ్జిల్ మండలంలో ఇలాగే మట్టిని తరలిస్తుండడంతో అక్కడి రైతులు పెద్ద ఎత్తున నిరసన తెలియజేయడంతో మట్టి మాఫియా ఊరుకొండ మండలంలోని మాదారం గ్రామంపై పడింది. మట్టి మాఫియా కు స్థానిక రాజకీయ హస్తముందని తెలుస్తుంది. జెసిబిలతో టిప్పర్లతో మట్టిని తరలిస్తుండడంతో అధికారుల అండదండలు ఉన్నాయని గ్రామస్తులు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# చెరువు శిఖం భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

- చేర్యాల తహసీల్దార్‌కు గొల్ల కురుమల వినతి



**చేర్యాల, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** మండలంలోని కమలాయపల్లి గ్రామానికి చెందిన వగలరాయిని చెరువు శిఖం భూమిని తన సొంతానికి వాడుకుంటూ వ్యవసాయం చేస్తున్న చిట్యాల గ్రామానికి చెందిన వంకాయల కనకయ్య పై చర్యలు తీసుకోవాలని గొల్ల కురుమ సంఘం నాయకులు గొర్రెల కాపర్లు గురువారం చేర్యాల తహసీల్దార్ సమీర్ అహ్మద్ ఖాన్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలంలో సైతం చెరువు నిండకుండా శిఖం భూమిని వాడుకుంటూ అనుభవిస్తున్నాడని అన్నారు. చెరువు శిఖంలో ఉన్న చెట్లను సైతం నరికివేసి వ్యవసాయం చేస్తున్నాడని ఆ చెట్లు ఉండడం వల్ల తాము పెంచుకునే జీవాలకు ఆహారం దొరకకుండా చేస్తున్నాడని అలాంటి కనకయ్యపై చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రంలో కోరారు.

## విద్యా వ్యవస్థను పెంచి నిధులు ఇవ్వాలి

- తెలంగాణ ఉద్యమకారుడు రామలింగం

**మఖ్తల్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న హోంగార్డులకు జీతాలు ఇవ్వరా అని తెలంగాణ ఉద్యమకారుడు రామలింగం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో 16,000 మంది పైగా హోంగార్డులు నిత్యం పని చేస్తా ఉన్నారు. ప్రతి నెల 13 తారీఖు అయినా కూడా జీతాలు చెల్లించడం సిగ్గుచేటని అన్నారు. చిన్న జీతాలపైనే ఆధారపడి జీవిస్తున్న హోంగార్డు ల చేతుల్లో చిల్లి గవ్వలేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యంపై ఉన్న అభిమానం విద్యపై ఎందుకు లేదని అన్నారు. మద్యం రేట్లు పెంచిన ముఖ్యమంత్రి విద్యా వ్యవస్థకు ఎందుకు ఇప్పటివరకు మంత్రిని కేటాయించలేదని అన్నారు. మద్యం ధరలు పెంచడం కాదు విద్యార్థులకు విద్యావ్యవస్థపై సాహిత్తుకమైన బడ్జెట్ కేటాయించి తెలంగాణ ప్రాంతాన్ని విద్యార్థులకు చక్కటి భోజనం ఆహారాన్ని అందించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని అన్నారు. ప్రజలను మభ్యపెడున్న రేవంత్ సర్కార్ ను ప్రజలు బొంద పెట్టే రోజులు దగ్గర్లో ఉన్నాయని హెచ్చరించారు.

## జోగులాంబ ఆలయ ఈఓ అధికారిని తక్షణమే సస్పెండ్ చెయ్యాలి



**గద్వాల నడిగడ్డ , ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** హైద్రాబాద్‌లోని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య కార్యదర్శి ఎమ్, ఎస్,ఎస్. సోమరాజుని కలిసి ఈఓ పురేందర్ పై పిర్యాదు చెయ్యడం జరిగిందనీ ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ అన్నారు. గత కొన్ని సంవత్సరాలనుండి అలంపూర్ జోగులాంబ, జమ్ములమ్మ, పాగుంట ఆలయాలకు ఆలయ అధికారిగా ఉంటూ, అవినీతికి పాల్పడుతూ కోట్ల రూపాయల ఆస్తులు కూడ పెట్టుకొని, అధికార దుర్వినియోగం చేస్తున్నాడనీ,కొన్ని సంవత్సరాలనుండి ఆలయాలలో అడిట్ నిర్వహించడం లేదని, భక్తులు ఆలయాలకు ఇచ్చే కానుకలకు, చెక్కులకు లెక్క పత్రం లేకుండా కజేస్తున్నారనీ, బ్యాంకు అధికారులు కూడ ఆలయ ఈఓ కావడం తో అడ్డు చెప్పకుండా వారికీ సహకరిస్తున్నారని, అలాగే భక్తులకు సరైన మౌలిక సదుపాయలు కల్పించకుండా, ఆలయాలను భ్రష్టు పట్టిస్తున్నారు అని ఆధారాలతో దేవాదాయ మంత్రి ముఖ్య కార్యదర్శి సోమరాజు కి తెలియజేయడం జరిగిందని,సోమ రాజు వెంటనే స్పందించి దేవాదాయ కమిషనర్ గారితో చర వాణి లో మాట్లాడి వెంటనే విచారణ జరిపి నాకు రిపోర్ట్ ఇవ్వాలని కమిషనర్ ని కోరారనీ వెంకటేష్ అన్నారు.

# 536 సెక్షన్లు.. 16 షెడ్యూళ్లు




కొత్త ఆదాయ పన్ను (ఐటీ) బిల్లు 2025ను కేంద్ర ప్రభుత్వం గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెడుతు న్నది. 1961 ఆదాయ పన్ను చట్టంలోని కఠిన నిబంధనలు, పదాలు, వివరణల్ని సరళతరం చేస్తూ ఈ బిల్లును తెస్తున్నామని మోదీ సర్కారు చెప్తున్న విషయం తెలిసిందే. ఇక ఇందులో ఎటువంటి కొత్త పన్నుల విధింపు ఉండబోదంటున్న కేంద్రం.. సంక్లిష్టంగా ఉన్న అసెస్‌మెంట్ ఇయర్ (ఏవై), ప్రీవియస్ ఇయర్ (పీవై) స్థానంలో 'ట్యాక్స్ ఇయర్' కాన్సెప్ట్‌ను పరిచయం చేస్తున్నది.

కొత్త ఆదాయ పన్ను (ఐటీ) బిల్లు 2025ను కేంద్ర ప్రభుత్వం గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెడుతు న్నది. 1961 ఆదాయ పన్ను చట్టంలోని కఠిన నిబంధనలు, పదాలు, వివరణల్ని సరళతరం చేస్తూ ఈ బిల్లును తెస్తున్నామని మోదీ సర్కారు చెప్తున్న విషయం తెలిసిందే. ఇక ఇందులో ఎటువంటి కొత్త పన్నుల విధింపు ఉండబోదంటున్న కేంద్రం.. సంక్లిష్టంగా ఉన్న అసెస్‌మెంట్ ఇయర్ (ఏవై), ప్రీవియస్ ఇయర్ (పీవై) స్థానంలో 'ట్యాక్స్ ఇయర్' కాన్సెప్ట్‌ను పరిచయం చేస్తున్నది.

వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఈ నెల 1న పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రకటిస్తున్నప్పుడే ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో కొత్త ఐటీ బిల్లును తెస్తామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్న సంగతి విదితమే. నిజానికి గత ఏడాది జూలైలో ప్రకటించిన బడ్జెట్‌లోనే ప్రస్తుత ఐటీ చట్టం 1961 సమగ్ర సమీక్షను మంత్రి తెరపైకి తెచ్చారు. అందుకు తగ్గట్టే కొత్త బిల్లును మంత్రి సీతారామన్ తీసుకొస్తున్నారు.

దాదాపు 65 ఏండ్ల కిందటి ఐటీ చట్టాన్ని అందరికీ అర్థమయ్యే రీతిలో సరళీకరిస్తామని చెప్తున్న కేంద్రం.. మునుపటితో పోల్చితే కొత్తదాంట్లో సెక్షన్లు, షెడ్యూళ్లను పెంచడం గమనార్హం. 622 పేజీల్లో 526 సెక్షన్లు, 16 షెడ్యూళ్లతో కొత్త ఐటీ చట్టం రాబోతున్నది మరి. కానీ ఇప్పుడున్నదాంట్లో 880 పేజీల్లో 298 సెక్షన్లు, 14 షెడ్యూళ్లే ఉన్నాయి. చాప్టర్లు మాత్రం ఇప్పుడు, రాబోయేదాంట్లో 23గానే ఉన్నాయి. ఇక స్టాండింగ్ కమిటీ, పార్లమెంట్ ఆమోదం పొందితే వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి కొత్త ఐటీ చట్టం అమల్లోకి రాబోతున్నది. కాగా, ఈ ఐటీ చట్టం సమీక్షపై భాగస్వాముల నుంచి 6,500 సలహాలు, సూచనల్ని కేంద్ర ప్రభుత్వం అందుకున్నది.

622 పేజీల్లో 536 సెక్షన్లు, 23 చాప్టర్లు, 16 షెడ్యూళ్లు.

ప్రస్తుతం ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు అసెస్‌మెం ట్ ఇయర్‌గా ఉండగా.. కొత్త బిల్లులో ట్యాక్స్ ఇయర్‌గా మార్చారు. వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్), ఇతరుల కోసం కొత్త, పాత ఆదాయ పన్ను విధానాలకు వర్తించేలా చట్టం. సరళతరమైన భాష, చిన్నచిన్న వాఖ్య నిర్మాణాలు, అనవసరమైన నిబంధనల తొలగింపు. ప్రస్తుత చట్టంలో చాలాసార్లు కనిపించే 'నాట్‌విత్‌స్టాండింగ్' పదం స్థానంలో 'ఇర్రెస్పెక్టివ్' పదాన్ని చేర్చారు.

సాధారణ పన్ను చెల్లింపుదారులూ చదువడానికి వీలుగా టేబుల్స్, ఫార్ములాలు. ఒకేచోట జీతాల్లో స్టాండర్డ్ డిడక్షన్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి తగ్గింపులు. మునుపు వివిధ సెక్షన్లు, రకరకాల నిబంధనల్లో ఇవి ఉండేవి.

మార్కెట్ ఆధారిత డిబెంచర్లలో మూలధన లాభాల కంప్యూటేషన్ కోసం ప్రత్యేక ప్రొవిజన్లు.

పన్ను చట్టాలను సరళతరం చేస్తూ, న్యాయపరమైన వివాదాలను తగ్గించడమే లక్ష్యంగా కొత్త ఆదాయ పన్ను చట్టాన్ని తెస్తున్నారని ట్యాక్స్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. మరింత పారదర్శకంగా నిబంధనల్ని రూపొందించి, ట్యాక్స్‌పేయర్ ఫ్రెండ్లీగా ప్రవేశపెడితే బాగానే ఉంటుందని డెలాయిట్ ఇండియా భాగస్వామి రోహింటన్ సిధ్వా అంటున్నారు. ఇక ఫైనాన్షియల్ ఇయర్, ప్రీవియస్ ఇయర్, అసెస్‌మెం ట్ ఇయర్ అంటూ ట్యాక్స్‌పేయర్స్ తికమకపడిపోతున్నారని, కొత్త బిల్లులో వీటన్నింటినీ తొలగింగి ట్యాక్స్ ఇయర్ పదాన్ని తేవడం బాగుందని శార్దూల్ అమర్‌చంద్ మంగళ్‌దాస్ అండ్ కో పార్ట్‌నర్ గౌరి పురి అన్నారు. సాధారణ పన్ను చెల్లింపుదా రులకు కూడా అర్థమయ్యే రీతిలో ఐటీ చట్టం ఉంటే ఆహ్వాని స్తామని ఏకేఎం గ్లోబల్ ట్యాక్స్ పార్ట్‌నర్ అమిత్ మహేశ్వరి అన్నారు.

# ఐటీ షేర్లపై అమ్మకాల ఒత్తిడి..

గురువారం ప్రారంభంలో ఈక్విటీ మార్కెట్లలో ట్రేడింగ్ పాజిటివ్‌గా మొదలైనా సెలెక్టెడ్ ఐటీ, బ్యాంకింగ్ స్టాక్స్‌పై అమ్మకాల ఒత్తిడితో సూచీలు నష్టాలతో ముగిశాయి. విదేశీ ఇన్వెస్టర్ల నిధుల ఉపసంహరణ, బ్యాంకింగ్‌తోపాటు సెలెక్టెడ్ ఐటీ షేర్లపై అమ్మకాల ఒత్తిడి పెరగడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఏడో సెషన్‌లో నష్టాలతో ముగిశాయి.

గురువారం ప్రారంభంలో బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ లాభాలతో పుంజుకున్నా చివరకు స్వల్ప నష్టాలతో ఫ్లాట్‌గా ముగిశాయి.

బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్ ట్రేడింగ్ ముగిసే సమయానికి 32.11 పాయింట్ల నష్టంతో 76, 138.97 పాయింట్ల వద్ద ముగిసింది. ట్రేడింగ్ పాజిటివ్‌గానే ప్రారంభమైంది. అంతర్గత ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 751.1 పాయింట్ల లబ్ధితో 76,764.53 పాయింట్ల గరిష్టానికి దూసుకెళ్లి తిరిగి 76,013.43 పాయింట్ల కనిష్ట స్థాయికి పతనమైంది. మరోవైపు ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ 13.85 పాయింట్లు పతనమై 23,031.40 పాయింట్ల వద్ద స్థిర పడింది.

బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్‌లో బ్లూ చిప్ కంపెనీలు అదానీ పోర్ట్స్, ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ), నెస్లే, టైటాన్ తదితర స్టాక్స్ నష్టపోయాయి.

మరోవైపు సన్ ఫార్మా, టాటా స్టీల్, బజాజ్ ఫిన్ సర్వ్, కోటక్ మహీంద్రా బ్యాంక్, జొమాటో భారీగా లబ్ధి పొందాయి. దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) రూ.4,969.30 కోట్ల విలువైన వాటాలను ఉపసంహరించారు. ద్రవోల్బణం గణాంకాలతో ప్రారంభంలో లాభాలతో మొదలైన స్టాక్ మార్కెట్లు.. అంతర్జాతీయ బలహీనతలతోపాటు కార్పొరేట్ తృతీయ త్రైమాసిక ఫలితాలు అంతంత మాత్రంగా ఉండటం.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఆసక్తితో పుంజుకున్న చైనా టెక్నాలజీ షేర్లతో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు ఆకర్షణీయ లాభాలపై దృష్టి సారించారు.

ఇక నరేంద్రమోదీ-డొనాల్డ్ ట్రంప్ మధ్య ద్వైపాక్షిక చర్చల సారాంశంపై ఇన్వెస్టర్లు దృష్టి సారించారని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. కూరగాయలు, కోడిగుడ్లు, పప్పుల ధరలు తగ్గుముఖం పట్టడంతో గత నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం దిగి వచ్చింది. ఆసియన్ మార్కెట్లలో సియోల్, టోక్యో షేర్లు పాజిటివ్‌గా ముగిస్తే, షాంఘై, హాంకాంగ్ నష్టాలతో స్థిర పడ్డాయి.

యూరోపియన్ యూనియన్ మార్కెట్లలో మిశ్రమ ధోరణి నెలకొంది. బుధవారం యూఎస్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. గ్లోబల్ ఆయిల్ బెంచ్ మార్క్ బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 0.94 శాతం తగ్గి 74.47 డాలర్ల వద్ద ట్రేడవుతున్నది.

# నెమ్మదించిన పారిశ్రామికోత్పత్తి



పారిశ్రామిక రంగం నెమ్మదించింది. గనులు, తయారీ రంగాలు నిరాశాజనక పనితీరు కనబర్చడంతో డిసెంబర్ నెలకుగాను మూడు నెలల కనిష్ఠాన్ని తాకుతూ 3.2 శాతానికి పడిపోయిందని కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది.


పారిశ్రామిక రంగం నెమ్మదించింది. గనులు, తయారీ రంగాలు నిరాశాజనక పనితీరు కనబర్చడంతో డిసెంబర్ నెలకుగాను మూడు నెలల కనిష్ఠాన్ని తాకుతూ 3.2 శాతానికి పడిపోయిందని కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గతేడాది సెప్టెంబర్, ఆగస్టు నెలలో ఇంతే స్థాయిలో పారిశ్రామిక ప్రగతి నమోదైంది. 2023 డిసెంబర్ నెలలో నమోదైన 4.4 శాతంతో పోలిస్తే భారీగా పడిపోయింది. డిసెంబర్ నెలలో తయారీ రంగం 3 శాతం వృద్ధిని కనబరచగా, క్రితం ఏడాది నమోదైన 4.6 శాతంతో పోలిస్తే భారీగా తగ్గింది. అలాగే గనుల్లో ఉత్పత్తి 5.2 శాతం నుంచి 2.6 శాతానికి పడిపోవడం వల్లనే పారిశ్రామిక రంగం పడకేసింది. కానీ, విద్యుత్ ఉత్పత్తి మాత్రం 1.2 శాతం నుంచి 6.2 శాతానికి ఎగిసింది. మరోవైపు, నవంబర్ నెల గణాంకాలను కేంద్ర సర్కార్ మార్చివేసింది. గతంలో 5.2 శాతంగా ఉన్నదని వెల్లడించిన గణాంకాలను ఈసారి దీనిని 5 శాతానికి కుదించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్యకాలంలో పారిశ్రామిక రంగం 4 శాతం వృద్ధిని నమోదుచేసుకున్నది. అంతక్రితం ఏడాది నమోదైన 6.3 శాతంతో పోలిస్తే మందగించింది. క్యాపిటల్ గూడ్స్ 10.3 శాతం వృద్ధిని కనబరచగా, కన్స్యూమర్ డ్యూరబుల్ 8.3 శాతం, మౌలిక సదుపాయాలు/ నిర్మాణ రంగ గూడ్స్ 6.3 శాతం, ప్రాథమిక వస్తువులు 3.8 శాతం, ఇంటర్మీడియట్ గూడ్స్ 5.9 శాతం చొప్పున వృద్ధిని నమోదు చేసుకున్నాయి. గత కొన్ని నెలలుగా దూసుకుపోతున్న ధరల సూచీ కాస్త శాంతించింది. జనవరి నెలకుగాను రిటైల్ ద్రవ్యోల్బణం ఐదు నెలల కనిష్ఠాన్ని తాకుతూ 4.31 శాతంగా నమోదైంది. కూరగాయలు, కోడి గుడ్లు, పప్పుదినుసుల ధరలు తగ్గుముఖం పట్టడం వల్లనే ధరల సూచీ తగ్గిందని పేర్కొంది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో ధరల సూచీ 5.1శాతంగాను, అలాగే డిసెంబర్ నెలలో నమోదైన 5.22 శాతం కంటే తగ్గుముఖం పట్టింది. బంగాళాదుంప, కొబ్బరి, వెల్లుల్లి, బఠానీ ధరలు భారీగా తగ్గడం ధరల సూచీ తగ్గడానికి ప్రధాన కారణమని విశ్లేషించింది. మరోవైపు, జీరా, అల్లం, ఎండుమిర్చి, బెండకాయ, వంటగ్యాస్ ధరలు ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోయాయి.

# ఫండ్స్‌లోకి 39,688 కోట్ల పెట్టుబడులు




దేశీయ మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులను ఆకట్టుకోవడంలో దూసుకుపోతున్నాయి. ఒకవైపు స్టాక్ మార్కెట్లు కుదేలవుతున్నప్పటికీ మ్యూచువల్ ఫండ్సలోకి పెట్టుబడులు ఆగడం లేదు. జనవరి నెలలో రూ.39,688 కోట్ల పెట్టుబడులు వచ్చాయని యాంఫీ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. దేశీయ మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులను ఆకట్టుకోవడంలో దూసుకుపోతున్నాయి. ఒకవైపు స్టాక్ మార్కెట్లు కుదేలవుతున్నప్పటికీ మ్యూచువల్ ఫండ్సలోకి పెట్టుబడులు ఆగడం లేదు. జనవరి నెలలో రూ.39,688 కోట్ల పెట్టుబడులు వచ్చాయని యాంఫీ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. కానీ, డిసెంబర్ నెలలో వచ్చిన రూ. 41,156 కోట్ల పెట్టుబడులతో పోలిస్తే 3.5 శాతం తగ్గాయని పేర్కొంది. దీంతో వరుసగా 47వ నెలలోనూ ఫండ్సలోకి పెట్టుబడులు రావడం విశేషం. మిడ్‌క్యాప్ క్యాటగిరిలో రూ.5,148 కోట్లు, స్మాల్‌క్యాప్ క్యాటగిరిలో రూ.5,721 కోట్ల పెట్టుబడులు తరలివచ్చాయి.

# కావేరీ సీడ్స్ ఆశాజనకం



రాష్ట్రానికి చెందిన ప్రముఖ విత్తనాల తయారీ సంస్థ కావేరీ సీడ్స్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ.15.04 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.11.66 కోట్ల లాభంతో పోలిస్తే 29 శాతం వృద్ధిని కనబరిచింది.

రాష్ట్రానికి చెందిన ప్రముఖ విత్తనాల తయారీ సంస్థ కావేరీ సీడ్స్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ.15.04 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.11.66 కోట్ల లాభంతో పోలిస్తే 29 శాతం వృద్ధిని కనబరిచింది. అలాగే సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.118.47 కోట్ల నుంచి రూ.154.77 కోట్లకు ఎగబాకినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. ప్రస్తుతం కంపెనీ చేతిలో రూ.499 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయి.

ఈ సందర్భంగా సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జీవీ భాస్కర్ రావు మాట్లాడుతూ.. గత త్రైమాసికంలో ఆశాజనక పనితీరు కనబరిచినట్లు, వరి-మొక్కజొన్న విత్తనాలకు డిమాండ్ నెలకొన్నద న్నారు. అలాగే గత త్రైమాసికంలో ఎగుమతులు రూ.38.10 కోట్ల నుంచి రూ.18.23 కోట్లకు పడిపోయాయి.

ముఖ్యంగా బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం వల్లనే ఎగుమతులు నీరసిం చాయని చెప్పారు. ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్యకా లానికిగాను రూ.1,044.61 కోట్ల ఆదాయంపై రూ.294.46 కోట్ల లాభాన్ని గడించింది.

# 10 మిలియన్ డాలర్లతో మస్క్ సెటిల్‌మెంట్!

తమ్ముడు తమ్ముడే.. పేకాటే పేకాటే అన్న చందంగా మారింది అమెరికా అధ్యక్షుడి డొనాల్డ్ ట్రంప్ వైఖరి. గతంలో అధికారంలో ఉన్న సమయంలో ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్‌తో తరచుగా గొడవలు పడే ట్రంప్.. ఇప్పుడు చాలా స్నేహంగా ఉంటున్నారు. కానీ గతంలో తనపై ఎక్స్ విధించిన నిషేధాన్ని మాత్రం మర్చిపోలేదు. ఈక్రమంలోనే ట్రంప్ దావా వేయగా.. మస్క్ దీన్ని సెటిల్ చేయబోతున్నారు. ముఖ్యంగా ట్రంప్‌కు 10 మిలియన్ డాలర్లు చెల్లించి ఈ గొడవకు ఫుల్‌స్టాప్ పెట్టబోతున్నారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.





అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరి.. తమ్ముడు తమ్ముడే.. పేకాట పేకాటే అన్న చందంగా మారింది. గతంలో అధికారంలో ఉన్న సమయంలో ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్‌తో చాలా గొడవలు పడ్డ ట్రంప్.. రెండోసారి అధికారంలోకి వచ్చాకా చాలా స్నేహంగా ఉంటున్నారు. మస్క్ కూడా ట్రంప్ వైపే నిలబడి అన్నీ అతడికి నచ్చినట్లే చేస్తున్నారు. ఒకే తాటిపై నిలబడి అందరికీ షాకిచ్చిన వీరి మధ్య తాజాగా మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ముఖ్యంగా గతంలో ఎక్స్.. ట్రంప్‌పై నిషేధం విధంచగా ఆయన కోర్టులో దావా వేశారు. అయితే తాజాగా మస్క్ దీన్ని సెటిల్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలోనే ట్రంప్‌నకు 10 మిలియన్ డాలర్లు చెల్లించబోతున్నారట. ఆ పూర్తి వివరాలు మీకోసం.

2015లో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలిచి ఐదేళ్ల పాలించిన ట్రంప్.. 2020 ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన విషయం అందరికీ తెలిసిందే.

అయితే ఈ ఎన్నికల్లో గెలిచిన జో బైడెన్ విజయాన్ని ధ్రువీకరించేందుకు.. అమెరికా కాంగ్రెస్ వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ భవనంలో సమావేశం అయింది. ఈ విషయం తెలుసుకున్న ట్రంప్ మద్దతుదారులు దీన్ని అడ్డుకోవాలని చూశారు. ఈక్రమంలోనే వేలాది మంది క్యాపిటల్ భవనంలోకి చొచ్చుకెళ్లి విధ్వంసం సృష్టించారు. భవనంపై దాడి చేశారు. దీంతో చాలా మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిపై కేసులు కూడా పెట్టారు.

మరోవైపై దీనికి ట్రంప్ మద్దతు తెలుపగా.. సామాజిక మాధ్యమాలన్నీ ఈయనపై నిషేధం విధించాయి. ముఖ్యంగా ఎక్స్, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లు ట్రంప్ సోషల్ మీడియా ఖాతాలను నిషేధించాయి. దీంతో ట్రంప్ ఆయా సంస్థలపై దావా వేశారు. కొన్నాళ్ల తర్వాత అంటే 2023లో కాస్త వెనక్కి తగ్గిన సదరు సంస్థలు ట్రంప్ ఖాతాలపై నిషేధాన్ని ఎత్తివేస్తూ వాటిని పునరుద్ధరించాయి. ఇదిలా ఉండగా.. ట్రంప్ 2025 ఎన్నికల్లో మరోసారి విజయం సాధించి అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టగా.. ఈ గొడవలను సెటిల్ చేసుకునేందుకు అన్ని సంస్థలు ముందుకు వచ్చాయి.

ఇప్పటికే మెటా సంస్థ 25 మిలియన్ డాలర్లతో సెటిల్ చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా ఎలాన్ మస్క్ ఎక్స్ సంస్థ కూడా.. ట్రంప్‌తో సెటిల్‌మెంట్‌కు వచ్చినట్లు సమాచారం. ముఖ్యంగా 10 మిలియన్ డాలర్లు చెల్లించి మస్క్ ఈ గొడవకు ఫుల్‌స్టాప్ పెట్టబోతున్నట్లు తెలుస్తోంది.

10 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో 86 కోట్ల రూపాయలు. ఈ విషయం తెలుసుకున్న నెటిజెన్లు అంతా వీళ్లిద్దరూ స్నేహితులయ్యారు కదా.. సెటిల్‌మెంట్ అవసరమా అంటూ కామెంట్లు చేస్తున్నారు. కానీ ఇందుకు రిప్లైలు ఇస్తూ మరికొంత మంది.. తమ్ముడు తమ్ముడే.. పేకాట పేకాటే అనే సిద్ధాంతాన్ని ట్రంప్ ఫాలో అవుతారని చెప్పుకొస్తున్నారు.

## మోదీకి షేక్ హ్యాండ్ ఇవ్వకుండా.. అవమానించారా?

ఫ్రాన్స్ పర్యటనలో ప్రధాని మోదీకి అవమానం జరిగిందా..? ఫ్రెంచ్ అధ్యక్షుడు మెక్రాన్.. మోదీకి షేక్ హ్యాండ్ ఇవ్వకుండా.. మిగతా నేతలందరికీ షేక్ హ్యాండ్ ఇచ్చారా..? సోషల్ మీడియాలో కాంగ్రెస్ నేతలు షేర్ చేస్తున్న వీడియో చూస్తే ఎవరికైనా ఇదే అనుమానం కలగక మానదు. అయితే ఇది కట్ చేసిన చిన్న వీడియో క్లిప్ మాత్రమే. అంతకు ముందు, ఆ తర్వాత ఏం జరిగిందో చూస్తే.. వైరల్ అవుతోన్న వీడియో క్లిప్ మిస్‌లీడ్ చేసేలా ఉందని అనిపించకమానదు.



ఫ్రాన్స్‌లో పర్యటనలో బిజీ బిజీగా గడిపిన ప్రధాని మోదీ.. ప్యారిస్‌లో నిర్వహించిన ఏఐ యాక్షన్ సమ్మిట్‌లో కీలక ప్రసంగం చేశారు. మంగళవారం జరిగిన ఈ సదస్సులో మెక్రాన్‌తో కలిసి పాల్గొన్న మోదీ.. అనంతరం 14వ భారత్-ఫ్రాన్స్ సీఈవోల ఫోరంలో పాల్గొన్నారు. బుధవారం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో కలిసి మార్సెల్లీలో భారత నూతన కాన్సులేట్ జనరల్‌ను మోదీ ప్రారంభించారు. మజార్గస్ యుద్ధ శ్మశాన వాటికను సందర్శించిన ప్రధాని మోదీ.. ప్రపంచ యుద్ధాల్లో అమరులైన భారత సైనికులకు శ్రద్ధాంజలి ఘటించారు. కరహాష్‌లోని ఇంటర్నేషనల్ థర్మోన్యూక్లియర్ ఎక్స్‌పెరిమెంటల్ రియాక్టర్‌ను మెక్రాన్‌తో కలిసి మోదీ సందర్శించారు. మోదీ పర్యటనతో భారత్-ఫ్రాన్స్ సంబంధాలు మరింత బలోపేతం అయ్యాయి.

అయితే ఏఐ సమ్మిట్ సందర్భంగా ఫ్రెంచ్ అధ్యక్షుడు మెక్రాన్.. ప్రధాని మోదీకి షేక్ హ్యాండ్ ఇవ్వలేదంటూ సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ అవుతోంది. ఇందులో ఎంత వరకు వాస్తవం ఉందో చూద్దాం..

'ఈడీ కచ్చితంగా చర్యలు తీసుకోవాలి. విశ్వగురుకు షేక్ హ్యాండ్ ఇవ్వలేదు' అనే క్యాప్షన్‌తో.. ఏఐ సమ్మిట్ సందర్భంగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్.. భారత ప్రధాని నరేంద్ర మోదీకి షేక్ హ్యాండ్ ఇవ్వకుండా.. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సహా.. మిగతా ప్రపంచ నేతలకు షేక్ హ్యాండ్ ఇస్తున్నట్లుగా ఉన్న వీడియోను శ్రీనివాస్ బీవీ అనే కాంగ్రెస్ నేత ఎక్స్‌లో పోస్టు చేశారు.

ప్రధాని మోదీని ఫ్రెంచ్ అధ్యక్షుడు మెక్రాన్ నిజంగానే పట్టించుకోలేదా.. అనే విషయమై సజగ్ టీమ్ ఫ్యాక్ట్ చెక్ చేసింది. ఇందులో భాగంగా అసోసియేటెడ్ ప్రెస్ యూట్యూబ్ ఛానెల్‌లో ఏఐ సమ్మిట్ 2025 లైవ్ పేరిట ప్రసారమైన వీడియోను పరిశీలించింది. ఈ వీడియోలో 8 నిమిషాల 38 సెకన్ల వద్ద.. ప్రధాని మోదీని వెంటబెట్టుకొని మెక్రాన్ సదస్సు ప్రాంగణం లోపలికి వస్తుండటాన్ని చూడొచ్చు. ఆ తర్వాత మోదీ, మెక్రాన్ కలిసి కొందరు నేతలకు షేక్ హ్యాండ్ ఇవ్వడాన్ని గమనించొచ్చు.

ఆ తర్వాత ప్రధాని మోదీ, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పక్క పక్కన కూర్చొని ఉండగా.. మెక్రాన్ అక్కడున్న నేతలందరికీ షేక్ హ్యాండ్ ఇస్తూ వెళ్లారు. అనంతరం సభికులను ఉద్దేశించి కాసేపు ప్రసంగించిన ఫ్రెంచ్ అధ్యక్షుడు.. తర్వాత ప్రధాని మోదీని హత్తుకొని, కరచాలనం చేసి వేదికపైకి ఆహ్వానించారు. ఆ తర్వాత ప్రధాని మోదీ ప్రపంచ దేశాల అధినేతలను ఉద్దేశించి ప్రసంగించారు. ఏపీ లైవ్ వీడియాలో 17 నిమిషాల 13 సెకన్ల దగ్గర్నుంచి ఈ పార్ట్‌ను చూడొచ్చు.

గ్రాండ్ పాలైస్ వేదికగా జరిగిన ఈ ఏఐ సమ్మిట్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, చైనా వైస్ ప్రీమియర్ ఝూంగ్ గువోఖింగ్, యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెన్ లెయన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఫ్రాన్స్, భారత్ సహ-అధ్యక్షత వహించినట్లు మీడియాలో కథనాలు వచ్చాయి.

ఏఐ సమ్మిట్ ప్రారంభానికి ముందు డిన్నర్ ఇచ్చారు. డిన్నర్ కోసం వచ్చిన ప్రధాని మోదీ, జేడీ వాన్స్‌కు స్వాగతం పలికిన మెక్రాన్.. దీనికి సంబంధించిన వీడియోను ఫిబ్రవరి 11న ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ వీడియోలో మోదీని మెక్రాన్ స్వయంగా లోపలికి తీసుకొని వెళ్లడాన్ని చూడొచ్చు.

అంతే కాదు ప్రధాని మోదీ ఫ్రాన్స్ పర్యటన ముగించుకొని అమెరికా బయల్దేరుతున్న సమయంలో.. ఫ్రెంచ్ అధ్యక్షుడు విమానం దగ్గరకు వచ్చి మరీ మోదీకి ఆత్మీయ వీడ్కోలు పలికినట్లు న్యూస్ ఏజెన్సీ ఏఎన్ఐ ఎక్స్‌లో పోస్టు చేసిన ఫొటోలను చూస్తే అర్థమవుతుంది.

ప్రధాని మోదీకి ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ సముచిత గౌరవం ఇచ్చారని ఈ ఫొటోలు, వీడియోలను చూస్తే అర్థమవుతుంది. కానీ వీడియోలో కొంత భాగాన్ని మాత్రమే కట్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మోదీని పట్టించుకోలేదంటూ తప్పుదోవ పట్టించే ప్రచారం చేస్తున్నారు.

# నా భార్య ఐఎస్ఐ ఏజెంట్, నేను రా ఏజెంట్..

అస్సాం ముఖ్యమంత్రి హింత బిశ్వశర్మ ఇటీవలే కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్, ఆయన భార్యపై షాకింగ్ కామెంట్లు చేశారు. ముఖ్యంగా గొగోయ్ భార్య ఎలిజబెత్ కోల్బర్న్‌కు పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐతో సంబంధం ఉందని చెప్పారు. దీనిపై స్పందించిన ఎంపీ గౌరవ్ గొగోయ్.. నా భార్య పాకిస్థాన్ ఐఎస్ఐ ఏజెంట్ అయితే నేను భారతదేశానికి చెందిన రా ఏజెంట్ అని చెప్పుకొచ్చారు. తనపై వచ్చిన ఆరోపణలు తోసి పుచ్చడానికే సీఎం ఇతరులపై ఇలాంటి తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని వివరించారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.

నా భార్య పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ ఏజెంట్ అయితే నేను భారత దేశానికి చెందిన రా ఏజెంట్ అంటూ కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ షాకింగ్ కామెంట్లు చేశారు. ముఖ్యంగా అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూనే ఆయన ఈ విధంగా మాట్లాడారు. సీఎంపైనే పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయని.. వాటిని తోసిపుచ్చుకోవడానికి ఆయన మాపై ఈ ఆరోపణలు చేశారంటూ వివరించారు. అయితే వీటిల్లో ఏమాత్రం నిజం లేదని.. అన్నీ తప్పుడు వ్యాఖ్యలేనని చెప్పుకొచ్చారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.

అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ.. కాంగ్రెస్ నాయకుడు గౌరవ్ గొగోయ్ భార్య ఎలిజబెత్ కోల్బర్న్‌కు పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐతో సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. ముఖ్యంగా ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. 2015లో భారత్‌లోని పాకిస్థాన్ హైకమిషనర్ అబ్దుల్ బాసిత్ ఢిల్లీలో ఇండియా-పాక్ సంబంధాల గురించి చర్చకు ఎంపీ గౌరవ్ గొగోయ్‌ను ఆహ్వానించారని చెప్పారు. ఈయన కూడా 50 నుంచి 60 మంది యువకులను తీసుకుని పాకిస్థాన్ అధికారులను కలవడానికి వెళ్లారని తెలిపారు. అయితే ఆ సమయంలో



> వివాహానికి ముందు ఎలిజబెత్ కోల్బర్న్.. పాకిస్థాన్ స్థాపనతో సన్నిహత సంబంధాలకు పేరుగాంచిన ఒక అమెరికన్ సెనేటర్ కోసం పని చేసిం దని చెప్పారు. ఆపై కొన్నాళ్లు పాకిస్థాన్‌లో ఉన్న ఆమె ఐఎస్ఐ కోసం పనిచేస్తుం దని.. ఇప్పటికీ వాటిని కొనసా గిస్తుందని చెప్పుకొచ్చారు.

ఎంపీ.. విదేశీ వ్యవహారాల పార్లమెంటరీ కమిటీలో సభ్యుడు కూడా కాదని గుర్తు చేశారు.

అదే సమయంలో అతడికి ఎలిజబెత్ కోల్బర్న్‌తో నిశ్చితార్థం జరిగిందని సీఎం స్పష్టం చేశారు. అయితే వివాహానికి ముందు ఎలిజబెత్ కోల్బర్న్.. పాకిస్థాన్ స్థాపనతో సన్నిహత సంబంధాలకు పేరుగాంచిన ఒక అమెరికన్ సెనేటర్ కోసం పని చేసిందని చెప్పారు. ఆపై కొన్నాళ్లు పాకిస్థాన్‌లో ఉన్న ఆమె ఐఎస్ఐ కోసం పని చేస్తుందని.. ఇప్పటికీ వాటిని కొనసాగిస్తుం దని చెప్పుకొచ్చారు. దీనిపై తాజాగా కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ స్పందించారు. ఇవన్నీ తప్పుడు వ్యాఖ్యలు అని.. బీజేపీ కావాలనే ఇలాంటి ఆరోపణలు చేస్తుందన్నారు. ముఖ్యంగా తన భార్య ఐఎస్ఐ ఏజెంట్ అయితే తాను ఇండియా రా ఏజెంట్ అని చెప్పుకొచ్చారు. సీఎంపై వస్తున్న తీవ్రమైన ఆరోపణ, కేసులను తోసిపుచ్చడానికి ఆయన ఇతరులపై నిందలు మోపుతున్నార న్నారు. ఇలాంటి ఓ తప్పుడు వ్యక్తి.. తనపై, తన కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేయడాన్ని తానేమాత్రం పట్టించుకోనని.. పట్టించుకోవాల్సిన అవసరం కూడా లేదని వెల్లడించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధిం చిన కామెంట్లు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# పట్టభద్రుల ఎన్నికల్లో

## కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

### ప్రభుత్వ విప్,ఎంఎల్ఏ ఆది శ్రీనివాస్



**రాజన్నసిరిసిల్ల జిల్లా ప్రతినిధి/వేములవాడ, ఫిబ్రవరి 13 (జనంసాక్షి)**

పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డినీ భారీ మెజారిటీతో గెలిపించాలనీ ప్రభుత్వ విప్,వేములవాడ ఎంఎల్ఏ అది శ్రీనివాస్ అన్నారు.గురువారం వేములవాడలోనీ దువ్వాస్ బాంక్విట్ హాల్ లో గురువారం మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా వేములవాడ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వూట్కూరి నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎంఎల్ఏ అది శ్రీనివాస్ హాజరయ్యారు. సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి ను భారీ మెజారిటీతో గెలిపించాలనీ,అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.పది సంవత్సరాల్లో జరగని రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంలో సంవత్సర కాలంలో జరిగిందన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో డిఎస్సీ జరిగిందనీ,మళ్ళీ గత పదేళ్లుగా డిఎస్సీ వేయలేదన్నారు.మళ్ళీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డిఎస్సీ వేశామన్నారు.పదేళ్లలో 55 వేళ ఉద్యోగాలు ఇవ్వలేదనీ, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పది నెలల్లో 55 వేళ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు అయిపోగానే రాష్ట్రంలో జడ్పీటీసీ,ఎంపీటీసీ,సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయన్నారు.ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు సెమీఫైనల్గా భావించి రాబోయే సర్పంచ్,ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికలు ఫైనల్ గా భావించాలన్నారు.ఎన్నికల్లో గ్రామాల్లోని పట్టభద్రులను ప్రసన్నం చేసుకొని ఎమ్మెల్సీ గెలుపు కోసం తోడ్పాటు అందిస్తే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు ఈజీగా ఉంటుందన్నారు. ప్రజా ప్రభుత్వంలో ఎమ్మెల్యేలకు స్పెషల్ డెవలప్మెంట్ కింద పది కోట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ మీ ప్రాంతాల్లో గెలుపొందేలా ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పనిచేయాలనీ నాయకులకు కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు.అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి విద్యాసంస్థల ద్వారా ఎంతమందికి సేవ చేస్తున్నారనీ,చాలామంది పేద ప్రజలకు పాఠశాల కళాశాలలో ఫీజుల విషయంలో రాయితీ కల్పించారన్నారు.ఎమ్మెల్యే ఎన్నికల్లో నా గెలుపులో ఏ విదంగా భాగస్వామ్యులు అయ్యారో అదేవిదంగా, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలన్నారు.వేములవాడ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరవేయడం లక్ష్యంగా పనిచేయాలనీ, నియోజకవర్గ పరిధిలోని అన్ని జడ్పిటిసి, ఎంపిటిసి స్థానా లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం జరుగు తుంద న్నారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి మాట్లా డుతూ పెద్దల సభకు వెళ్ళ డానికి నాకు కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.నా రాజకీయ జీవితం ఆది శ్రీనివాస్ అడుగు జాడలో వెళ్ళుతానన్నారు. నాకున్న విద్యాసంస్థల ద్వారా డబ్బులు పిండిండు అనేది నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారనీ,నేను నిబంధనల ప్రకారమే ఫీజు వసులు చేస్తున్నా, కానీ మోసం ఎప్పుడు చేయలేదన్నారు. వేము లవాడ నియోజకవర్గం నుండి 80 శాతం ఓట్లు వచ్చేలే చూడాల న్నారు. ఈ సమావే శంలో వేములవాడ సెస్ డైరెక్టర్ నామల ఉమా లక్ష్మరాజం, మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు, కాంగ్రెస్ నాయకులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, సాగరం వెంకటస్వామి, బింగి మహేష్, కూరగాయల కొమురయ్య ,చిలుక రమేష్ పుల్కం రాజు,నియోజకవర్గ పరిధి లోని మండల అధ్యక్షులు,మార్కెట్ కమిటీ చైర్మన్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# తెలంగాణలోని దేవాలయాల్ని ఆధ్యాత్మిక నిలయాలుగా చేస్తాం

**పాలకుర్తి ఫిబ్రవరి 13 (జనంసాక్షి)**



తెలంగాణ లో ఉన్న దేవాలయాలన్నింటిని ఆధ్యాత్మిక నిలయాలుగా అభివృద్ధి చేస్తామని, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు, గురువారం మంత్రి కొండా సురేఖ స్వగృహంలో అర్చక ఉద్యోగ ఐకాసా చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, అర్చక జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డివిఆర్ శర్మ, ప్రధాన కార్యదర్శి దుండిగల్ ఆనంద్ శర్మ, అర్చక ఉద్యోగ జేఏసీ రాష్ట్రఆస్థాన పంచాంగకర్త డాక్టర్ అవసరాల ప్రసాద శర్మ సిద్ధాంతి మంత్రి కొండా సురేఖ ను మర్యాదపూర్వకంగా కలిసి అర్చక ఉద్యోగుల సమస్యల గురించి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు, ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ దేవాదాయ శాఖలో భక్తులకి భగవంతునికి అనుసంధానంగా దేవాలయాల్ని మారుస్తామని తెలంగాణ రాష్ట్రంలో ఉన్న దేవాలయాలకు ఉన్నటువంటి భూములని అన్యాక్రాంతం కాకుండా వాటి రక్షణ పరిరక్షణకు రాష్ట్ర స్థాయి లో ఒక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి, అన్యాక్రాంతమైన భూములను కూడా దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకువచ్చి వాటిని కూడా దేవాలయాలకు స్థిరమైన ఆదాయం వనరుగా మార్చడానికి ప్రణాళిక ఉందని, దానిలో భాగంగా దేవాదాయ శాఖకు ఉపయోగంలో లేని భూములను మొదటి విడతలో సోలార్ పవర్ ప్లాంట్స్ కి ఏర్పాటు చేసి సంబంధిత దేవాలయానికి స్థిరమైన ఆదాయ వనరుగా మార్చే సదుద్దేశంతో ఉన్నామని అన్నారు, దేవాలయాల్లో భక్తులు కొట్టే కొబ్బరికాయలను కూడా సేకరించి శు ద్ధమైన పవిత్రమైన కొబ్బరి నూనెను తెలంగాణ సమాజం అంతటికి కూడా అందించేందుకు దాన్ని కూడా ఒక ఆదాయ వనరుగా మార్చేందుకు కావలసిన ప్రణాళిక పరిశీలిస్తున్నట్టు ఆమె తెలిపారు, దేవాలయ వ్యవస్థలలో వివిధ సమస్యలన్ని కూడా తన దృష్టిలో అన్ని ఉన్నాయని వాటిని పరిష్కరించడానికి కావాల్సిన అన్ని చర్యలు చేపడతానని చెప్పారు. రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధి తో పాటు అర్చక ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు,

# కొత్త సంఘాల ఏర్పాటు

## పేద మహిళలకు ఆర్థిక అభివృద్ధి కల్పించాలి



**మంథని, (జనంసాక్షి)**

: పెద్దపల్లి జిల్లా మంథని పట్టణ సమాఖ్య పరిధిలోనే ఉన్న స్వశక్తి సంఘాలకు స్త్రీనిధి ఋణసదుపాయాలు తక్కువ వడ్డీకి ఇవ్వటం జరుగుతుంది. ఈ ఋణసదుపాయాలు ప్రతి మహిళా వినియోగించుకోగలరని దుర్గా ప్రసాద్ (శ్రీనిధి ఆర్.ఎం) తెలియపరిచారు. స్లం ఏరియ పరిదిలో ఉన్న ఎస్ హెచ్ జి బకాయిలను తక్షణం వంద శాతం రికవరీ పూర్తిచేయాలని సూచించినారు. మంథని మున్సిపల్ పరిధిలోని తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి 18 సంవత్సరములు పై బడిన ప్రతి మహిళలను గుర్తించి స్వశక్తి సంఘాల వల్ల కలుగు ప్రయోజన ములను వివరరిస్తూ అవగాహన కల్పించి కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలనీ మెప్మా అర్పిలతో, మెప్మా సిబ్బందితో సమీక్ష సమావేశమును నిర్వహించారు. ఈ కార్యక్రమ ములో డీఎంసీ సతీష్ బాబు, శ్రీనిధి ఆర్ఎం దుర్గ ప్రసాద్, మంథని మున్సిపల్ కమ్యునిటి ఆర్గనైజర్ బందం లావణ్య ,శ్రీనిధి మేనేజర్ శోభ , ఆర్పీలు, అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఎన్నికలు ఎప్పుడు వచ్చినా విధులకు సిద్ధంగా ఉండాలి

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 13(జనంసాక్షి) :**



స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా రిటర్నింగ్ అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల విధుల నిర్వహణపై కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ... పంచాయతీ ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారులు ముఖ్యపాత్ర పోషిస్తారని అన్నారు. అందువల్ల ఎన్నికల విధులను ఎంతో జాగ్రత్తగా నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల నియమ, నిబంధనల గురించి స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఉంటుందని అన్నారు. ఎన్నికల సంఘం ద్వారా అందించిన కర దీపికను రిటర్నింగ్ అధికారులు తప్పనిసరిగా చదవాలని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని తెలిపారు. ఎలాంటి సందేహాలు ఉన్నత అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, పార్టీ గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ విధానం, ఓట్ల లెక్కింపు, ఎన్నికల నియమావళి తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్లు దేవి శ్రీనివాస్, టీ.సంపత్, ఆర్.రవీందర్, పరశురాం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డిపిఓ పవన్ కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్లు వేసిన 13 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఇందులో 12 మంది గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కాగా ఒక్కరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి.

**గ్రాడ్యుయేట్ ఎన్నికలకు విత్ డ్రా చేసుకున్నవారు:**

గవ్వల లక్ష్మి , ఎడ్ల సాయి కృష్ణప్రియ, కావూరి సత్యనారాయణ గౌడ్, ఆలగొండ కృష్ణ హరి, నాలకంటి యాదగిరి, బడే నరసయ్య, లింగాల శ్రీనివాస్, రేకల సైదులు, మదనం గంగాధర్, లింగం కృష్ణ , సోమగాని నరేందర్, దార మనోహర్ కు 12 మంది గ్రాడ్యుయేట్ ఎన్నికలకు విత్ డ్రా చేసుకున్నారు. గవ్వల శ్రీకాంత్ ఒక్కరు మాత్రమే టీచర్స్ ఎమ్మెల్సీకి నామినేషన్ విత్ డ్రా చేసుకున్నారు.

# కుల గణన సర్వేలో

## తెలంగాణ దేశానికి రోల్ మోడల్



**సర్వేలో పాల్గొని సమాచారం ఇచ్చేలా బీసీ సంఘాల నేతలు కృషి చేయాలి**

**మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ లను అభినందించి సత్కరించిన బీసీ సంఘాల నేతలు**

**హైదరాబాద్ (జనంసాక్షి)**

తెలంగాణ ప్రభుత్వం కుల సర్వేలో పాల్గొనని వారికి మరో అవకాశం ఇస్తూ ఈనెల 16 నుండి 28 వరకు అవకాశం ఇవ్వడం పట్ల బీసీ సంఘాల నేతలు ,మేధావులు ప్రొఫెసర్లు హర్షం వ్యక్తం చేశారు. సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తో బీసీ సంఘాల నేతలు సమావేశమయ్యారు. సమావేశంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ , బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు. ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయడంలో భాగంగా బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో ,విద్యా ఉపాధి అవకాశాల్లో చట్టబద్దత కల్పిస్తామని నిర్ణయం తీసుకోవడం పట్ల బీసీ సంఘాల నేతలు ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ లకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం చారిత్రాత్మక , సహసోపేత నిర్ణయం తీసుకుందని ప్రభుత్వానికి అండగా ఉంటామని బీసీ సంఘాలు నేతలు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుల సర్వే లో పాల్గొనని వారికి మరో అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అంతే కాకుండా తమ నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల ఎన్నికలు,విద్యా ఉపాధి అవకాశాల్లో చట్ట బద్దత చేస్తామని మార్చ్ మొదటి వారంలో కేబినెట్ సమావేశం ఏర్పాటు చేసి తరువాత వెంటనే శాసన సభ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్దత బిల్లు పెడతామని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో కేబినెట్ మంత్రుల బృందం ఢిల్లీ వెళ్లి అన్ని పార్టీలను కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసి దీనికి మద్దతు ఇవ్వాలని కోరుతామని పేర్కొన్నారు. బీసీ సంఘాల నేతలు , ప్రొఫెసర్లు , మేధావులు జిల్లాల పర్యటన చేసి కుల సర్వేలో పాల్గొనని వారు పాల్గొనేలా కృషి చేయాలని సూచించారు. ప్రస్తుతం కులాల వారిగా బయటకు వస్తున్న లెక్కలు పూర్తిగా తప్పు అని దీనిని కావాలని ప్రతిపక్షాలు తప్పుడు లెక్కలు ప్రచారం చేస్తున్నాయని బీసీ సంఘాల నేతలతో మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కుల సర్వే లో పాల్గొనని వారి కోసం ఈనెల 16 లోపు ఒక టోల్ ఫ్రీ నెంబర్ వస్తుందని దానికి సమాచారం ఇస్తే ఎన్యూమరేటర్ సమాచారాన్ని సేకరిస్తారని తెలిపారు. దాంతో పాటు ఎంపీడీఓ కార్యాలయాల్లో కుల సర్వే సమాచార సేకరణకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడంతో పాటు ఆన్లైన్ లో కూడా సమాచారాన్ని సేకరించేలా చూస్తున్నారన్నారు.

# రాష్ట్ర బడ్జెట్లో విద్యకు 15 శాతం కేటాయించాలి : టిఏఎస్ఎస్

**శంకర్పల్లి, ఫిబ్రవరి 13 (జనంసాక్షి)**



తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర సభ్యులు మానస మాట్లాడుతూ... తెలంగాణ ఆవిర్భావం తర్వాత మన రాష్ట్రంలో కే.జీ నుండి పీ.జీ వరకు ఉచిత విద్యను అందిస్తామని కార్పొరేట్ విద్యకు దీటుగా నాణ్యమైన విద్య అందిస్తామని గత ప్రభుత్వాలు కాలయాపన చేసినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తున్నాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంతేకాకుండా 2024–25 రాష్ట్ర బడ్జెట్లో విద్యకు 7.6 శాతం మాత్రమే కేటాయించారని ప్రశ్నించారు.మరియు మండల కేంద్రంలో జూనియర్ మరియు డిగ్రీ కాలేజీలు లేకపోవడంతో కార్పొరేట్ కళాశాలలో చదవలేక పదవ తరగతి నుండి విద్యను కొనసాగించలేకపోతున్నారని అన్నారు. చదవటానికి ఆసక్తి ఉన్న విద్యార్థులకు సైతం రవాణా సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని మండలంలోని ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సభ్యులు సంజన, శిరీష, సోనీ, సంధ్య, మండల సభ్యులు నికిత, ప్రవళిక, చందన, ప్రియాంక, ప్రశాంతి, తేజశ్రీ, మమత తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# పిల్లల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్ట్ మౌనిక**

**లక్షెట్టిపేట ఫిబ్రవరి 13 (జనంసాక్షి)**

పిల్లలు, మహిళలు రక్షణ చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్ట్ మౌనిక అన్నారు. గురువారం జిల్లా సంక్షేమశాఖ అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో గల కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయం, దౌడెపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫైనాన్స్ లిటరసీ కార్యక్రమ ప్రతినిధి లిప్సికతో కలిసి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్ట్ మాట్లాడుతూ పిల్లల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బాలిక రక్షణ కొరకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన భేటీ బచావో– భేటీ పడావో కార్యక్రమం 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పి.సిపి.ఎన్. డి.టి. యాక్ట్ (గర్భస్థ శిశువు లింగనిర్ధారణ చట్టం), లింగ వివక్షత–లింగ సమానత్వం, బాల్య వివాహాల నిరోధక చట్టం, ఆన్లైన్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, సఖి సర్వీసెస్ హెల్ప్ లైన్ నం. 181, చైల్డ్ హెల్ప్ లైన్ నం. 1098, మహిళా హెల్ప్ లైన్ నం.1930, డిజిటల్ ఎడ్యుకేషన్, పోలీస్ హెల్ప్ లైన్ 100, సీనియర్ సిటిజన్ హెల్ప్ లైన్ నం.14567, పోక్సో యాక్ట్, నేషనల్ ఎమర్జెన్సీ నం. 112, సుకన్య సమృద్ధి యోజన, మిషన్ వాత్సల్య కార్యక్రమాలు, చట్టాల గురించి తెలుసుకోవాలని, ఆడ పిల్లల ప్రాముఖ్యత గురించి, మహిళా సాధికారత అంశాలపై వివరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు గుడ్ టచ్– బ్యాడ్ టచ్ గురించి వివరించాలని తెలిపారు. దౌడెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడానికి బీసీలందరం ఏకమవుతాం

**మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్**

**వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 13 (జనం సాక్షి)**



కుల గణన తప్పుల తాడుకగా ఉందని కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడానికి బీసీలమంతా ఏకం అవుతామని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు గురువారం శ్రీ సాయి కన్వెన్షన్ హా ల్లో బీసీ కుల పెద్దలతో కలిసి ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా నరేందర్ మాట్లామాట్లాడు కులగనన సర్వేలో బీసీల జనాభాను దాదాపు ఐదున్నర శాతం తక్కువగా చూపించి బలహీన వర్గాల గొంతు కోయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నది.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కలిపిస్తామనే హామీని కాంగ్రెస్ తుంగలో తోకారన్నారుబీసీలకు తక్షణమే రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి లేని పక్షం లో బీసీలం అందరూ ఏకమై రేవంత్ ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి సిద్ధంగా ఉన్నాం.మీ పార్టీకి సంబంధించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లననే ఇదొక చిత్తు కాగితం ఈ సర్వే బుటకపు సర్వే అని మీ పార్టీ నాయకుడే చెప్పాడు.కామారెడ్డి డిక్లరేషన్ కాంగ్రెస్ వాళ్లే తూట్లు పొడిచారు. వరంగల్ తూర్పు లో ఉన్నా ప్రతి బీసీ బిడ్డకు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రతి బీసీ బిడ్డ గడప గడప కు తెలిసేలా ఒక నోట్ ను తయారు చేసి పంపిస్తాము. ఈ మోసం ప్రతి బీసీ బిడ్డకూ తెలిసేలా ప్రతి బీసీ బిడ్డా కృషి చేయాలని నరేందర్ పేర్కొన్నారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా మంత్రిగా ఉన్న కొండా సురేఖ బీసీలకు అన్యాయం జరుగుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.ఈ కార్యక్రమం లో 34 వ డివిజన్ కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, మాజీ మార్కెట్ చైర్మన్ టి. రమేష్ బాబు మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్, నీలం రాజు కిషోర్ తో పాటు డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకురాలు, యూత్ నాయకులు, బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్ మెంట్ ఇప్పించి నరేందర్ రెడ్డి ఓటు అడగాలి

**బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి**

**మంచిర్యాల ప్రతినిధి ఫిబ్రవరి 13 (జనంసాక్షి)**




కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి విద్యాసంస్థల అధినేత అయిన నరేందర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులకు ఎదుర్కొంటున్నరని, ప్రభుత్వంతో మాట్లాడి విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్మెంట్ ఇప్పించి ఆ తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడగాలని బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నాడు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తా నుండి బస్టాండ్ వరకు బిజెపి నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు .ర్యాలీ అనంతరం సుచిత్ర ఇన్ హోటల్ లో ఎన్నికల ప్రచారంలో భాగంగా వర్క్ షాప్ నిర్వహించారు . వర్క్ షాప్ కు ముఖ్య అతిథులుగా అంజిరెడ్డి ,ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ లు హాజరయి మాట్లాడుతూ...గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పేర్కొన్నారు. అలవికాని హామీలతో కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో ప్రచారం చేస్తే ఒక్క సీట్ కూడా రాలేదని ఎద్దేవా చేశారు . తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సైతం హామీలిచ్చి నెరవేర్చలేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపిస్తే శాసన మండలి హామీలపై నిలదీసే సత్తా వీరికి ఉంటుందా అని ప్రశ్నించారు. అనంతరం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ... ఎమ్మెల్సీ ఎన్నికలపై రహస్యంగా కాంగ్రెస్ పార్టీ సర్వే చేయించిందని ఆ సర్వేలో బీజేపీ అభ్యర్థులు గెలుస్తున్నారని తేలిందని పేర్కొన్నారు. ఒకవేళ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు గెలిస్తే మోసాలతో తప్పుడు వాగ్దానాలతో ఏర్పాటైన ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు ప్రశ్నించే దమ్ము ఉంటుందా? ఆలోచించండి మేధావులరా ? అని కోరారు. రిటైర్మెంట్ అయిన ఉద్యోగుల కు బెనిఫిట్ ఇవ్వలేని దుస్థితిలో తెలంగాణ ప్రభుత్వం ఉందని తెలిపారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఆలోచించి తమ అమూల్యమైన ఓటు బీజేపీ అభ్యర్థులకు వేసి శాసన మండలి లో పట్టభద్రుల ఉపాధ్యాయ సమస్యలపై ప్రశ్నించే అవకాశం కల్పించలని వారు కోరారు . ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్ ,బిజెపి నాయకులు రఘునాథ్ వేరవెల్లి, శ్యామసుందర్ రావు, ముల్కల్ల మల్లా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి13 (జనంసాక్షి)**




పంచాయితీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయితీ ఎన్నికల నిర్వహణ, ఆర్ఓ, ఏఆర్వోఓల విధులు తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. రిటర్నింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనర్ లు ఎన్నికల నిర్వహణ, విధుల నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, రానున్న పంచాయతీ ఎన్నికల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం మొదలుకొని, ఎన్నికల లెక్కింపు వరకు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణలో అన్ని రకాల ఫారాలను జాగ్రత్తగా పూరించాలన్నారు. రోజువారిగా ఎన్ని నామినేషన్ల వివరాలను గ్రామపంచాయతీ కార్యాలయ నోటీసు బోర్డు నందు అందుబాటులో ఉంచాలన్నారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, అనర్హమైన నామినేషన్లను తొలగించాలన్నారు. ఒక వ్యక్తి గరిష్టంగా నాలుగు సెట్ల నామినేషన్లను దాఖలు చేయవచ్చును అన్నారు. నామినేషన్ల చివరి రోజు నాటికి ఏదేని ఒక నామినేషన్ కు మాత్రమే కట్టుబడి ఉండాలన్నారు. ఒకవేళ నామినేషన్లు తిరస్కరణకు గురైతే సదరు వ్యక్తికి తిరస్కరణ పై అపీలు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించాలన్నారు. ఎన్నికలకు 44 గంటల ముందు నుంచి ప్రచారానికి అనుమతి ఉండదన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డిపిఓ శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్లు, రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సాగు నీళ్ళు ఇవ్వండి సారూ...

**ాపాలెం వాగు ప్రాజెక్టు ఈఈకి వినతి పత్రం**

**నూగూర్ వెంకటాపురం, ఫిబ్రవరి 13 (జనంసాక్షి):**



బర్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రైతులకు సాగు నీళ్ళు సకాలంలో రావడం లేదని గురువారం నర్సింహా మూర్తి పాలెం వాగు ప్రాజెక్ట్ ఈఈ జగదీష్ కు వెంకటాపురం ప్రభుత్వ విశ్రాంతి భవనంలో వినతిపత్రం అందజేశారు. పాలెం వాగు ప్రాజెక్ట్ నీళ్ళు రాక మొక్కజొన్న పంట ఎండి పోయి అప్పుల భారం తట్టుకోలేక కచ్చులపు చందర్ రావు అనే ఆదివాసీ రైతు ఆత్మ హత్య చేసుకున్నాడని ఈ ఈ కి తెలిపారు. మూడేళ్లుగా సాగునీరు అందక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని వివరించారు. ప్రధాన కాలువ కు ఉన్న తూములకు గేట్లు లేక నీరు మొత్తం వృధా అవుతోందని, తక్షణమే గేట్లు నిర్మించాలని అన్నారు .ముప్పై ఎకరాల విస్తీర్ణం ఉన్న చిరుతపల్లి చెరువు కు ప్రధాన కాలువ నుండి తూము లేక పోవడం కారణంగా చెరువు లోకి నీళ్ళు రావడం లేదని తెలియజేసారు. చెరువు కు నీళ్ళు వచ్చే విధంగా ప్రత్యేక ఏర్పాటు చేయాలని కోరారు . దిగువ భాగాన ఉన్న బర్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్ళు అందించాలని అన్నారు. కాలువ పైన ఎటువంటి పర్యవేక్షణ లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాలువకు అడ్డుకట్ట వేయడంతో కిందికి నీళు ్ళ రాక పోవడంతో రైతులకు తీవ్ర నష్టం వస్తుందని,అసహనం వ్యక్తం చేశారు. నీళ్ల కోసం ప్రతియేటా పోరాటం చేయాల్సి వస్తోందని ఆదివాసీ రైతులకు ఇంతటి దౌర్భాగ్యం దాపూరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మొక్క జొన్న పంట ఎండి పోయినందుకు చనిపోయిన చందర్ రావు, ఆత్మ హత్య కు ప్రభుత్వం బాధ్యత వహించాలని ఈఈ జగదీష్ ని డిమాండ్ చేశారు. చనిపోయిన చందర్ రావు కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని కోరడం జరిగింది. పిల్ల కాలువల పూడిక తీయమని నర్సింహా మూర్తి కోరగా అది తమ బాధ్యత కాదని, ఎంపిడిఓ చేత ఎన్.ఆర్.ఈ. జి.ఎస్,ద్వారా పూడిక తీపించుకోవాలని ఈఈ జగదీష్ సూచించారు. సత్వరమే బర్లగూడెం గ్రామపంచాయతి ఆయకట్టు రైతులకు నీళ్ళు అందేలా చూస్తానని ఈఈ జగదీష్ హామీ ఇచ్చారు. రైతులు ప్రవీణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి



**చిట్యాల/మొగుళ్లపల్లి ఫిబ్రవరి 13 (జనంసాక్షి)**

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం సాయంత్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు వేడుకల మందిరంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కుమారస్వామి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో దాదాపు అన్ని గ్రామాలలో పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించాలన్నారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కష్టపడే ప్రతి ఒక్కరికి అవకాశాలు వస్తాయని, పదవులు కోరుకుంటే రావని, ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గడపగడపకు తీసుకెళ్లే బాధ్యత గ్రామ నాయకులదేనన్నారు. వీలైనన్ని ఎక్కువ గ్రామాలు ఏకగ్రీవం అయ్యేలా చూడాలని పిలుపునిచ్చారు. పాత, కొత్త నాయకత్వం అని తేడా లేకుండా పనిచేయాలన్నారు. గ్రామాలలో వర్గాలుగా విడిపోయి పార్టీకి నష్టం చేసేలా చూస్తే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశాడు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రామ్ నర్సింహారెడ్డి, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# 100శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్య బోధన జరగాలి

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో ఫిబ్రవరి 13 (జనం సాక్షి)**




ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సంబంధించి వార్షిక పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి గమ్మానియేల్ అన్నారు. గురువారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలు, కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని మండల విద్యాధికారి వీ .ప్రభాకర్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిబంధనల మేరకు, జిల్లా కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా ప్రతిరోజు ఉపాధ్యాయులు పదవ తరగతి విద్యార్థులకు ఉదయం ప్రత్యేక తరగతులు, సాయంకాలం పరీక్షలు నిర్వహించాలని అన్నారు. అలాగే కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పథకం అమలు తీరుపై ఉపాధ్యాయులతో, మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాగజ్ నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత (నూతన)పాఠశాల, కేజీబీవీ, మండలంలోని నజరుల్ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో గల విలేజ్ నెంబర్ 3, విలేజ్ నెంబర్ 5 ఉన్నత పాఠశాలలను ఎంఈఓ తో కలిసి ఆకస్మికంగా తనికి నిర్వహించారు.

# రుద్రారం పాఠశాలలో విద్యార్థులు నిల్

**మల్హర్, ఫిబ్రవరి 13(జనంసాక్షి)**





భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండలంలోని రుద్రారం గ్రామపంచాయతీ పరిధిలోని పాత రుద్రారం 6వ వార్డులో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడి కేంద్రము-12లో విద్యార్థులు, చిన్నారులు లేక వేలవేలబో యాయి.గురువారం రోజున జనం సాక్షి పరిశీలించగా ప్రాథమిక పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు చేరవాణిలో మునిగిపోయారు.అంగన్ వాడి కేంద్రంలో టీచర్,ఆయా,చిన్నారులు ఎవరు లేరు.దీంతో పాఠశాల,అంగన్ వాడి కేంద్రం మూతపడతాయోని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

# ఇసుక అక్రమ రవాణాపై నిరంతర పర్యవేక్షణ

**జిల్లా ఎస్పి డా.శబరీష్**

**మంగపేట, ఫిబ్రవరి 13(జనంసాక్షి)**



ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ డా.శబరీష్ ఆదేశించారు. గురువారం మండల పరిధిలో గల రాజుపేట, కత్తిగూడెం ఇసుక క్వారీలపై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇసుక క్వారీలో గల ఇసుక నిల్వలపై ఆరా తీసి, క్వారీ ఆఫీసులో ఉన్న పలు రికార్డు పుస్తకాలను పరిశీలించినారు. ఇసుక క్వారీలో పనిచేసే సిబ్బంది ఎవరైనా ఎటువంటి అక్రమాలకు పాల్పడిన, జీరో బిల్లులు, డబుల్ ట్రిప్, అదనపు లోడ్, నకిలీ బిల్లులు, తప్పుడు వాహనంలో రవాణా, తప్పుడు గమ్యం స్థానం లాంటి ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని క్వారీలలో అలాగే ఇసుక తవ్వకం జరిపే అవకాశం ఉన్న నదులు, వాగుల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ఎవరైనా అక్రమ రవాణాకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం సర్కిల్ ఇన్స్పెక్టర్ అనుముల శ్రీనివాస్, స్థానిక ఎస్సై టివిఆర్ సూరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# శానిటరీ నాప్కిన్స్ కేంద్రం ప్రారంభించిన జిల్లా కలెక్టర్

**అదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి)**



అదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ఐటిడిఎ ఆద్వర్యంలో గురువారం ఓల్డ్ కోర్ట్ బిల్డింగ్ లో ఏర్పాటు చేసిన శానిటరీ నాప్కిన్స్ కేంద్రాన్ని నూతనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఇందులో ఉట్నూరు ప్రాజెక్టు అధికారిణి గిరిజన మహిళలచే నాగోబా జాయింటు లయాబిలిటి గ్రూపు, ఉట్నూరు ద్వారా సానిటరీ నాప్కిన్ మేకింగ్ యూనిట్ విలువ పన్నెండు లక్షల రూపాయలు విలువగల మిషన్ ను జిల్లా కలెక్టర్ తో కలసి ప్రారంభంచడం జరిగింది. కార్యక్రమంలో ఐటిడిఎ పిఓ కుష్బూ గుప్తా అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి రంగంలో గణనీయమైన పరివర్తన

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :**




**మేక్ ఇన్ ఇండియా, ఆత్మ నిర్భర్ భారత్ నుండి వికసిత్ భారత్ వైపు.**

**స్వదేశీ భావనను ప్రచారం చేయడంలో స్వదేశీ జాగరణ్ మంచ్ కృషి ప్రశంసనీయం**

దేశ ఉపాధి రంగంలో గణనీయమైన పరివర్తన చోటు చేసుకుంటుందని, భారత ప్రభుత్వం చేపట్టిన మేక్ ఇన్ ఇండియా, ఆత్మ నిర్భర్ భారత్, ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్స్ పథకాల ద్వారా ఉపాధి రేటు గణనీయంగా పెరిగిందని , దేశాన్ని , పౌరులను అన్ని విధాలుగా స్వతంత్రంగా, స్వావ లంబనగా మార్చడమే లక్ష్యంగా నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆ దిశలో స్వదేశీ జాగరణ్ మంచ్ చేస్తున్న కృషి అభినందనీయమని ప్రజ్ఞాభారతి రాష్ట్ర ఉపాధ్యక్షులు, సమాలోచన రాష్ట్ర కన్వీనర్, ప్రజ్ఞా ప్రవాహ కేంద్రీయ కార్య సమితి సభ్యులు మామిడి గిరిధర్ అన్నారు. స్వదేశీ మేళా ప్రోగ్రాం లో భాగంగా గురువారం రోజున కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియంలో డిగ్రీ, పీజీ విద్యార్థుల కు స్వదేశీ, గ్లోబలైజేషన్ అంశాలపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ... భారతదేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చడానికి ప్రారంభించిన మేకిన్ ఇండియా లాంటి కార్యక్రమం స్వావలంబి వైపు భారత్ ను ముందుకు తీసుకెళ్లడంలో, వికసిత్ భారత్ దృక్పథాన్ని నెరవేర్చడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. మూడు దశాబ్దాలుగా స్వదేశీ భావనను ప్రచారం చేయడంలో స్వదేశీ జాగరణ మంచ్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. మార్కెటింగ్ ప్రొఫెషనల్, మీడియా స్ట్రాటజిస్ట్ సురేష్ కొచ్చిటిల్, నేషనల్ లిస్ట్ హబ్ సీఈవో అవునూరి సాయి కృష్ణ లు మాట్లాడుతూ పెట్టుబడి , ఆవిష్కరణ, వ్యవస్థాపకతకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం ద్వారా దేశీయ తయారీని రంగాన్ని గణనీయంగా పెంచుకోవచ్చన్నారు . ఆ దిశగా నేటి ప్రభుత్వం ముఖ్యమైన కీలక రంగాలపై దృష్టి సారించిందని, తయారీ రంగాన్ని ప్రోత్సహించడం, ఉపాధిని సృష్టించడం, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం లాంటి విధానాలతో ముందుకు కొనసాగుతూ, భారతదేశం యొక్క ప్రపంచ పోటీ తత్వాన్ని పెంచడం లక్ష్యంగా ప్రయాణాన్ని కొనసాగిస్తుందన్నారు. స్వయం సమృద్ధి, దిగుమతుల తగ్గింపు, దేశీయ ఉత్పత్తి వృద్ధికి ప్రాధాన్యమిస్తూ ఆత్మనిర్భర్ భారత్ అవకాశాల అంతరంగాన్ని సృష్టిస్తుందన్నారు. కరీంనగర్ డైరీ చైర్మన్, స్వదేశీ మేళా కన్వీనర్ చెల్మెడ రాజేశ్వరరావు మాట్లాడుతూ, స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మేళా స్థానిక పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే లక్ష్యంతో , చేతితో తయారుచేసిన అద్భుతమైన వస్తువులు మొదలుకొని, తాజా సాంకేతిక ఆవిష్కరణల వరకు. విస్తృతమైన స్వదేశీ ఉత్పత్తులను మేళాలో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. సెమినార్ సభాధ్యక్షులు , రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జిల్లా సంఘచాలక్ సి. ఎ. నిరంజనాచారి,

వి హెచ్ పి ప్రాంత టోలిసభ్యులు ఊట్కూరిరాధాకృష్ణారెడ్డి మాట్లాడారు. మధ్యాహ్నం జరిగిన మెడికల్,

ఫార్మసి, నర్సింగ్ విద్యార్థుల సెమినార్ కార్యక్రమానికి అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు మామిడి గిరిధర్ హాజరై మాట్లాడారు. భారతదేశ వైద్యవృత్తి గొప్పదనాన్ని వివరించారు. అనుసరించాల్సిన విధానాలను, సూచనలను విద్యార్థులకు తెలియజేశారు. సాయంత్రం వేళ ప్రోగ్రాంలో భాగంగా ప్రముఖ వైద్యులచే సాంప్రదాయ వస్త్ర ప్రదర్శన కార్యక్రమాన్ని కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ మానస ఆధ్వర్యంలో చేపట్టారు.

# పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటాం

**రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు**




**మంథని, (జనంసాక్షి) :** రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. గురువారం హెచ్ఐసీసీ నోవోటెల్ లో నిర్వహించిన హైబిజ్ టీవీ బిజినెస్ ఎక్స్ లెన్స్ అవార్డ్స్ ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వం లో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని రాష్ట్రంలో కల్పించినట్లు వివరించారు. రాష్ట్రాభివృద్ధికి యువ నాయకత్వం చోదక శక్తిగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ అన్ని రంగాల్లో దేశంలోనే అత్యున్నత స్థానంలో ఉంటుందన్నారు. ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ గా తెలంగాణను మార్చేందుకు ప్రభుత్వంతో కలిసి పని చేయాలని పారిశ్రామికవేత్తలను కోరారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, టీజీఐఐసీ ఎండీ విష్ణు వర్ధన్ రెడ్డి, హైబిజ్ టీవీ, తెలుగు నౌ ఎండీ ఎం.రాజ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణ్ శక్తి- రాజ్య భాష అవార్డును గెలుచుకున్న ఎన్టీపీసి సంస్థ

**గోదావరిఖని (జనంసాక్షి) :**




హిందీని ప్రచారం చేయడంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను స్వర్ణ్ శక్తి- 2023-24 రాజ్య భాష అవార్డురామగుండం ఎన్టీపీసీ సంస్థ దక్కించుకున్నది . ఈ ఘనత సి.కె. సమంత, ప్రాజెక్ట్ హెడ్.ఈ అవార్డును బి వో డి లతో పాటు ఏ న్టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్ కు అందిం చారు. ఐ పి ఎస్ సమ్మిట్ - 2025 సందర్భంగా రాయ్పూర్లో సీకే సమంత, ఎచ్ ఓ పి (అర్ అండ్ టీ ) అందుకున్నారు. ఈ సందర్భంగా టీమ్ను అభినందిస్తూ, సమంత మొత్తం రామగుండం తెలంగాణ (అర్ అండ్ టీ ) కుటుంబ సభ్యుల కృషిని ప్రశంసించారు.ఈ కార్యక్రమం లో బాబర్ సలీం పాషా, సెంట్రల్ ఎన్బిసి సభ్యుడు కూడా తన అభినందనలు తెలియజేశారు, ముఖ్యంగా బి.కె. సిక్దర్, హెచ్ఆర్ హెడ్, ఆదేశ్ కుమార్ పాండే లు మాట్లాడుతూ రామగుండం హిందీ మాట్లాడని ప్రాంతం అయినప్పటికీ, FC అధికారిక పనిలో హిందీని అమలు చేయడంలో బృందం అద్భుతంగా పని చేసిందని, ఈ అవార్డును గెలుచుకోవడం ఒక గొప్ప విజయంఅని అన్నారు.

# కులగణనలో తెలంగాణ రోల్ మోడల్

- దేశ మొత్తం ప్రభావితం చేస్తాం
- ఇప్పుడు జరిగేది రీ సర్వే కాదు
- ఇప్పటి వరకు సర్వేలో పాల్గొనని 3.1 శాతం వారివి మాత్రమే తీసుకుంటాం
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్




కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) : కులగణనలో తెలంగాణ దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ డిసిసి కార్యాలయంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతోపాటు పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి గురువారం ఆయన పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... కోటి 15 లక్షల కుటుంబాలకు కోటి 12 లక్షల కుటుంబాలు స్వచ్ఛందంగా సమాచారం ఇచ్చాయని, 150 కుటుంబాలకు ఒక గ్రూపింగ్‌గా చేశామని తెలిపారు. పదిమంది ఎన్యూమరేటర్లకు ఒక పరిశీలకుడిని పెట్టి మండల స్థాయి రాష్ట్రస్థాయిలో ఈ ప్రక్రియ కొనసాగిందని, దాదాపు 3.1 శాతం లో కొంత మంది తమ సమాచారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి కూడా అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఫిబ్రవరి 16 నుండి 28వ తేదీ వరకు తెలంగాణ వ్యాప్తంగా ఇంకా సమాచారం ఇవ్వని 3.1 శాతం ప్రజలు దీనిని ఉపయోగించుకోవాలన్నారు. కొంతమంది బిఆర్ఎస్ నేతలు రీ సర్వే జరుగుతుంది అంటున్నారు. ఇది రీ సర్వే కాదు ఎవరైతే సర్వేలో మిస్సయ్యారు సర్వేలో సమాచారం ఇవ్వలేధో వారు సమాచారం ఇవ్వడానికి మరొక అవకాశం ఇచ్చిందని తెలిపారు. మార్చ్ మొదటి వారంలో క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేసి క్యాబినెట్ సమావేశం తర్వాత ప్రత్యేక శాసనసభ సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. 42 శాతం స్థానిక సంస్థల్లో, విద్యా, ఉపాధి అవకాశాల్లో బలహీన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాలని సంకల్పంతో చట్టబద్ధత తెచ్చే కార్యాచరణ తీసుకున్నామన్నారు. ఎక్కడెక్కడ మిస్సయ్యారో ప్రజలందరికీ సర్వేలో పాల్గొనాలని విజ్ఞప్తి చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ప్రక్రియ దేశవ్యాప్తంగా ప్రకంపనలు కలిగించి మా నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో బడ్జెట్ సమావేశంలో దీనిని ఆమోదింప చేసుకొని కాంగ్రెస్‌కు ఉన్న 100 మంది పార్లమెంట్ సభ్యులతో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులతో సహా అన్ని రాజకీయ పార్టీలను కలిసి తమిళనాడులో మాదిరి 69 శాతం రిజర్వేషన్లు ఎలా ఉపయోగిస్తున్నారో అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రిజర్వేషన్ల పెంపు బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదని, రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధంగా శాసనసభలో సభ అభిప్రాయంతో పాటు తీర్మానాన్ని ప్రవేశపెడతామని తెలిపారు. స్థానిక సంస్థలు ఎన్నికలు వాయిదా పడడం వల్ల కేంద్రం నుండి నిధులు రావో ఆ నిధులను కూడా తెలంగాణ ప్రభుత్వం భరించి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఎక్కడ ఇబ్బందులు కలగాకుండా చూడాలని ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుందని తెలిపారు. శాసనసభలో బిల్లు చేసి చట్టబద్ధత చేసి కేంద్రానికి పంపిస్తామన్నారు. బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలకు బలహీన వర్గాలపైన చిత్తశుద్ధి ఉంటే పారదర్శకత నిరూపించుకోవాలని సూచించారు.

### 16 నుండి 28 మధ్య జరిగే ఈ ప్రక్రియలో పాల్గొనాలి

గతంలో కూడా గ్రామీణ ప్రాంతాల్లో దూదేకులా లాంటి ముస్లింలకు సంబంధించిన కులాలు బీసీల్లో ఉండేవి మనం కొత్తగా తెచ్చినవి కాదని, బీసీ జనాభా 56% వచ్చింది మేం 46% రిజర్వేషన్లు ఇస్తామని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వచ్చే విధంగా కేంద్రంలో మీ ప్రయత్నాన్ని కొనసాగించండి. బెషాజలలు విమర్శలు లేవు, మేం దినం మాకు ఇష్టం వచ్చినట్టు చేస్తామని అనడం లేదు అందరిని పిలిచి మాట్లాడుతున్నామని 1931లో స్వతంత్రం రాకముందు కుల సర్వే జరిగిందని,మళ్లీ ఇప్పుడు మాత్రమే జరిగిందన్నారు.

# హైదరాబాద్ అభివృద్ధికి రూ.15 వేల కోట్లు

- ఐటి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు



మంథని, (జనంసాక్షి) : హైదరాబాద్ ను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం రూ.15 వేల కోట్లతో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. గురువారం గచ్చిబౌలిలో మైక్రోసాఫ్ట్ నూతన భవనాన్ని సిఎం రేవంత్ రెడ్డితో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఆయన ప్రసంగించారు. మెట్రో రైలు విస్తరణ, రీజనల్ రింగురోడ్డు, ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, విద్యుత్తు వాహనాల ఉత్పత్తి కేంద్రంగా, క్వాంటమ్ ఇంజనీరింగ్, బయో ఇన్ఫర్మేటిక్స్ రంగాలతో పాటు మూసీ పునరుజ్జీవన పథకం ద్వారా ఈ నగరం సుస్థిరాభివృద్ధికి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తమ ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకెళ్తోందని శ్రీధర్ బాబు చెప్పారు. మైక్రోసాఫ్ట్ సంస్థతో హైదరాబాద్ అనుబంధం మూడు దశాబ్దాల నాటిదని, తాజాగా 11 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన భవనం నిర్మించడం ద్వారా తన అంకితభావాన్ని చాటుకుందని ఆయన ప్రశంసించారు. రూ.15 వేల కోట్ల పెట్టుబడితో భారీ ఏఐ డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తోందని ఆయన తెలిపారు. దేశంలోనే హైదరాబాద్ ను అతిపెద్ద డేటా సెంటర్ల హబ్ గా మారుస్తోందని కొనియాడారు. 'ఏఐ సిటీలో తమ కృత్రిమ మేధ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్టు ఆ సంస్థ ప్రకటించడం మా ప్రభుత్వ విశ్వసనీయతకు నిదర్శనం. సాంకేతిక దిగ్గజాలైన మైక్రోసాఫ్ట్ సిఇఓ సత్య నాదెళ్ల, అడోబ్ సిఇఓ శంతను నారాయణ్ లను ప్రపంచ టెక్నాలజీకి అందించిన ఘనత ఈ నగరానిది. నూతన ఆవిష్కరణలకు మూలస్థంబంగా స్థానం సంపాదించుకుంది. ప్రపంచంలోని ప్రతి మూలన జరుగే సాంకేతిక విప్లవానికి ఈ నగరం ఏదో రకంగా భాగస్వామిగా ఉంటోంది. ఇక్కడితో మేం సంతృప్తి చెందడం లేదు. ఇది ఒక ఆరంబం మాత్రమే కాదు. సుదీర్ఘ ప్రస్థానానికి రహదారులు వేస్తున్నాం. 52 ప్రపంచస్థాయి పరిశోధన కేంద్రాలు, 30కి మించిన విశ్వవిద్యాలయాలు, 6 సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్సులు, 60 లక్షల మంది ఉత్సాహం ఉరకలెత్తే శ్రామికశక్తితో హైదరాబాద్, తెలంగాణా వెలుగులీనుతోంది. 90 లక్షల ఇళ్లను డిజిటల్ కనెక్టివిటిలోకి తీసుకొస్తున్నాస్తున్నాం' అని శ్రీధర్ బాబు వెల్లడించారు.

# పుదుచ్చేరిలో పర్యటించండి

- చిన్నారెడ్డితో పుదుచ్చేరి రాష్ట్ర మాజీ హోం మంత్రి కంద స్వామి భేటీ
- వచ్చే ఏడాది జరుగనున్న పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలపై చర్చ



హైదరాబాద్ (జనంసాక్షి) : పుదుచ్చేరి రాష్ట్ర హోం శాఖ మాజీ మంత్రి కంద స్వామి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గురువారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో జరిగిన ఈ భేటీలో పుదుచ్చేరి రాష్ట్రంలో వచ్చే సంవత్సరం జరగనున్న అసెంబ్లీ ఎన్నికల అంశం చర్చకు వచ్చింది. కొన్నేళ్ల క్రితం పుదుచ్చేరి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా చిన్నారెడ్డి ఉన్న సమయంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పుదుచ్చేరి రాష్ట్రానికి చిన్నారెడ్డి సెంటిమెంట్ గా మారడంతో ఆ రాష్ట్ర మాజీ హెూం శాఖ మంత్రి కందస్వామి హైదరాబాద్‌కు వచ్చి చిన్నారెడ్డి తో సమావేశమయ్యారు. పుదుచ్చేరి రాష్ట్రంలో పర్యటించాలని చిన్నారెడ్డిని కంద స్వామి ఆహ్వానించారు. పుదుచ్చేరిలో వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ క్యాడర్ కు దిశా నిర్దేశం చేయాల్సిందిగా కంద స్వామి రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డిని కోరారు. త్వరలోనే పుదుచ్చేరి రాష్ట్ర పర్యటనకు వస్తానని చిన్నారెడ్డి హామీ ఇచ్చారు. ఈ భేటీలో టిపిసిసి ఓబీసీ సెల్ సమన్వయకర్త విక్రమ్ యాదవ్ కూడా ఉన్నారు.

# కోమటికుంటలో 'హైడ్రా' తొలగింపులు





- ప్రకృతి రిసార్ట్స్, ప్రకృతి కన్వెన్షన్ కూల్చివేత
- అనుమతి లేని 53 హోర్డింగులు కూల్చిన హైడ్రా

హైదరాబాద్, ఫిబ్రవరి13 (జనంసాక్షి) : మేడ్చెల్ - మల్కాజిగిరి జిల్లా తూముకుంట మున్సిపాలిటీ, దేవరయాంజల్ గ్రామంలోని కోమటికుంటలో గురువారం అక్రమ కట్టడాలను హైడ్రా తొలగించింది. కోమటికుంటలోని ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలపై హైడ్రాకు స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులతో పూర్తి స్థాయి విచారణ చేపట్టింది. కోమటి కుంట చెరువు పరిధిలో నిర్మించిన ప్రకృతి రిసార్ట్స్, ప్రకృతి కన్వెన్షన్‌కు ఎలాంటి నిర్మాణ అనుమతులు లేవని తేలింది. అలాగే చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఈ నిర్మాణాలు జరిగినట్టు వెల్లడి కావడంతో కూల్చివేతలకు హైడ్రా ఆదేశాలిచ్చింది. హైడ్రా నోటీసులపై ప్రకృతి రిసార్ట్స్, ప్రకృతి కన్మెన్షన్ ప్రతినిధులు హైకోర్టును ఆశ్రయించారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన వాటిని కూల్చివేయాలంటూ హైకోర్టు తీర్పు ఇచ్చింది. తామే తొలగిస్తామని.. 30 రోజుల సమయం కావాలని హైకోర్టును ప్రకృతి రిసార్ట్స్, ప్రకృతి కన్మెన్షన్ ప్రతినిధులు కోరారు. 30 రోజులు దాటినా వాటిని తొలగించక పోవడంతో గురువారం హైడ్రా నేరుగా రంగంలోకి దిగి కూల్చివేసింది.

### కొనసాగుతున్న హోర్డింగుల తొలగింపు

నగర శివారు మున్సిపాలిటీల్లో అనుమతి లేని హోర్డింగ్‌ల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. మున్సిపాలిటీ అధికారుల సమక్షంలో శుక్రవారం నుంచి గురువారం వరకూ 53 హోర్డింగులు తొలగించారు. యూనిపోల్స్ 35, యూని స్ట్రక్షర్స్ 04, ఇంటి పై కప్పులపైన పెట్టిన హోర్డింగ్స్ 14 తొలగించారు. శంషాబాద్, కొత్వాల్‌గూడ, నార్సింగి, తొండుపల్లి, గొల్లపల్లి రోడ్డు, తెల్లాపూర్ ప్రాంతాల్లో రహదారులకు ఇరువైపులా ఉన్న వాటిని సైతం తొలగించారు.

### అనుమతులుంటే తొలగించబోం: హైడ్రా

శుక్రవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ని యాడ్ ఏజెన్సీ ప్రతినిధులు కలిసారు. అనుమతులున్న వాటిని తొలగించబోమని రంగనాథ్ స్పష్టం చేశారు. నగర శివారు మున్సిపాలిటీల పరిధిలో అనుమతులు లేని ప్రకటనల హోర్డింగ్‌లను (యూనీ పోల్స్, యూనీ స్ట్రక్షర్లు, హోర్డింగ్‌లను తొలగిస్తామని తెలిపారు. అనుమతులు లేనివాటిని తొలగించేందుకు వారం, 10 రోజులు సమయం కావాలని.. ప్రతినిధులు కోరగా.. గతంలో ఇచ్చామని.. మీరు ముందుకు రాకపోవడంతోనే హైడ్రా తొలగింపులు చేపట్టిందని స్పష్టం చేశారు.

# నార్సింగ్ పోలీసుల కస్టడీకి మస్తాన్ సాయి

- నేరాల చిట్టా కూపీలాగనున్న పోలీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) : నటుడు రాజ్ తరుణ్ - లావణ్య కేసులో కీలక నిందితుడు మస్తాన్ సాయిని నార్సింగి పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. చంచల్ గూడ జైలులో రిమాండ్ లో ఉన్న మస్తాన్ సాయిని కోర్టు అనుమతించడంతో గురువారం కస్టడీలోకి తీసుకున్నారు. ఈ కేసులో మరిన్ని ఆధారాలు రాబట్టేందుకు నార్సింగి పోలీసులు రంగంలోకి దిగారు. సైబర్ నేరం, లైంగిక డాడీ, బ్లాక్ మెయిలింగ్ వంటి దురాగతాల కేసులో యూట్యూబర్ మస్తాన్ సాయి పై పలు అభియోగాలు ఉన్నాయి. రాజేంద్రనగర్ కోర్టు మూడు రోజుల కస్టడీకి అనుమతి ఇవ్వడంతో కస్టడీలోకి తీసుకున్న నార్సింగి పోలీసులు విచారణ చేయనున్నారు. మస్తాన్ సాయి దగ్గర 300 మంది అమ్మాయిల వీడియోలు ఉన్నాయని, అమ్మాయిలను బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని లావణ్య ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. లావణ్య ఫిర్యాదు మేరకు సోమవారం మస్తాన్ సాయిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఈ కేసులో చంచల్ గూడ జైలులో రిమాండ్ లో ఉన్న మస్తాన్ సాయిని నార్సింగి పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. లావణ్య ఫిర్యాదు మేరకు ఈ కేసులో మరిన్ని కీలక ఆధారాలు, వివరాలు రాబట్టనున్నారు పోలీసులు. పలువురు అమ్మాయిలతో ప్రైవేట్ గా ఉన్న సమయంలో వీడియోలు రికార్డ్ చేసినట్లు మస్తాన్ సాయిపై ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేట్ గా గడిపిన వీడియోలతో మస్తాన్ సాయి బ్లాక్ మెయిల్ కు పాల్పడుతున్నట్లు గుర్తించారు పోలీసులు. తనకు చెందిన కొన్ని వీడియోలను మస్తాన్ సాయి రికార్డ్ చేశాడని పేర్కొన్న లావణ్య.. వీడియోలను పోలీసులకు అందజేసింది. మస్తాన్ సాయి హార్డ్ డిస్క్ లో 300 వీడియోలకు పైగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

# కిషన్‌రెడ్డి, సంజయ్ కోతల రాయుళ్లు

- మీకు కోతలు ఎక్కువ.. పని తక్కువ
- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్




హైదరాబాద్ బ్యూరో (జనంసాక్షి) : కిషన్ రెడ్డి, బండి సంజయ్ కోతల రాయుళ్లని వాళ్లకు కోతలు ఎక్కువ పని తక్కువ అని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి విమర్శించారు. కేంద్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి ఐటీఐఆర్ ఇవ్వలేకపోయిందని రాష్ట్రాన్ని పదేళ్లు పరిపాలించిన బీఆర్ఎస్ దాన్ని సాధించడంలో విఫలం అయిందన్నారు. తెలంగాణకు ఐటీఐఆర్ వస్తే 35 లక్షల మందికి ఉపాధి దొరుకుతుందని అందువల్ల కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తెలంగాణకు ఐటీఐఆర్ తెచ్చి తమ మగతనం చూపించాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు. గురువారం గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడిన జగ్గారెడ్డి.. బీజేపీ ఎంపీలు కేంద్రం నుంచి రాష్ట్రానికి ఏం తీసుకురావాలో ఆలోచించాలి తప్ప కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఏక్కడ సమావేశం అయ్యారు? ఎక్కడ భోజనం చేస్తున్నారో తెలుసుకోవడం కాదన్నారు. కచ్చితంగా ఐటీఐఆర్ వచ్చే వరకు పోరాడుతానన్నారు.

### పింక్ బుక్ పేరుతో రెచ్చగొడుతున్నారు..

కవిత తన ఉనికి కోసమే రాహుల్ గాంధీపై, కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని జగ్గారెడ్డి దుయ్యబట్టారు. పింక్ బుక్ పేరుతో రేవంత్ రెడ్డిని కవిత అనవసరంగా రెచ్చగొడుతున్నారని గతంలో నరేంద్ర మోడీని రెచ్చగొట్టడం వల్లే నాలుగు నెలలు జైలుపాలయ్యారని అన్నారు. 'పింక్ బుక్ రాయడానికి కవితకు ఏం అవసరం వచ్చింది. పాపం ఆడపిల్లవు మొన్ననే నాలుగు నెలలు జైలుకు వెళ్లివచ్చావు. మీమ్మల్ని జైలుకు పంపితే మాకూ బాధనిపించింది. ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ల సమయం ఉంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పని తాను చేసుకుంటూ వెళున్నారు. మీరు కూడా ప్రశాంతంగా మీ పని మీరు చేసుకోండి. కేసీఆర్ రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి వెళ్లారు. చేసిన తప్పులంతా మీరే చేసి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుల చిట్టా రాయడం ఏంటి?' అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ భయంతోనే వరంగల్ కు రాలేకపోయారనే కవిత విమర్శలకు స్పందిస్తూ కవిత తన స్థాయిని తెలుస్కుకని మాట్లాడాలని ఆమె తన ఉనికిని కాపాడుకునేందుకు అలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తోడేళ్లకు భయపడే పార్టీ కాంగ్రెస్ కాదన్నారు.

# 136 ఏళ్ల చరిత్రలో తొలిసారి







- సింగరేణి సీఎండీ గనుల బాట
- కార్మిక చైతన్య యాత్ర పేరిట కార్మికులతో మమేకం
- ఉత్పత్తి పెంచాలని సందేశం.. రక్షణ మరవొద్దని హితబోధ
- మస్టర్ పడి బయట తిరిగితే ఎంతటివారైనా కఠిన చర్యలు

(ప్రత్యక్ష ప్రతినిధి/ జనం సాక్షి)

136 సంవత్సరాల సింగరేణి చరిత్రలో బాయి బాట పట్టిన మొదటి సిఎండి ఎన్. బలరాం! గనుల మీద ఈ యంగ్ అండ్ డైనమిక్ ఐఆర్ఎస్ అధికారి సింగరేణి బలోపేతానికి గట్టి పిల్లర్ అయ్యారు. అంటే అతిశక్తికాదు! మస్టర్ పడి పనిచేయకుండా గాలికి తిరిగితే ఉపేక్షించేది లేదని, సున్నితముగా సిఎండి వార్నింగ్ కూడా ఇచ్చారు. అయన కార్మికుల,చైతన్య యాత్ర పేరిట ఈ నెల 12 నుంచి రెండు రోజుల పేరిట ఫిబ్రవరి 13వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సీఎండీ పర్యటన సాగింది. శ్రీరాంపూర్ ఏరియా, మందమర్రి, బెల్లంపల్లి, రామగుండం -1 ఏరియా, రామగుండం -2 ఏరియాల్లో పాల్గొని పలు పనులను, గనులను, కార్యాలయాను సందర్శించారు. గురువారం మధ్యాహ్నం 3.10 గంటలకు ఆర్జీ-1 జీఎం కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. సాయంత్రం 5 గంటలకు రామగుండం-3 ఏరియా ఆర్జీ ఓసీ-1 గనిలో పర్యటించారు. సిఎండి హెూతో అయిసా.. బలరాం భాయ్ జైసా అనుకుంటున్నారు కార్మికులు. ఇలాంటి సిఎండిని సింగరేణికి ఇచ్చినందుకు సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్క కు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

# ఎండ ముదిరి.. దాహం వేసి..



దినదినం ఎండలు మండిపోతున్నాయి. ఎండా కాలం రాకముందే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఓ రామ చిలుక ఆకాశంలో ఎగురుతున్న వేళలో పడమటి సంధ్యారాగ సమయంలో దాహం వేసింది. అలా వెళ్ళే క్రమంలో అడవిలో ఓచోట వాగు కనిపించింది. వెంటనే కిందకు వాలి అందులో నీరు తాగి దాహం తీర్చుకుని సంతోషంతో వెళ్లి పోయింది. ఈ దృశ్యంను జనంసాక్షి ప్రతినిధి, ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫోటో గ్రాఫర్ లింగంపల్లి కృష్ణ తన కెమెరాలో బంధించాడు.

– ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి)

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370